# బాల వ్యాకరణం - 2

**ఎం.ఏ. - తెలుగు, మొదటి సంవత్సరం - నాల్గవ పేపరు**


రచయిత

ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు

ఎం. ఏ., ఎం. ఫిల్., పిహెచ్. డి.

తెలుగు శాఖ

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం

వారణాసి, ఉత్తర ప్రదేశ్

ఆచార్య ఎన్.వి కృష్ణారావు

ఎం. ఏ., ఎం. ఫిల్., పిహెచ్. డి.

తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**సమన్వయకర్త:**

**డా॥ ఇ. మాధవీ,** ఎం.ఏ., ఎం.ఫిల్.,పి.హెచ్.డి.

తెలుగు మరియు ప్రాచ్యభాషా విభాగము

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

Director

**Dr. NAGARAJU BATTU**

**M.B.A., M.H.R.M., L.L.M., M.Sc. (Phy), M.A. (Soc.)., M.Ed., M.Phil., Ph.D.**



## దూర విద్యా కేంద్రము

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.

Ph: 0863-2293299, 2293356 (08645), 211023, 211024 (Study Material)

E-mail : anucdedirector@gmail.com

Website: www.anucde.info

**M.A. Telugu : Balavyakaranam-2**

Edition: 2022

No. of Copies:

(C) Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of Distance Education, Acharya Nagarjuna University and this book is meant of limited circulation only.

Published by:

**Dr. NAGARAJU BATTU**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

Printed at:

# బాల వ్యాకరణం -2

1. కారక - పరిచ్ఛేదం
2. సమాస - పరిచ్ఛేదం
3. తద్ధిత - పరిచ్ఛేదం
4. కృదంత - పరిచ్ఛేదం
5. ప్రకీర్ణక - పరిచ్ఛేదం

ఆధార గ్రంథాలు:


1. బాల వ్యాకరణం - పరవస్తు చిన్నయ సూరి
2. ఘంటాపద వ్యాఖ్య - వంతరాం రామకృష్ణ రావు
3. సుప్రభవ్యాఖ్య - ఆచార్య పి. నరసింహారెడ్డి
4. బాలవ్యాకరణ వికాస వ్యాఖ్య- ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తం
5. బాల వ్యాకరణద్యోతము- వజల చిన సీతారామశాస్త్రి
6. రమణీయము - దువ్వూరి వేంకట రమణ శాస్త్రి

# విషయ సూచిక


1 . కారక, సమాస పరిచ్ఛేదాలు ( వ్యాసరూప ప్రశ్నలు ) 1 - 27

2 . తద్ధిత , కృదంత, ప్రకీర్ణక పరిచ్ఛేదాలు ( వ్యాసరూప ప్రశ్నలు ) 28 - 46

3 . పారిభాషిక పదాలు 47 - 65

4 . రూపసాధనలు 66 - 83

5 . సందర్భ సహిత వివరణలు 84 - 94

6 . సూత్ర వ్యాఖ్యానాలు 95 - 128

అనుబంధాలు 129 - 135

మాదిరి ప్రశ్నాపత్రం 136

పాఠం -1

# వ్యాసరూప ప్రశ్నలు

**విషయ సూచిక**

1. ఉపోద్ఘాతం
2. కారక పరిచ్ఛేదం
3. సమాస పరిచ్ఛేదం

## 1. ఉపోద్ఘాతం:

ఈ పాఠ్య భాగంలో కర్తృ కారకం , కర్మకారకం, కరణ కారకం, సంప్రదాన కారకం, అపాదాన కారకాలను, సమాస విభజనను గూర్చి తెలుసుకుంటారు.

## 2.కారక పరిచ్ఛేదం

**1) చిన్నయసూరి పేర్కొన్న కారకాన్ని వివరించండి.**

కారకం 'కృ' అనే ధాతువు నుంచి వచ్చింది. 'కృ' ధాతువుకి 'చేయు' అని అర్థం. 'చేయు" అనేది క్రియ. ఇది వ్యాపారవాచకం. "కారకం వాక్యంలో క్రియాపదం సూచించే పనిని తెలియజేస్తుంది." క్రియానిష్పాదితమైన కర్త, కర్మాది షటానికి కారకమని పేరు. కర్త్రాదుల్ని చెప్పే వ్యాకరణ విభాగానికి కూడా కారకమని పేరు. వ్యాకర్తలు కారకాన్ని ప్రథమకు కర్తృకారకమని. ద్వితీయకు కర్మకారకమని, తృతీయకు కరణకారకమని, చతుర్థికి సంప్రదానకారకమని, పంచమికి అపాదానకారకమని, సప్తమికి అధికరణకారకమని ఆరు రకాలుగా పేర్కొన్నారు. కారకాల్లో చేరని షష్ఠిని శేషషష్ఠి లేదా సంబంధషష్ఠి అని అంటారు. శేషమంటే సంబంధమని అర్థం. విభక్తిని కారకాన్ని ఒకే అర్థంలో పేర్కొంటుంటారు. కాని విభక్తి అర్థాన్ని బోధించేవి కారకం. చిన్నయసూరి తత్సమ పరిచ్ఛేదంలో "డు-ము-వు-లు ప్రథమ, నువర్ణంబు ద్వితీయ, చేత-తోడ తృతీయ, కొఱకు-కయి చతుర్థి, వలన-కంటె-పట్టి పంచమి, కు-యొక్క-లోపల షష్ఠి, అందు-న సప్తమి" అని పేర్కొన్నాడు.

కారకం వాక్యం యొక్క అర్థనిర్ణయానికి తోడ్పడుతుంది. ఇది భాషలోని నామవిభక్తుల ఆధారంగా వ్యక్తమవుతుంది. కాబట్టి కారకఫలితార్థం విభక్తిలి. విభక్తులు భాషకు ఒక ప్రధానమైన అంగం. విభక్తిరహితమైన భాష అర్థరహితంగా, అస్పష్టంగా, అయోమయంగా ఉంటుంది. కారకం విభక్తిచేత వ్యక్తమవుతూ భాషను అర్థవంతంగా తీర్చిదిద్దుతుంది.

'ఆంధ్రభాషాభూషణం', 'కావ్యాలంకారచూడామణి'లలో విభక్తుల ఉపయోగం సూచించ బడింది. 'ఆంధ్రకౌముది'లో కారకాలను గురించిన వివరణలు పూర్వవ్యాకరణాలకంటే విశేషంగా ఉన్నాయి.

తరువాతి వ్యాకరణాల్లో 'లఘువ్యాకరణం'లో 'విభక్త్యర్థ ప్రకరణం' ఉంది. చిన్నయసూరి ఈ కారకాలకు

ప్రత్యేక ప్రకరణాన్నే ఏర్పాటుచేశాడు. ఏయే విభక్తుల ఏయే అర్థాల్లో ప్రయోగించ బడతాయో చింతామణి వివరించలేదు. "సర్వవిభక్తిః సంస్కృత తుల్యా" అని పేర్కొని, సంస్కృత కారక విధానాన్ననుసరించి తెలుగులో కారకాలను ఏర్పాటుచేసుకోవాలని ఉద్దేశించాడు. ఇలా సంస్కృత కారకాన్ని స్థూలంగా అంగీకరించినప్పటికీ, ఒక విభక్తికి మారుగా ఇంకొక విభక్తి రావటాన్ని కూడా చెప్పాడు. తెలుగుకు పూర్తిగా సరిపడని కర్మ ప్రవచనీయాలను కూడా 'చింతామణి' పేర్కొంది. కేతన పెద్దనాదులు కారకంపట్ల వహించిన శ్రద్ధ చాలా తక్కువ. ప్రాచీనులలో ఈ ప్రకరణాన్ని బాగా విస్తృతంగా వివరించిన ఘనత 'ఆంధ్రకౌముది'కే చెందుతుంది. అర్వాచీనులలో వేదంవేంకటరాయశాస్త్రి 'లఘు వ్యాకరణం'లో విభక్త్యంత ప్రకరణాన్ని ఏర్పాటుచేశాడు. తరువాతి వాళ్ళకూ ఇదే ఆదర్శమైంది.

**కర్తృకారకం :**

కర్తృ కారకంలో కర్తను తెలిపే ప్రాతిపదికకు ప్రథమా విభక్తి ప్రత్యయాలు చేరతాయి. అఖ్యాతం కర్తను చెపుతున్నపుడు నామానికి ప్రథమావిభక్తి ప్రత్యయాలు చేరతాయి. 'ఆఖ్యాతం' అంటే 'క్రియా విభక్తి'. క్రియా విభక్తులు డు జ్, రు; వు రు; నుము.

ఉదా॥ రాముఁడు రావణుని సంహరించెను. 'సంహరించెను' అనే క్రియలో క్రియావిభక్తి. 'ఎను'. ఇది 'డు ఙ్డు' కు బదులు వచ్చింది. ఇది 'రామ' అనే కర్తను తెలుపుతున్నది కాబట్టి 'రామ' శబ్దానికి ప్రథమా విభక్తి డుజ్ చేరుతుంది. రాముఁడు.

'ధాత్వర్థ వ్యాపారాశ్రయం కర్త' అని నిర్వచనం. పై ఉదాహరణలో 'చంపు' అనే ధాతువు తెలిపే వ్యాపారం (పని) నిర్వహించిన వాఁడు 'రాముఁడు' కాబట్టి 'కర్త' అవుతాడు.

ఆఖ్యాతం కర్తను చెప్పనపుడు అలాంటి కర్తను 'అనభిహిత కర్త' అంటారు. అనభిహిత కర్తను తెలిపే ప్రాతిపదికకు 'చేత' అనే ప్రత్యయం చేరుతుంది (అ కా. 3) ఉదా॥ దేవదత్తుని చేత వంటకము వండఁబడియె.

'వంటచేయడం' అనే ధాతువు యొక్క వ్యాపారానికి ఆశ్రయం 'దేవదత్తుఁడు' : అయితే ఇక్కడ ఈ వాక్యం 'కర్మార్థక వాక్యం'. కర్మార్థక వాక్యంలో కర్మకు ప్రాధాన్యం ఉంటుంది. అందువల్ల పై ఉదాహరణలో కర్త 'అనభిహితకర్త' 'చేత' కు బదులు 'చే' కూడ రావచ్చు. దేవదత్తుని చేత వంటకము వండఁబడియె.

**అధ్వం:** 'అధ్వం' అంటే మార్గం. దూరాన్ని తెలిపే శబ్దాల్ని 'అధ్వవాచకాలు' అంటారు. అలాంటి ప్రాతిపదికలు ప్రథమలో ఉంటాయి. (కా. 25) ఉదా॥ వారు క్రోశము నడచిరి.

'వీరు ఆమడ పోయిరి'.

'క్రోశము' – అనేది దూరాన్ని తెలిపే అధ్వవాచకం. అలాగే 'ఆమడ' ప్రథమలో ఉంది.

**కాలం:** కాలాన్ని తెలిపే ప్రాతిపదికలకు ప్రథమ' వస్తుంది. నిన్న, నేడు, రేపు మొ॥నవి. కాలవాచకాలు.

వీటికి ప్రథమ వస్తుంది.

ఉదా॥ వాఁడు నిన్న వచ్చే

వీఁడు నేఁడు పోయె

మాపు నిలువుము, ఊపు పొమ్ము

నిన్న, నేఁడు, మాపు, ఊపు అనేవి కాలవాచకాలు. ప్రథమలో ఉన్నాయి.

ప్రాతిపదికార్థం ప్రాతిపదిక యొక్క అర్థం ప్రాతిపదిక అర్థం. ప్రాతిపదికార్థంలో ప్రాతిపదికకు 'ప్రథమ' వస్తుంది. (కా. 1) 'నియతోప్షస్థితికం' ప్రాతిపదికార్థం. ప్రాతిపదికను ఉచ్చరిస్తూనే నియతంగా స్ఫురించే అర్థం ప్రాతిపదికార్థం.

ఉదా॥ రామ – అనే శబ్దం ఉచ్చరిస్తూనే దశరథుని పుత్రుడు అని స్ఫురిస్తుంది. ఇదే రామ అనే ప్రాతిపదిక యొక్క అర్థం. అలాగే రావణ అంటూనే లంకాధిపతి అని అర్థం స్ఫురిస్తుంది. ప్రాతిపదికార్థంలో ప్రాతిపదిక ప్రథమలో ఉంటుంది.

ఉదా॥ రాముఁడు రావణుఁడు.

**భావార్థకాది యోగంలో ప్రథమ:** భావార్థకం మొదలైన వాటితోయోగం ఉన్నపుడు కర్తను తెలిపే ప్రాతిపదికకు ప్రథమ వస్తుంది. (కా. 32)

ఉదా॥ రాముఁడు వచ్చుట. 'రాముఁడు' కర్త. వచ్చు భావార్థకం. అందువల్ల కర్త 'రాముఁడు' అని ప్రథమలో ఉంది.

ఉదా॥ రాముఁడు రాఁగా లక్ష్మణుఁడు కాంచె.

రాఁగా – భావలక్షణం. దీనితో యోగం ఉంది.

కర్త ప్రథమలో ఉంది.

ఉదా॥ 'రాముండు విల్లందినన్ ద్రిలోకంబులాకులంబులగు'

అందినన్ = ఇది వృత్తమగు భావలక్షణం.

'కర్త'తో యోగం ఉంది. కర్త ప్రథమలో ఉంది.

ఉదా॥ రాముఁడు పట్టిన ప్రతిన వారింపందరంబుగాదు; పట్టిన : క్తవదర్థం (భూతకాలిక విశేషణం) కర్తతో యోగం ఉంది. కర్త ప్రథమలో ఉంది.

**సంబోధన :** సంబోధనలో ప్రథమ వస్తుంది.

ఉదా॥ ఓ. రాముఁడ, ఓ రావణుఁడ

(పై ఉదా॥ల్లో రాముఁడు, రావణుఁడు అని ప్రాతిపదిక ప్రథమలో ఉంది.)

**2. కర్మకారకం (ను వర్ణకం):**

1) కర్మార్థాన్ని తెలిపే సందర్భంలో కర్మను తెలిపే ప్రాతిపదికకు ద్వితీయా విభక్తి ప్రత్యయమైన 'ను' వర్ణకం చేరుతుంది. ఈ 'ను' వర్ణణం 'ని'గా గాని, 'న్' గా గానీ ఉండవచ్చు.

కర్మ అంటే 'ధాత్వర్థ ఫలాశ్రయము కర్మము' అని చిన్నయ సూరి పేర్కొన్నాడు.

'ధాతువు' అంటే క్రియ మూలరూపం, అది తెలిపే అర్థాలు రెండు (1) వ్యాపారం (పని) (2) ఫలం, ఫలాన్ని ఆశ్రయించింది. కర్మం.

2.1 ఉక్తార్థంలో 'కర్మము"ను తెలిపే ప్రాతిపదిక ప్రథమలో ఉంటుంది.

ఉదా॥ రామునిచే రావణుఁడు సంహరింపఁబడియె

ఈ పై వాక్యంలో ఆఖ్యాతం (క్రియావిభక్తి) కర్మను తెలుపుతోంది కాబట్టి "రావణ' శబ్దానికి ప్రథమ అవుతుంది. రావణుఁడు కర్మ. ప్రథములో ఉన్నది.

**2.2 కర్మార్థంలో ద్వితీయ**

ఉదా॥ దేవదత్తుఁడు వంటకమును వండెను

ఈ పై వాక్యంలో 'వండు' అనే ధాతువు యొక్క ఫలం వంట చేయబడటం. అందువలన ప్రాతిపదికకు ద్వితీయ 'ను' చేరుతుంది.

**2.3 వచ్యర్థ అముఖ్య కర్మకు 'ను' కు బదులు తోడ, కు రావచ్చు.**

ఉదా॥ మైత్రుండు చైతుని తోడ నిట్లనియె

'చైత్రుని కొఱకు' అని సంప్రధానంగా కాక చైత్రడు అనే శబ్దం కర్మగా వివక్షింపబడింది. కాబట్టి ఇది అముఖ్య కర్మ. ముఖ్యకర్మలో ద్వితీయ 'ను' వర్ణకం. అముఖ్య కర్మలో తోడ, కు ప్రత్యయాలు చేరతాయి.

ఉదా॥ మైత్రుండు చైతునితోడ నిట్లనియె

మైత్రుండు చైత్రునకిట్లనియె

**2.4 జడవాచకంలో కర్మకు ద్వితీయ బదులు ప్రథమ వస్తుంది.**

ఉదా॥ వాఁడు పూవులు తెచ్చె

'వాఁడు పూవులను తెచ్చె' అనే దానికి బదులు 'పూవులు తెచ్చె' అని ఉన్నది. 'పూవులు' జడవాచకం కాబట్టి ద్వితీయార్థంలో ప్రథమ వచ్చి 'వాఁడు పూవులు తెచ్చె' అవుతుంది

ఆకె సొమ్ములు దాల్చె (ప్ర) (ఆకె సొమ్ములను దాల్చె (ద్వి))

**2.5 భవత్యర్థ వ్యవహితములయిన కర్మకు ప్రథమ వస్తుంది.**

భవత్యర్థాలు అంటే అగు, అవు, అవ్, ఐన, అయిన మొదలైనవి. వీటితో విశేష్యానికి విశేషణానికి ఎడం ఉంటే కర్మార్థంలో ద్వితీయకు బదులు ప్రథమ వస్తుంది.

సాధారణంగా విశేష్యం ఏ విభక్తిలో ఉంటే విశేషణం కూడా అదే విభక్తిలో ఉంటుంది.

ఉదా॥　దేవకీ పుత్రు హరిని నుతింతునెపుడు.

('హరిని' విశేష్యం ద్వితీయలోఉంది. 'దేవకీపుత్రుని' అని విశేషణం కూడా ద్వితీయలోనే ఉంది.)

ఉదా॥ విద్యాశాలియగు పురుషుని సకల జనులు సన్మానింతురు.

(ఈ పురుషుని విశేష్యం ద్వితీయలో ఉంది. విద్యాశాలి, విశేషణం. విశేష్యానికి విశేషణానికి 'అగు' అనే భవత్యర్థంతో వ్యవధానం ఉంది కాబట్టి విశేషణం 'విద్యాశాలిని' అని ద్వితీయలో ఉండకుండా 'విద్యాశాలి' అని ప్రథమలో ఉంది.)

**2.6 సన్నిహిత విశేషణానికి ముందున్న విశేషణాలకు 'అయి' పదం చేరకపోతే చివరి విశేషణానికి కాని, విశేషణాలన్నిటికి గాని సముచ్చయార్థం విభాషగా చేరుతుంది. ఇటువంటి సందర్భంలో 'విశేష్యం' ద్వితీయలో ఉన్నా విశేషణాలు ప్రథమలోనే ఉంటాయి.**

ఉదా॥　'ఆద్యుఁడప్రమేయుఁడునగు హరిని గొలుతు'

'ఆధ్యుఁడు నమేయగుణుఁడునౌహరిని గొలుతు'

'ఆద్యుఁడ ప్రమేయుండగు హరిని గొలుతు'.

ఈ పై వాక్యాల్లో 'హరిని' అనే విశేష్యం కర్మార్థమైన ద్వితీయలో ఉంది. విశేషణాలు కూడా ద్వితీయలోనే ఉండాలి. కానీ ఆధ్యుఁడు, అప్రమేయుఁడు, అమేయగుణుఁడు అని ప్రథమలో ఉన్నాయి.

**2.7 ధాతుజ విశేషణంతో వ్యవధానం ఉండే విశేషణాలన్నింటికి 'అయి' పదం అనుప్రయుక్తం అవుతుంది.**

ఆ సందర్భంలో విశేష్యం కర్మార్థ బోధకమైన ద్వితీయా విభక్తిలోనే ఉన్నా విశేషణాలు ప్రథమలో ఉంటాయి.

ఉదా॥ ఆద్యుఁడయి అప్రమేయుఁడై అఖిల సేవ్యుఁడై యెసంగెడు దేవునినభినుతింతు.

(విశేష్యమైన దేవుని శబ్దం కర్మార్థబోధకమై ద్వితీయలో ఉన్నది. 'ఆద్యుఁడు, అప్రమేయుఁడు, అఖిల సేవ్యుఁడు' అనే విశేషణాలు ప్రథమలో ఉన్నాయి.

**3. కరణ కారకం (చేత, తోడ):**

కరణము అంటే 'క్రియా సిద్ధిం బ్రకృష్టోపకారకంబు కరణంబు' అని చిన్నయ సూరి నిర్వచించాడు.

3.1.క్రియా సిద్ధికి మిక్కిలిగా ఉపకరించేది కరణం. క్రియ నెరవేరడానికి పనికి వచ్చే సాధనాలలో ఏ సాధనం ఆ క్రియను నెరవేరుస్తుందో ఆ ఉపకరణాన్ని 'కరణం' అని వ్యాకరణ పరిభాషలో పిలుస్తారు. అటువంటి 'కరణార్థాన్ని బోధించే ప్రాతిపదికకు 'చేత' వర్ణకం చేరుతుంది.

ఉదా॥ ఖడ్గంబుచేత ఖండించె

('ఖండించడం' అనే క్రియ సిద్ధించడానికి మిక్కిలిగా ఉపకరించిన సాధనం 'ఖడ్గం', కాబట్టి ప్రాతిపదికకు 'చేత' చేరుతుంది.)

ఉదా॥ కోల చేత కూలనేసె

3.2. కరణార్థంలో ప్రాతిపదికకు 'తోడ' చేరుతుంది

ఉదా॥ ఖడ్గంబు తోడ ఖండించె, కోల తోడ కూలనేసి

3.3. కొన్ని సందర్భాలలో చేత, తోడ వర్ణకాలలో చివరి అక్షరాలు లోపించి చే, తో అని కూడా కనిపిస్తాయి. చే-తోడ, చేతలతో సమానం (త.10) అందువల్ల కరణార్థంలో చే, తోడ ప్రాతిపదికకు చేరవచ్చు.

3.4. జడవాచకం యొక్క తృతీయకు ద్వితీయ బహుళంగా వస్తుంది.

'తృతీయ' కరణార్థంలో వస్తుంది. కాని దాని స్థానంలో ద్వితీయా విభక్తి బహుళంగా రావటం కనిపిస్తుంది.

ఉదా॥ కోలను కూలనేసె

ఈ పై వాక్యంలో 'కోల' జడవాచకం, కరణం కూడ.

కరణార్థంలో 'తోడ' రావాలి. కాని తృతీయకు బదులు ద్వితీయ రావటాన్ని గమనించవచ్చు.

ఉదా॥ కోలను కూలనేసి, కోలం గూలనేసె

**3.5. ఉదంత జడవాచకానికి బహువచనం పరమైనపుడు తృతీయకు ద్వితీయ వస్తుంది.**

ఉదా॥ అర్జునుండు శత్రుసేనలను బాణంబులను రూపుమాపె

('బాణంబులు' ఉదంత జడవాచకం, కరణార్థంలో బాణంబుల చేత / బాణంబులతోడ. తృతీయకు ద్వితీయ వచ్చినపుడు 'బాణంబులను' అని వస్తుంది.)

**3.6. ఉపయోగం:** నియమ పూర్వక విద్యా స్వీకారాన్ని ఉపయోగం అనే సంజ్ఞతో పిలుస్తారు.

ఉదా॥ రామకృష్ణులు సాందీపనితోడ వేదంబులం జదివిరి.

రామకృష్ణులు శిష్యులు. సాందీప మహర్షి గురువు, గురువు వద్ద శిష్యులు నియమపూర్వక

విద్యాస్వీకారం చేస్తున్నారు. అందువలన 'ఉపయోగం'లో ఆఖ్యాతకు తోడ వర్ణకం వచ్చి సాందీపని తోడ అయింది. అయితే కొన్ని చోట్ల వలన వర్ణకం కూడా రావచ్చు. అప్పుడు సాందీపని వలన అవుతుంది.

**3.7. తుల్యార్థయోగం :** తుల్యార్థ యోగంలో తృతీయకు 'తోడ' వర్ణకం వస్తుంది.

తుల్యార్థము అంటే సమానమైనది అని అర్థం.

ఉదా॥ చైత్రుని తోడ మైత్రుండు తుల్యుండు.

పై ఉదా॥ లో తుల్యార్థంలో 'చైత్రునికి 'తోడ' చేరింది.

అయితే తుల్యార్థయోగంలో 'షష్ఠి' కూడా రావచ్చు.

ఉదా॥ చైత్రునకు మైత్రుండు తుల్యుండు.

**3.8. సహార్థంలో తోడ :** 'సహార్థం'లో ప్రాతిపదికకు 'తోడ' చేరుతుంది. (కా. 5)

'సహా' అంటే 'కలిసి' 'సహితం' అని అర్థం.

ఉదా॥ రాజు, సేనలతోడ వచ్చె. సేనా సహితుడై వచ్చాడు అని అర్థం. 'సేనలు' అనే ప్రాతిపదికకు 'తోడ' చేరింది.

## 4. సంప్రదాన కారకం:

"త్యాగోద్దేశంబు సంప్రదానంబు నాఁబడు"అని చిన్నయ సూరి సంప్రదాన కారకాన్ని నిర్వచించాడు.

త్యాగాన్ని ఎవరికికోసం చేయడానికి ఉద్దేశిస్తామో ఆ వ్యక్తి 'సంప్రదానం'. సంప్రదానాన్ని తెలిపే ప్రాతిపదికకు చతుర్థి విభక్తి ప్రత్యర్థంలో 'కొఱకు' ప్రత్యయం చేరుతుంది.

ఉదా॥ 'జనకుండు రాముని కొఱకుఁ గన్యనిచ్చెను'

ఈ పై వాక్యంలో జనకుడు కన్యాదానం చేయడానికి ఉద్దేశించిన వ్యక్తి 'రాముఁడు'. రాముఁడు సంప్రదానం కాబట్టి. 'రామ' అనే ప్రాతిపదికకు చతుర్థీ విభక్తి ప్రత్యయమైన 'కొఱకు' చేరి 'రాముని కొఱకు' అవుతుంది. అయితే ప్రయోగాల్లో తఱచుగా చతుర్థికి మాఱుగా షష్ఠియే కనిపిస్తుంది. అంటే జనకుండు రామునకుం గన్యనిచ్చెను.

## 5. అపాదాన కారకం:

పంచమీ విభక్త్యర్థంలో 'వలన' అనే ప్రత్యయం చేరుతుంది. ఈ పంచమీ విభక్తి అర్థాన్నే 'అపాదాన కారకమని' పైన చెప్పుకున్నాం. ఇది అపాయం, జుగుప్స, భయము, ప్రమాదం, గ్రహణం, భవనము, త్రాణము, విరామము, అంతర్థి, వారణము అనే అర్థాలలో 'వలన' వర్ణకం చేరుతుంది.

**5.1 అపాయం**: 'అపాయం' అంటే విశ్లేషం లేదా ఎడబాటు అని అర్థం. ఈ విశ్లేషం దేని నుండి కలుగుతుందో దానిని తెలిపే ప్రాతిపదికకు 'వలన' చేరుతుంది.

ఉదా॥ మైత్రుండు రాజ్యంబు వలన భ్రష్టుండయ్యె

(మైత్రునికి రాజ్యం నుండి విశ్లేషం (అపాయం) కలిగింది కాబట్టి 'రాజ్యము' అనే శబ్దానికి 'వలన' చేరింది. అలాగే 'నాకంబు వలన నారదుండేతెంచె' అన్నప్పుడు కూడా నారదునికి నాకం (స్వర్గం) నుండి ఎడబాటు కలిగింది కాబట్టి 'నాకము' అనే శబ్దానికి 'వలన' చేరింది.

**5.2 భయము :** 'భయము' దేని నుండి కలుగుతుందో దానిని తెలిపే శబ్దానికి 'వలన' చేరుతుంది.

ఉదా॥ చోరుని వలన భయపడియె.

('భయపడటం' – చోరుని నుండి కాబట్టి 'చోర' శబ్దానికి 'వలన' చేరింది.)

**5.3 జుగుప్స:** 'జుగుప్స' అంటే ఏవగింపు. ఏవగింపు దేని మీద కలుగుతుందో దానిని తెలిపే ప్రాతిపదికకు చివర 'వలన' చేరుతుంది.

ఉదా॥ పాపంబు వలన నేవగించె

('ఏవగించినది' పాపము మీద కాబట్టి 'పాపము' అనే శబ్దానికి 'వలన' చేరింది.)

**5.4 పరాజయం:** 'పరాజయం' అంటే 'డయ్యుట' 'అలసిపోవుట' అని అర్థం. పరాజయం దేనినుండి కలుగుతుందో దాన్ని తెలిపే ప్రాతిపదికకు 'వలన' చేరుతుంది.

ఉదా॥ అధ్యయనంబు వలన డస్సె.

('డస్సి నది' అధ్యయనం నుండి కాబట్టి 'అధ్యయనం' అనే శబ్దానికి 'వలన' చే

**5.5 ప్రమాదం:** 'ప్రమాదం' అంటే 'పరాకు', ఏమరుపాటు అని అర్థం. ఏమరుపాటు దేనినుండి కలుగుతుందో దాన్ని తెలిపే ప్రాతిపదికకు 'వలన' వర్ణంకం చేరుతుంది

ఉదా॥ పాడివలనం బరాకు పడియె

'పాడి' అంటే ధర్మం. 'పాడి' నుండి ఏమరుపాటుకలిగింది కాబట్టి 'పాడి' అనే ప్రాతిపదికకు 'వలన' వర్ణకం చేరింది.

**5.6 గ్రహణము :** గ్రహణము అంటే కొనుట (తీసుకొనుట), ఎఱుంగుట, వినుట వంటి అర్థాలున్నాయి. 'గ్రహణము' అనే అర్థంలో ప్రాతిపదికకు చివర 'వలన' అనే ప్రత్యయం వస్తుంది.

ఉదా॥ మైత్రుని వలన ధనంబు గొనియె

(ధనము గ్రహించినది మైత్రుని నుండి కాబట్టి 'వలన' చేరింది.

**5.7 భవనము :** భవనము అంటే 'పుట్టుట' అని అర్థం. 'పుట్టుట' దేని నుండి జరుగుతుందో దానిని తెలిపే ప్రాతిపదికకు వలన చేరుతుంది.

ఉదా॥ మనువ్వు వలనం బ్రజలు పుట్టిరి

(ప్రజలు పుట్టినది మనువు నుండి కాబట్టి మను అనే శబ్దానికి 'వలన' చేరింది. మను అనే

ప్రాతిపదికకు వుగామం చేరి వలన వర్ణకం వచ్చింది.)

**5.8 త్రాణము:** 'త్రాణం' అంటే రక్షించడం అని అర్థం. రక్షించడం రక్షించడం దేని నుండి జరుగుతుందో దాన్ని తెలిపే ప్రాతిపదికకు 'వలన' చేరుతుంది.

ఉదా॥ చోరుని వలనంగాచె

(రక్షించింది చోరుని నుండి కాబట్టి 'చోర' అనే ప్రాతిపదికకు 'వలన' చేరింది.)

**5.9 విరామం :** 'విరామం' అంటే విరమించడం అని అర్థం. 'విరామం' అనే అర్థంలో ప్రాతిపదికకు 'వలన' చేరుతుంది.

ఉదా॥ 'భోగంబుల వలన విరమించె'

(విరమించినది భోగంబుల నుండి కాబట్టి ప్రాతిపదికకు 'వలన' వర్ణకం చేరింది.)

**5.10 అంతర్ధి :** 'అంతర్ధి' అంటే 'మఱుఁగుట' (దాగుట) అని అర్థం. ఈ అర్థంలో ప్రాతిపదికకు 'వలన' అనే ప్రత్యయం చేరుతుంది.

ఉదా॥ కృష్ణుడు తల్లి వలస దాఁగె.

('దాగడం' తల్లి నుండి కాబట్టి 'తల్లి' అనే ప్రాతిపదికకు 'వలన' వర్ణకం చేరింది.)

**5.11 వారణం:** వారణం అంటే 'వారించడం' అని అర్థం. 'వారణం' అనే అర్థంలో ప్రాతిపదికకు 'వలన' చేరుతుంది. వారించడం దేని నుండి కలుగుతుందో దాన్ని తెలిపే ప్రాతిపదికకు 'వలన' చేరుతుంది.

ఉదా॥ 'శోకంబు వలస వారించె',

(వారించబడినది శోకంబు నుండి కాబట్టి శోకమనే శబ్దానికి 'వలన' చేరింది.)

5.2 వలనకు ఒకానొకచో ఉండి అనే పదం అనుప్రయుక్తం అవుతుంది.

ఉదా॥ నాకంబు వలన నుండి నారదుండేతెంచె

**5.3 వలనకు ద్వితీయ, సప్తమి**

'ఉండి' శబ్దం చేరుతున్నప్పుడు 'వలన'కు తఱచుగా అంటే 'వలన'కు మారుగా ద్వితీయగానీ సప్తమిగానీ వస్తాయి.

ఉదా॥ వనము నుండి వచ్చె (ద్వితీయ), వనమందుండి వచ్చె (సప్తమి)

వనము నుంచి, ధనము నుంచి అనేవి అసాధురూపాలు అని చిన్నయసూరి పేర్కొన్నాడు.

**5.4 'వలన' కు ఆదేశంగా ద్వితీయా విభక్తి ప్రత్యయమైన 'ను' వర్ణకం వస్తుంది.**

ఉదా॥ మైత్రుఁడు గృహమును వెడలెను

పై వాక్యంలో 'మైత్రుండు గృహము వలన వెడలెను' అనే వాక్యానికి బదులుగా ద్వితీయా విభక్తి

వస్తుంటుంది.

అలాగే వాహనము వలన దిగెను > వాహనమును దిగెను.

**5.5 'అపాయార్థం'లో 'వలన'కు బదులు మొదట ద్వితీయావిభక్తి ఆ తర్వాత ఆ ద్వితీయకు ప్రథమ కూడా వస్తుంది.**

ఉదా॥ వాఁడింటిని వెడలె (ద్వితీయ) వాఁడిల్లు వెడలె (ప్రథమ)

ఈ పై వాక్యాలలో వలన వర్ణకం బదులు ద్వితీయా ప్రథమలు రావటాన్ని గమనించవచ్చు.

**5.6 ఈ పైన పేర్కొన్న పంచమీ విభక్తి స్థానంలో షష్ఠీ విభక్తి ప్రత్యయం కూడా రావటం గమనించవచ్చు.**

ఉదా॥ చోరునకు వెఱచె (భయం)

పాపంబునకేవగించె (జుగుప్స)

అధ్యయనంబునకు డస్సె (పరాజయం)

పాడికిం బరాకువడియె (ప్రమాదం)

మనువునకునిక్ష్వాకుండు పుట్టె (భవనం)

5.6 హేత్వర్థాలైన గుణానికి, క్రియకు 'పట్టి' వర్ణకం చేరుతుంది.

ఉదా॥ జ్ఞానముఁబట్టి ముక్తుఁడగు  (గుణవాచకం)

ఉదా॥ నీవు వచ్చుటంబట్టి ధన్యుఁడనయితి (క్రియ)

**6. షష్ఠి (కు, యొక్క):**

'శేషం' అంటే సంబంధం అని అర్థం. సంబంధార్థంలో ప్రాతిపదికకు యొక్క చేరుతుంది. దీనినే 'శేషషష్ఠి' అని చిన్నయసూరి పేర్కొన్నాడు. కొన్నిచోట్ల 'యొక్క' కు బదులు 'కు' కూడా రావచ్చు.

ఉదా॥ రాముని యొక్క గుణములు

అలాగే నా యొక్క మిత్రుఁడు (మైత్రీ సంబంధం)

వానియొక్క తమ్ముఁడు (సోదర సంబంధం)

సంబంధార్థంలో యొక్కకు 'కు' వర్ణకం వస్తే –

ఉదా॥ 'నా కుందమ్ముఁడు' మీకు నెచ్చెలి.

**7. అధికరణ కారకం (అందు, న) :**

అధికరణం అంటే ఆధారం. ఇది (1) ఔపశ్లేషిక ఆధారం (2) వైషయిక ఆధారం (3) అభివ్యాపక

ఆధారం అని మూడు రకాలు. ఈ అధికరణార్థంలో ప్రాతిపదికకు 'సప్తమీ' విభక్తి ప్రత్యయాలు చేరతాయి.

**అ) ఔపశ్లేషిక ఆధారం :** ఇది ఏకదేశ సంబంధం. కొంత భాగం మాత్రమే ఆధారంగా ఉండడం ఔపశ్లేషిక ఆధారం.

ఉదా॥ ఘటమందు జలమున్నది.

జలానికి 'ఘటం' ఆధారం. నీళ్లకు కడవకు సంబంధం ఉంటుంది. అందువలన నీటికి కుండను ఆధారంగా చెప్తాము. ఇలా ఆధారాన్ని తెలిపే సందర్భంలో ప్రాతిపదికకు సప్తమీ విభక్తి ప్రత్యయమైన 'అందు' చేరుతుంది.

**ఆ) వైషయిక ఆధారం :** విషయం ఆధారం అయినప్పుడు దాన్ని వైషయిక ఆధారం అని అంటారు.

ఉదా॥ మోక్షమందు ఇచ్ఛ గలదు.

'ఇచ్ఛ'కు ఆధారం 'మోక్షం'. ఇది విషయ సంబంధం కలది కాబట్టి సప్తమీ విభక్తి ప్రత్యయమైన 'అందు' చేరుతుంది.

**ఇ) అభివ్యాపక ఆధారం :** అంతటా వ్యాపించి ఉండే ఆధారాన్ని అభివ్యాపకం అని అంటారు.

ఉదా॥ అన్నింటి యందు ఈశ్వరుండుగలఁడు

సర్వత్రా వ్యాపించి ఉండే ఈశ్వరునికి 'అన్ని' ఆధారం. కాబట్టి 'అన్ని' కి 'అందు' చేరింది.

**7.1 న వర్ణకం:**

ఉకారాంతమైన జడవాచక శబ్దానికి 'న' వర్ణకం వస్తుంది.

ఉదా॥ ఘటంబున జలంబున్నది.

జలానికి ఆధారం 'ఘటంబు' ఇది ఉకారాంత జడవాచకం కాబట్టి 'ను' చేరి 'ఘటంబున' అయినది. అందు వర్ణకం అన్ని శబ్దాలమీద వస్తుంది. నవర్ణకం ఉకారాంత జడవాచకాలకు మాత్రమే వస్తుంది.

అధికరణంగా ఉండే జడవాచకం యొక్క సప్తమికి ద్వితీయ వస్తుంది.

ఉదా॥ లంకయందు కలకలంబు పుట్టె

'కలకలం' పుట్టడానికి ఆధారం 'లంక', అందువలన అధికరణార్థంలో 'అందు' చేరింది. 'లంక' జడవాచకం. దాని సప్తమికి ద్వితీయ వచ్చి లంకను కలకలంబు పుట్టె అవుతుంది.

అలాగే మీనంబు జలంబుల నుండు

## 8. ఇతర అర్థాలలో విభక్తి ప్రత్యయాలు:

పైన చెప్పిన విధంగా కర్త, కర్మ, కరణ, సంప్రదాన, అపాదాన కారకాల్లోనే కాకుండా నామ విభక్తి ప్రత్యయాలు వివిధ అర్థాలలో ప్రాతిపదికలకు చేరుతుంటాయి. వాటిని గురించి తెలుసుకుందాం.

**8.1 అన్యార్థాది యోగంలో పంచమి:** 'అన్య' అర్థం మొదలైన వాటితో సంబంధం కలిగి ఉండడం 'అన్యార్థాదియోగం'. ఇందులో పూర్వం, పరం, ఉత్తరం మొదలైనవి కూడా చేరతాయి.

ఉదా॥ రాముని కంటె అన్యుండు ధానుష్కుండు లేఁడు.

పై వాక్యంలో రామ అనే ప్రాతిపదికకు 'అన్య' అనే శబ్దంతో అన్వయం ఉంది. ఇది 'అన్యార్థాది యోగం' అవుతుంది. ప్రాతిపదికకు కంటె చేరి రామునికంటెన్ అయింది.

ఇలాగే 'లోభంబు కంటే నితరంబు దోషంబులేదు'.

ఈ సందర్భంలో షష్ఠి' కూడా వస్తుందని చిన్నయ సూరి పేర్కొన్నాడు. అంటే 'కంటె' అనే పంచమీ ప్రత్యయానికి బదులుగా షష్ఠీ 'కు' వర్ణకం ప్రాతిపదికకు చేరుతుంది. అప్పుడు 'రామునకు అన్యుండు ధానుష్కుండు లేఁడు' అని అవుతుంది.

**8.2 ఉద్దేశార్థంలో చతుర్థి :** ఉద్దేశించబడినది 'ఉద్దేశ్యం'. ఈ అర్థంలో ప్రాతిపదికకు చతుర్థి విభక్తి ప్రత్యయమైన కొఱకు చేరుతుంది.

ఉదా॥ పురుషార్థంబుకొఱకు యత్నింపవలయు.

పురుషార్థం అనేది ఉద్దేశ్యం. ఈ అర్థంలో ప్రాతిపదికకు 'కొఱకు' చేరింది. కాని చతుర్థికి మాఱుగా షష్ఠియే ప్రయోగాల్లో కనిపిస్తున్నది అని చిన్నయసూరి పేర్కొన్నాడు. అంటే కొఱకు బదులు షష్ఠీ విభక్తి ప్రత్యయమైన 'కు' వర్ణకం చేరుతుంది.

ఉదా॥ పురుషార్థంబునకు యత్నింపవలయును.

**8.3 గ్రహ్యాది యోగంలో పంచమికి బదులు చేత :** గ్రహించటం మొ॥న అర్థాలతో యోగం ఉన్నపుడు 'పంచమి'కి బహుళంగా చేత వస్తుంది.

ఉదా॥ జరాసంధుఁడు రాజులచేత కప్పంబు గొనియె

ఇక్కడ 'వలన' అనేది గ్రహించుట' అనే అర్థంలో రావాలి. దానికి బదులుగా చేత అనేది కనిపిస్తుంది.

ఇలాగే మైత్రుండు చైత్రుని చేత ఋణంబు గొనియె ('చైత్రుని వలన'కు బదులు చేత)

ఈ వృత్తాంతంబు వానిచేత వింటి ('వానివలన' అనే దానికి బదులు వానిచేత).

**8.4 తుల్యార్థయోగంలో తృతీయకు బదులు షష్ఠిరావటం:** అయితే తుల్యార్థయోగంలో 'షష్ఠి' కూడా రావచ్చు.

ఉదా॥ చైత్రునకు మైత్రుండు తుల్యుండు.

**8.5 నిర్ధారణ పంచమి అర్థంలో కంటె రావటం :** 'నిర్ధారణం' అనే అర్థంలో పంచమికి 'కంటే' వస్తుంది. దీనినే 'నిర్ధారణ పంచమి' అంటారు. నిర్ధారణం అంటే వేరు చేయటం. 'జాతి' మొ॥న అంశాల ఆధారంగా మొదటి దాని నుండి రెండో దాన్ని వేరు చేసేటపుడు మొదటి దాన్ని తెలిపే ప్రాతిపదికకు 'కంటె' చేరుతుంది.

ఉదా॥ జానపదుల కంటే నాగరులు వివేకులు

జానపదులు, నాగరులు వేర్వేరు ప్రదేశాలకు చెందినవారు. 'జానపదుల' నుండి నాగరుల్ని వేరు చేస్తున్నాం. అందువల్ల 'జానపదులు' అనే ప్రాతిపదికకు 'కంటె' చేరింది.

ఇలాగే మానహానికంటే మరణము మేలు

**8.6 నిర్ధారణ షష్ఠికి లోపల వర్ణకం చేరటం:** నిర్ధారణ షష్ఠిలో 'లోపల' వర్ణకం చేరుతుంది. (కా. 16) జాతి, గుణం, క్రియ, సంజ్ఞ అనే అంశాలు ఆధారంగా 'సముదాయం' నుండి 'ఏకదేశాన్ని' ఒక భాగాన్ని వేరుచేయడం నిర్ధారణం అలాంటి సందర్భంలో సముధాయాన్ని తెలిపే ప్రాతిపదికకు 'లోపల' వర్ణకం చేరుతుంది.

ఉదా॥ మనుష్యుల లోపల క్షత్రియుండు శూరుండు (జాతి)

ఉదా॥ గోవుల లోపల కపిల బహుక్షీర (గుణం)

ఉదా॥ అధ్వగుల లోపల పాఱువాఁడు శీఘ్రగామి (క్రియ)

ఉదా॥ ఛాత్రుల ల్నోల మైత్రుండు సమర్థుండు (సంజ్ఞ)

**8.7 వచ్యర్థ అముఖ్య కర్మకు 'ను' కు బదులు తోడ, కు రావచ్చు.**

ఉదా॥ మైత్రుండు చైతుని తోడ నిట్లనియె

'చైత్రుని కొఱకు' అని సంప్రధానంగా కాక చైత్రడు అనే శబ్దం కర్మగా వివక్షింపబడింది. కాబట్టి ఇది అముఖ్య కర్మ. ముఖ్యకర్మలో ద్వితీయ 'ను' వర్ణకం. అముఖ్య కర్మలో తోడ, కు ప్రత్యయాలు చేరతాయి.

ఉదా॥ మైత్రుండు చైతునితోడ నిట్లనియె

మైత్రుండు చైత్రునకిట్లనియె

**8.8 హేత్వర్థంలో చేత :** 'హేతువు' అంటే కారణం. ఫలసాధన యోగ్యం అయిన పదార్థం 'హేతువు' అని సూరి పేర్కొన్నాడు. ఈ అర్థంలో ప్రాతిపదికకు 'చేత' చేరుతుంది.

ఉదా॥ ధనము చేత సౌఖ్యంబుగలుగు.

'సౌఖ్యం' అనే ఫలాన్ని సాధించడానికి యోగ్యం అయిన పదార్థం 'ధనము' కాబట్టి, ధనము అనే శబ్దానికి 'చేత' చేరింది.

**విశేషణాలు వాటి మీఁద చేరే ఆగమాలు:**

(1) ప్రథమాంతాలైన యుష్మద్ విశేషణాల చివర ఏకవచనంలో 'వు', బహువచనంలో 'రు' ఆగమాలుగా చేరతాయి

(2) అస్మద్ విశేషణాల చివర ఏకవచనంలో 'ను', బహువచనంలో 'ము' ఆగమాలుగా చేరతాయి.

ఈ ఆగమాలు చేరేటపుడు విశేషణాలు చివరి ఉత్వం అత్వం అవుతుంది

ఉదా॥ నీవు ధన్యుఁడవు,

మీరు ధన్యులరు :

నేను ధన్యుఁడను :

మేము ధన్యులము : '

మేము ధన్యులము.

**విశేషణాల్లో బలమైనది:** అన్యకార్యం కంటే, యుష్మత్కార్యం, యుష్మత్కార్యం కంటె అస్మత్కార్యం బలీయము అని చిన్నయసూరి పేర్కొన్నాడు. అంటే అన్య విశేషణం కంటే యుష్మద్ విశేషణం, యుష్మద్విశేషణం కంటే అస్మద్విశేషణం ఒక దానికంటే మరొకటీ బలియమైనవని తాత్పర్యం.

| | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| అన్యకార్య విశేషణం | ధన్యుఁడు | ధన్యులు |
| యుషద్విశేషణం | ధన్యుఁడవు | ధన్యులరు |
| అస్మద్విశేషణం | ధన్యుఁడను | ధన్యులము |

ఉదా॥ వారును మీరును ధన్యులరు

(వారు ధన్యులు, మీరు ధన్యులరు. ఇవి ఒకే వాక్యంలో వస్తే అన్య విశేషణం కంటే బలీయం కాబట్టి యుష్మద్విశేషణం వస్తుంది.)

ఉదా॥ మీరును మేమును ధన్యులము.

(మీరు ధన్యులరు, మేము ధన్యులము ఇవి ఒకే వాక్యంలో వస్తే యుష్మద్విశేషణం కంటే అస్మద్విశేషణం బలీయం కాబట్టి అస్మద్విశేషణం వస్తుంది.)

**ఏక వాక్యంలో పదస్థాన సాపేక్షత :**

ఏక వాక్యంలో కొన్ని పదాల్ని తప్ప అన్ని పదాల్ని క్రమరహితంగా ప్రయోగించవచ్చు.

ఉదా॥ గాలి చల్లగా వీచెను; వీచెను జల్లగా గాలి.

చల్లగా గాలి వీచెను; గాలి వీచెను జల్లగా

చల్లగా వీచెను గాలి; చల్లగా గాలి వీచెను.

చల్లగా, గాలి, వీచెను – అనేమూడు పదాలు 'ఏకవాక్యం' లోనివి కాబట్టి ఎలా అయినా మార్చి ప్రయోగించవచ్చు. ఎలా ప్రయోగించినా అర్థం చెడదు అని చిన్నయసూరి పేర్కొన్నాడు. కాని ఇది అన్ని చోట్ల కుదిరే పని కాదు.

'ఏని' లాంటి పదాలు కొన్ని అలా వాడడానికి వీలు కాదు, రాముడేని, కృష్ణుడేని అని రావాలి.

'రాముఁడేని కృష్ణుఁడేని అని వాడవలసిందే. అంతేగాని రాముఁడు కృష్ణుఁడు - ఏని ఏని - అని ఉపయోగించటం కుదరదు.

ఈ విధంగా చిన్నయసూరి కారకపరిచ్ఛేదంలో కారకాలను గురించి వివరించాడు.

-0-

# 3.సమాస పరిచ్ఛేదం

**2) చిన్నయ సూరి పేర్కొన్న సమాస వివరాలను పేర్కొనండి? లేదా చిన్నయసూరి సమాసపరిచ్ఛేదంలో పేర్కొన్న సమాస విభజనను, సమాస నిర్మాణాన్ని గురించి వివరించండి?**

**'సమాస' నిర్వచనం:**

'సమర్థంబులగు పదంబు లేక పదంబగుట సమాసంబు (స.1) అని సమాసాన్ని చిన్నయసూరి నిర్వచించాడు. తెలుగు వ్యాకర్తలు 'సమాసం' అనే సంజ్ఞను, నిర్వచనాన్ని సంస్కృత వ్యాకరణం నుంచి తెచ్చుకున్నాడు.

సామర్థ్యం కలిగిన రెండు లేక అంతకంటే ఎక్కువ పదాలు కలిసి 'ఏక పదం' కావడం సమాసం. అన్ని పదాలు సమసించటానికి అర్హమైనవి కావు. అంటే ఒకే అర్థాన్ని పొందటానికి శక్తిమంతాలు కావు. అర్థసమ్మేళనం, శబ్దసమ్మేళనం రెండూ కుదిరితేనే సమాసం సార్థకమవుతుంది.

ఉదా॥ నా మగడు పిల్లలు సినిమాకు వెళ్ళారు అన్న వాక్యంలో మగడు పిల్లలు అనే రెండు శబ్దాల్ని కలిపి సమాసం చేయాలనుకుంటే అర్థం సరిపోయినా శబ్దమైతే కుదరదు. మగపిల్లలు సినిమాకు వెళ్లారు అంటే మగనితో పిల్లలు వెళ్లారన్న అర్థం రాదు. ఇలాగ శబ్దార్థ సమ్మేళనంతో సమాసం ఏకార్థీభావం ఏర్పడాలి. నీరు, నిప్పులు కుండలో ఉన్నాయి అన్నప్పుడు శబ్దమైత్రి ఉందిగాని అర్థమైత్రి లేదు. ఇలా సమాస నిర్మాణంలో ఉభయమైత్రిని పాటించాలి. ఈ వివరణను బట్టి సమాసంలో ఉండే సామర్థ్యాన్ని ఏకార్థీభావసామర్థ్యమని అంటారు. వేరు వేరుగా ఉన్న అర్థాలు ఏకార్థాన్ని ఇవ్వడం 'సామర్థ్యం'. వేర్వేరు ప్రసిద్ధార్థాల్లో ఉండే పదాలు సముదాయశక్తి చేత ఏకార్థంలో పర్యవసించడమే 'సామర్థ్యం'. ఉదా॥ రాజు, కొడుకు అని రెండుపదాలు సంబంధార్థంలో 'రాజుయొక్క కొడుకు' అవుతుంది. 'యొక్క' లోపించి 'రాజు కొడుకు' అనే షష్ఠీ తత్పురుష సమాసం ఏర్పడుతుంది.

**సమాస విభజన :**

సమాసంలోగల శబ్దాల యొక్క భాషను ఆధారంగా చేసుకొని సమాసాల్ని స్థూలంగా మూడు రకాలుగా విభజించవచ్చు. (స.2) అవి-

(1) సాంస్కృతికం

(2) అచ్ఛికం

(3) మిశ్రం అనేవి.

సాంస్కృతిక సమాసాన్ని మళ్లీ 'సిద్ధ సాంస్కృతికం' అని 'సాధ్య సాంస్కృతికం' అని రెండు రకాలుగా విభజించవచ్చు. ........

సమాసం

సాంస్కృతికం ఆచ్ఛికం మిశ్రం

సిద్ధ సాంస్కృతికం సాధ్య సాంస్కృతికం

**1) సాంస్కృతికం :** ఇది రెండు విధాలు (1) సిద్ధ సాంస్కృతికం (2) సాధ్య సాంస్కృతికం.

**(అ) సిద్ధ సాంస్కృతిక సమాసం :** కేవల సంస్కృత పదాలు కలిసి ఏర్పడేది సిద్ధ సాంస్కృతిక సమాసం. సంస్కృతంలోనే సమాసం ఏర్పడి తెలుగు విభక్తుల్ని చేర్చుకొని 'సిద్ధ సాంస్కృతిక సమాసం' ఏర్పడుతుంది.

ఉదా॥ రాజాజ్ఞ, తటాకోదకమ్, లక్ష్మీవల్లభా అనేవి సంస్కృత సమాసాలు. వాటికి చివర దీర్ఘం హ్రస్వమై, ము, డుఙ్ చేరి 'రాజాజ్ఞ, తటాకోదకము, లక్ష్మీవల్లభుఁడు' అనే సిద్ధ సాంస్కృతిక సమాసాలు ఏర్పడ్డాయి.

**(ఆ) సాధ్య సాంస్కృతిక సమాసం:** 'సంస్కృతసమాలు' కలిసి ఏర్పడేది సాధ్య సాంస్కృతిక సమాసం. ఉదా॥ రాజు, ఆజ్ఞ అనేవి సంస్కృతసమాలు. ఈ రెండు తత్సమాలు చేరి 'రాజు నాజ్ఞ' అనే షష్ఠీ తత్పురుష సమాసం ఏర్పడుతుంది. అలాగే 'తటాకంబు', 'ఉదకము' తత్సమాలు. 'తటాకంబు నుదకము' అనే సప్తమీ తత్పురుష సమాసం ఏర్పడుతుంది. 'లక్ష్మి', 'వల్లభుఁడు' – అనే తత్సమాలు కలిసి 'లక్ష్మివల్లభుఁడు' అనే షష్ఠీ తత్పురుషం ఏర్పడుతుంది. ఇవి సాధ్య సాంస్కృతికాలు.

**2) ఆచ్ఛికము:** 'అచ్చ' – అచ్చ తెనుగు పదాలతో ఏర్పడేది ఆచ్ఛికము.

ఉదా॥ తేని యానతి : తేని యొక్క ఆనతి ఈ రెండు పదాలు ఆచ్ఛికాలె. చెఱువు నీరు చెఱువు, నీరు అనేవి రెండూ ఆచ్ఛికాలే. సిరి చెలువుఁడు, సిరి, చెలువుఁడు అనే రెండు పదాలు ఆచ్ఛికాలే.

అందువల్ల తేని యానతి, చెఱువు నీరు, సిరి చెలువుఁడు – అనేవి ఆచ్ఛిక సమాసాలు.

**3) మిశ్ర సమాసం:** సంస్కృత సమం, అచ్ఛికం రెండూ కలిసి ఏర్పడి సమాసాలు మిశ్ర సమాసాలు.

ఉదా॥ రాజుముదల: 'రాజు' సంస్కృత సమం. 'ముదల' –అచ్ఛికం. రెండూ కలిసి 'రాజుముదల' అనే మిశ్ర సమాసం ఏర్పడింది.

చెఱువు నుదకము : చెఱువు, అచ్ఛికం, ఉదకము సంస్కృత సమం. రెండూ కలిసి 'చెఱువునుదకము' అనే మిశ్ర సమాసం ఏర్పడింది.

సిరి వల్లభుండు : సిరి – అచ్ఛికం, వల్లభుఁడు – సంస్కృతసమం రెండూకలిసి 'సిరివల్లభుఁడు అనే మిశ్ర సమాసం ఏర్పడింది.

**అర్థాన్ని బట్టి సమాస విభజన:**

సమాసాల్ని అర్థాన్ని బట్టి మూడు రకాలుగా విభజించవచ్చు. అవి –

1) తత్పురుషం

2) బహువ్రీహి

3) ద్వంద్వం.

ఈ సమాస లక్షణాలను సంస్కృత వ్యాకరణాన్ని అనుసరించి తెలుగు వ్యాకర్తలు స్వీకరించారు.

**1) తత్పురుషం:** ఉత్తర పదం యొక్క అర్థం ప్రధానంగా ఉండే సమాసం తత్పురుషం.

ఉదా॥ మంచిరాజు, 'మంచి' పూర్వపదం 'రాజు' ఉత్తర పదం. ఈ విశేషణ పూర్వపద కర్మధారయంలో ఉత్తరపదమే ప్రాధాన్యం కలిగి ఉంటుంది. కర్మధారయం తత్పురుషలో ఒక భాగం.

**అ) వ్యధికరణం:**

ద్వితీయాది విభక్తులతో ఉన్న పూర్వపదం పరపదం కలిసి ఈ సమాసం ఏర్పడుతుంది. ఈ వ్యధికరణ సమాసాన్ని తత్పురుష సమాసం అని కూడా వ్యవహరిస్తారు.

| | | |
|---|---|---|
| ద్వితీయా తత్పురుష సమాసం | : నెలతాల్పు | > నెలను తాల్పు |
| తృతీయా తత్పురుషం | : నెల తక్కువవాఁడు | > నెలచేత తక్కువ వాడు. |
| చతుర్థీ తత్పురుషం | : దేవరమేలు | > దేవరకొఱకుమేలు |
| పంచమీ తత్పురుషం | : దొంగ భయము | > దొంగవలన భయము |
| షష్ఠీ తత్పురుషం | : రాముని బాణము | > రాముని యొక్క బాణము |
| సప్తమీ తత్పురుషం | : మాటనేర్పరి | > మాటయందు నేర్పరి. |

**ఆ) సమానాధికరణం :** సమానమైన విభక్తులతో కలిసి ఉండటమే సమానాధికరణం. దీన్నే 'కర్మధారయం' అంటారు. ఇందులో పూర్వోత్తర పదాలు ప్రథమావిభక్తులతో ఉంటాయి. విశేషణంతో విశేష్యం కలిసి ఏర్పడే సమాసం కర్మధారయం.

ఉదా॥ తెల్ల గుఱ్ఱము; తెల్ల – విశేషణం, గుఱ్ఱము – విశేష్యం.

విశేషణంతో విశేష్యం కలిసి, 'విశేషణ పూర్వ పద కర్మధారయ సమాసం' ఏర్పడింది.

**ఇ) ఉపమాన పూర్వపద కర్మధారయ సమాసం:** సంస్కృతం లక్షణం పట్టని తెలుగు సమాసాలు ఉండవచ్చు.

ఉదా॥ చిగురు కేలు : ఇందులో 'చిగురు' ఉపమానం. 'కేలు' ఉపమేయం. ఇవి రెండూ కలిసి 'చిగురుకేలు' అనే ఉపమాన పూర్వపద కర్మధారయ సమాసం ఏర్పడింది. ఇలాగే 'జుంటిమోవి' కూడా. ఇలాంటివి సంస్కృతంలో ఉండవు.

సంస్కృతంలో 'ఉపమాన ఉత్తరపద కర్మధారయాలే' ఉంటాయి.

ఉదా॥ ముఖ పద్మము;

ముఖము – పూర్వపదం, విశేష్యం– పద్మము.

ఇందులో ఉత్తర పదం–ఉపమానం అలాగే

'చరణ కమలములు'

**(ఈ) ద్విగుసమాసం :** కర్మధారయ సమాసంలో పూర్వపదం సంఖ్యను తెలిపితే అది ద్విగు సమాసం అవుతుంది.

ఉదా॥ ముజ్జగములు, మూఁడు లోకములు. వీటిలో

'మూఁడు' అనే పూర్వపదాలు సంఖ్యను తెలుపుతున్నాయి.

జగములు, లోకములు అనే పదాలతో కలిసి ద్విగు సమాసాలు ఏర్పడ్డాయి.

**2) బహువ్రీహి సమాసం:** అన్యపదార్థ ప్రాధాన్యంగలది బహువ్రీహి సమాసం. అంటే సమాసంలో ఉన్న పదాలయొక్క అర్థంకాకుండ ఈ రెండు పదాల సమిష్టి అర్థంతో వేరే అర్థం స్ఫురిస్తే అది 'బహువ్రీహి' సమాసం అవుతుంది. ఈ సమాసాలలో సాధారణంగా విగ్రహ వాక్యంలో కలవాఁడు, కలది అనే పదాలు వస్తుంటాయి.

ఉదా॥ ముక్కంటి : మూఁడు కన్నులు అని రెండు పదాలు చేరి మూఁడు కన్నులు గలవాడు. శివుడు అనే అన్యపదార్థం ప్రాధాన్యం కలుగుతోంది. అందువల్ల ఇది బహువ్రీహి సమాసం అయింది.

అలాగే చలివెలుగు – చల్లని వెలుగు కలవాడు (చంద్రుఁడు)

వేవెలుగు – వేయి వెలుగులు కలవాఁడు (సూర్యుఁడు)

**3) ద్వంద్వసమాసం :** సమాసంలోని ఉభయపదాల అర్థం ప్రాధాన్యంగలది 'ద్వంద్వ సమాసం'. అంటే – సమాసంలో ఉండే అన్ని పదాల అర్థమూ సమప్రాధాన్యం కలిగి ఉంటాయి. ద్వంద్వ సమాసాలు

సాధారణంగా బహువచనంలోనే ఉంటాయి.

ఉదా॥ తల్లిదండ్రులు: 'తల్లి' అనే పదానికి, 'తండ్రి' అనే పదానికి సమాసంలో సమ ప్రాధాన్యం ఉంది. ఇలాగే అన్నదమ్ములు, ఊరు పల్లెలు మొదలైనవి ద్వంద్వసమాసాలు.

**వైరి సమాసాలు :** కేవల సంస్కృత శబ్దంతో వికృతి శబ్దం సమసించదు అని చిన్నయసూరి పేర్కొన్నాడు. అలా ఏర్పడే సమాసాలను వైరి సమాసాలు అని పేర్కొంటారు. ఇటువంటి సమాసాలను గ్రామ్యాలని, లక్షణ విరుద్ధాలని, అసాధువులని పేర్కొంటారు. వీటిని వైరి సమాసాలు అని కూడా అంటారు. ఉదా॥ అనేక మాఌలు: 'అనేక' – కేవల సంస్కృత శబ్దం. 'మాఌలు' ఆచ్ఛిక శబ్దం. ఇవి రెండూ చేరి అనేకమాఌలు అనే రూపం ఏర్పడుతుంది. ఇది లక్షణ విరుద్ధం. గ్రామ్యం, అసాధువు.

అలాగే అల్పదండు : 'అల్ప' – కేవల సంస్కృత శబ్దం. 'దండు' – అచ్చికం. ఇవి రెండూ చేరడం లక్షణ విరుద్ధం కాబట్టి 'అల్పదండు' అసాధువు అయింది. ఆధునిక భాషా శాస్త్రవేత్తలు వీటిని 'గ్రామ్యాలు' అనకుండా 'మిశ్ర సమాసాలు' అంటున్నారు.

**కర్మధారయ సమాసం – నిర్మాణరీతి:**

విశేషణానికి విశేష్యంచేరి ఏర్పడే సమాసం కర్మధారయమని పైన చెప్పుకున్నాం. కర్మధారయ సమాసంలో

1) త్రికము

2) స్త్రీ సమము

3) ముగంతం

4) ధాతుజ విశేషణంగాని పూర్వపదంగా ఉంటుంది.

**1. 'త్రికం' పూర్వపదంగా గల సమాసం:** ఆ, ఈ, ఏ అనే సర్వనామాల్ని 'త్రికం' అని అంటారు. ఈ సర్వనామాలు సమాసంలో పూర్వపదాలుగా చేరి కర్మధారయ సమాసాలు అవుతాయి.

ఉదా॥ ఆ చందము, ఈ చందము, ఏ బృందము.

**2. 'స్త్రీ సమం' పూర్వపదంగా గల కర్మధారయ సమాసం:** ప్రథమైక వచనా(డు–ము–వు)లు లోపించిన అచ్చిక శబ్దాలు స్త్రీ సమాలు. ఇటువంటి పదాలు పూర్వపదాలుగా కలిగి ఉన్న సమాసాన్ని విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం అంటారు.

ఉదా॥ వాఁడి మాట : వాఁడి – స్త్రీ సమం

పోఁడి పాట : పోఁడి – స్త్రీ సమం

వాఁడి, పోఁడి అనే స్త్రీ సమాలు పూర్వపదాలుగా ఉండి విశేషణ పూర్వపద కర్మధారయాలు ఏర్పడ్డాయి.

**3. ముగంతం పూర్వపదంగా గల కర్మధారయ సమాసం:** 'ము' వర్ణకం అంతంగా ఉండే పదం 'ముగంతం'. ఈ ముగంతం పూర్వపదంగా ఉండి కర్మధారయ సమాసాలు ఏర్పడతాయి.

ఉదా॥ బెడిదపు టడిదము 'బెడిదము' – విశేషణం. ఇది 'ముగవర్ణకాంత విశేషణం. 'అడిదము' అనే విశేష్యంతో చేరి సమాసం అయేటపుడు పుంప్వాదేశం వచ్చి 'బెడిదపు టడిదము' అనే సమాసం ఏర్పడింది.

**4. ధాతుజ విశేషణం పూర్వపదంగా గల కర్మధారయ సమాసం:** ధాతువు నుండి పుట్టే విశేషణాలు 'ధాతుజవిశేషణాలు'. ఈ ధాతుజ విశేషణాలు పూర్వపదంగా ఉండి కర్మధారయ సమాసాలు ఏర్పడతాయి.

ఉదా॥ మడిసెడు దళములు : దళములు (సేనలు) విశేష్యం – 'మడిసెడు' – 'మడియు' అనే 'ధాతువు మీద 'ఎడు' చేరి ఏర్పడిన తద్ధర్మార్థ ధాతుజ విశేషణం. ఇది 'ఎడు' చేరి ఏర్పడిన తద్ధర్మార్థ ధాతుజ విశేషణం. ఇది పూర్వపదంగా ఉండి విశేషణ పూర్వపద కర్మధారయం ఏర్పడింది.

**కర్మధారయ సమాసంలో జరిగే వ్యాకరణ కార్యాలు:**

**'తత్' శబ్దం చేరడం:** సంస్కృతంకాని ఆచ్ఛికంకాని ఏ శబ్దంతోనైనా సంబంధార్థంలో వాఁడు, వారు, అది, అవి అనే వాటితో సమసిస్తుంది. అది, ధాతుజ విశేషణాలకు విశేష్యాలకు లాగానే విభక్తుల్ని చేర్చాలనుకున్నపుడు తత్ శబ్దాల్ని కలిపి సమాసాల్ని చేస్తారు. సంస్కృతంలో తత్ శబ్దంలాగే తెలుగులో కూడా వాఁడు. వారు, అది, అవి అనే శబ్దాలను ఉపయోగిస్తాం.

ఉదా॥ వచ్చినవాఁడు : వచ్చిన–భూతకాలిక ధాతుజ విశేషణం. 'తత్' (వాఁడు) చేరి విశేషణ పూర్వపద కర్మధారయం ఏర్పడింది.

ఇలాగే రానివాఁడు : రాని – వ్యతిరేక ధాతుజ విశేషణం. అలాగే వచ్చిన + అది > వచ్చినది; రాని + అది > రానిది. ఇవి కూడా కర్మధారయ సమాసాలే.

**'అట్టి' అనే పదం చేరడం :** ధాతుజ విశేషణాలకు కొన్ని చోట్ల 'అట్టి' అనే శబ్దం విభాషగా చేరుతుంది. (స. 26)

ఉదా॥ వచ్చినట్టి రాముఁడు :

వచ్చిన – భూతకాలిక ధాతుజ విశేషణం. రాముఁడు – విశేష్యం. ఇవి రెండూకలిసి సమాసం ఏర్పడేటపుడు ధాతుజ విశేషణం చివర 'అట్టి' విభాషగా చేరుతుంది.

వచ్చిన + అట్టి > అపదాది స్వరసంధి > వచ్చినట్టి రాముఁడు 'అట్టి' రావడం విభాష కాబట్టి

చేరనపుడు 'వచ్చిన రాముఁడు' అనే సమాసం ఉంటుంది.

ఇలాగే వచ్చు నట్టి రాముఁడు : వచ్చు – తధర్మ ధాతుజ విశేషణం. రాముఁడు – విశేష్యం ఇవి రెండూకలిసి సమాసం ఏర్పడేటపుడు ధాతుజ విశేషణం చివర 'అట్టి' విధిగా చేరుతుంది.

వచ్చు + అట్టి – రాముఁడు > నుగాగమం > వచ్చునట్టి

రాముఁడు 'అట్టి' రాకపోతే 'వచ్చురాముఁడు'

**నిగాగమం చేరటం:** గుణ వాచకాలైన 'నల్ల' మొదలైన శబ్దాలకు 'నిక్' అనే ఆగమం బహుళంగా

వస్తుంది. (స. 12) కళారం ఇద్వర్ణం కాబట్టి ఇది గుణవాచకం చివర చేరుతుంది.

నల్లని గుఱ్ఱము : నల్ల – గుణవాచకమయిన విశేషణం. 'గుఱ్ఱము' అనే విశేష్యంతో కలిసి సమాసం ఏర్పడేటపుడు 'నల్ల' అనే గుణవాచకం చివర 'ని' చేరుతుంది.

'నల్లని గుఱ్ఱము' – 'ని' చేరనపుడు 'నల్ల గుఱ్ఱము'

ఇలాగే తెల్ల / తెల్లని; పచ్చ / పచ్చని; ఎఱ్ఱ /ఎఱ్ఱని;

చామ/చామని; తియ్య/తియ్యని; కమ్మ / కమ్మని;

పుల్ల /పుల్లని; విన్న / విన్నని; తిన్న / తిన్నని

అల్ల / అల్లని అనే రూపాలు విశేషణాలుగా పనిచేస్తాయి.

**త్రికం పూర్వపదంగా ఉన్నప్పుడు:** ఆ ఈ ఏ అనే సర్వనామాల్ని 'త్రికం' అంటారు. కర్మధారయం ఏర్పడడానికి 'త్రికం' పూర్వపదంగా వచ్చి విశేషణంగా ప్రవర్తిస్తుంది.

ఉదా॥ ఆకన్య.

'త్రికం' మీద వచ్చే అసంయుక్త హల్లుకు ద్విత్వంబహుళంగా వస్తుంది. (స. 14) ఆ + కన్య, 'ఆ' త్రికం. 'క' అసంయుక్త హల్లు. దీనికి ద్విత్వం వస్తుంది. ఆ+క్కన్య, ద్విత్వహల్లు పరమైనపుడు ముందున్న ఆచ్ఛిక దీర్ఘానికి హ్రస్వం వస్తుంది. (స. 19) 'అక్కన్య', ద్విత్వం రానపుడు 'ఆకన్య' అని ఉంటుంది.

ఇలాగే ఈ కాలము ఇక్కాలము; ఏలోకము / ఎల్లోకము;

ఆ + అశ్వము > యడాగమం > అయ్యశ్వము ఆయశ్వము

సూత్రంలో 'బహుళము' అని చెప్పినందువల్ల శ ష స హ ల కు, రేఫానికి ద్విత్వం రాదు.

ఉదా॥ ఈ శబ్దము, ఏషండము, ఆ సుకృతి, ఆహయము, ఆ రూపము మొదలైనవి.

'త్రికం' హ్రస్వం అయిన తర్వాత దానిమీద చేరే 'చోటు' శబ్దంలోని ఓత్వానికి 'అత్వం'గానీ, 'హ్రస్వం'గానీ విభాషగా వస్తాయి. (స. 15) ఉదా॥ ఆ + చోటు > (స. 14) ఆ + చోటు > 'ఆ' కి హ్రస్వం అచ్చోటు. 'అ' అనేది కృతహ్రస్వంగా చేయబడిన త్రికం. దానిమీద 'చోటు' శబ్దంలోని ఓత్వానికి హ్రస్వం

(ఒ) వస్తే 'అచ్చోటు' అత్వం (అ) వస్తే అచ్చటు. ఇది విభాష – రానపుడు ఆ చోటు, అచ్చోటు అలానే ఉంటాయి.

అలాగే ఇచ్చోటు / ఇచ్చోటు / ఇచ్చటు; ఎచ్చోటు / ఎచ్చోటు / ఎచ్చటు.

'అక్కట' మొదలైన శబ్దాల్లోని ద్విత్వం విభాషగా లోపిస్తుంటుంది. (ప్రకీర్ణక–8) అచటు, అచొటు; ఇచటు, ఇచోటు; ఎచటు, ఎచోటు అనే రూపాలు ఏర్పడుతాయి.

**ముచ్చోటులు / ముచ్చటులు / ముచ్చటులు:** త్రికం గాని చోట్ల కూడా ఈ వ్యాకరణ కార్యాలు జరుగుతున్నాయి అని సూరి వివరించాడు.

ఉదా॥ ముచ్చోటులు దీనిని విడదీస్తే మూడు + చోటులు. ఇందులోని దు వర్ణానికి లోపం వచ్చి

పైన పేర్కొన త్రికసంధి కార్యం జరిగి ముచ్చటులు, ముచ్చొటులు అనే రూపాలు ఏర్పడతాయని సూరి వివరించాడు.

**'చోట' లో 'ట' లోపం :** ఉత్తర పదంగా ఉన్న 'చోటు' శబ్దం యొక్క 'ట' అక్షరానికి లోపం విభాషగా వస్తుంది. (స.16) 'చోటు' శబ్దం ఔపవిభక్తికం కాబట్టి దాని చివరి అక్షరం సప్తమికి ఆదేశం అయిన 'అ' కారంతో కలిసి ఉంటుంది. అందువల్ల 'ట' అనేది లోపిస్తుంది. అచ్చోటనున్నాఁడు > విభాషగా 'ట' లోపం > అచ్చోనున్నాఁడు. లోపించనపుడు 'అచ్చోటనున్నాఁడు'. ఒక చోట నుండె / ఒకచో నుండె.

**అయి, అయి శబ్దాలు రావడం:** 'తత్' అనే అర్థాన్నిచ్చే 'ఆ' అనే శబ్దం పక్కన ఆమ్రేడితంగా వచ్చే 'ఆ' కారానికి 'అయి' లేదా 'ఆయి' విభాషగా ఆదేశం అవుతాయి. (స.21) ఆ + ఆ > అయయి/ ఆయాయి, అ ఆ ల ముందు యడాగమం వస్తుంది.

'ఆ' మీద ద్విరుక్త హల్లు, 'ఆ' కు హ్రస్వం వస్తే యడాగమం కూడా వచ్చి 'అయ్యయి కాలము, అయ్యాయి కాలము' ఏర్పడతాయి.

అచ్ఛిక శబ్దాల్లోని 'అయి'కి 'ఐ' ఆదేశం అవుతుంటుంది. (క్రి.108) (అయి > ఐ) అలా 'అయి' కి 'ఐ' కారం వస్తే యడాగమం వచ్చి, ఆయై కాలము; హల్లుకు ద్విరుక్తం, 'ఆ' కి హ్రస్వం వచ్చి 'అయ్యైకాలము' ఏర్పడతాయి.

'ఆయా కాలము' అనే రూపం మీద రెండో 'ఆ' మీద త్రికసంధి జరిగితే – ఆయక్కాలము, అయ్యాకాలము, అయ్యక్కాలము – ఏర్పడతాయి.

**ధాతుజ విశేషణాలు కర్మాదులతో కలిసి సమాసాలు కావడం:** కర్మం, కరణం మొదలైన వాటికి ప్రాధాన్యం వివక్షించినపుడు కర్తతోలాగానే ధాతుజ విశేషణాలు కర్మాదులతో కూడా కలిసి సమాసాలు

ఏర్పడతాయి. (స.24)

| | | |
|---|---|---|
| ధాతుజ విశేషణం | + కర్త | > భృత్యుని రక్షించిన రాముఁడు |
| ధాతుజ విశేషణం | + కర్త | > రాముఁడు రక్షించిన భృత్యుఁడు |
| ధాతుజ విశేషణం | + కరణం | > రాముఁడు వాలినేసిన బాణము |
| ధాతుజ విశేషణం | + సంప్రదానం | > రాముఁడు గోవునిచ్చిన విప్రుఁడు |
| ధాతుజ విశేషణం | + అపాదానం | > రాముఁడు వెడలిన వనము |
| ధాతుజ విశేషణం | + అధికరణం | > రాముఁడు వసించిన పర్ణ గృహము |
| | | > రాముఁడు వసించిన చోటు |

'చోటు' ఆచ్ఛిక శబ్దానికి ఉదాహరణగా ఇవ్వబడింది.

**తత్పురుష సమాస నిర్మాణం :**

తత్పురుష మొదలైన సమాసాల లక్షణం సంస్కృత వ్యాకరణంలో చెప్పినవిధంగానే ఉంటుంది. (స.3) ఉత్తర పదం యొక్క అర్థం ప్రధానంగా ఉండేది తత్పురుష సమాసం. తత్పురుష సమాసాన్ని వ్యధికరణం అంటారు. వ్యధికరణము అంటే సమాసంలోని పూర్వ పర పదాలు రెండు భిన్న విభక్తులలో ఉండటం. పూర్వపదం ద్వితీయాది భిన్న విభక్తులలో ఉత్తర పదము ప్రథమా విభక్తిలో ఉండటం ఈ సమాసంలో కనిపిస్తుంది. తత్పురుషంలో సమానాధికరణంలాగే వ్యధికరణంకూడా మరొక పద్ధతి.

| | |
|---|---|
| ద్వితీయా తత్పురుష | : నెల తాల్పు (నెలను తాల్చినవాఁడు) |
| తృతీయా తత్పురుష | : నెల తక్కువ వాఁడు (నెలచేత తక్కువవాఁడు) |
| చతుర్థీ తత్పురుష | : దేవరమేలు (దేవర కొఱకు మేలు) |
| పంచమీ తత్పురుష | : దొంగ భయము (దొంగ వలన భయము) |
| షష్ఠీ తత్పురుష | : రాముని బాణము (రాముని యొక్క బాణము) |
| సప్తమీ తత్పురుష | : మాటనేర్పరి (మాట యందు నేర్పరి) |

**తత్పురుష సమాసంలో జరిగే వ్యాకరణ కార్యాలు:**

**'తత్' శబ్దంతో సమాసం ఏర్పడడం:** సర్వశబ్దాలు సంబంధార్థంలో 'తత్' శబ్దంతో కలిసి తత్పురుష సమాసాలు ఏర్పడతాయి.

ఉదా॥ నా వాఁడు (నా యొక్క వాఁడు)

నా యది (నా యొక్క అది)

ఇంటివాఁడు (ఇంటి యొక్క వాఁడు)

ఇంటిది (ఇంటి యొక్క అది)

రామునివాఁడు (రాముని యొక్క వాఁడు)

రామునిది (రాముని యొక్క అది)

**దుగాగమం:** నీ, నా, తన శబ్దాలకు ఉత్తపర పదం పరమైనపుడు 'దు' విభాషగా వస్తుంది.

ఉదా॥ యుష్మదర్థంలో – నీదు కరుణ, నీకరుణ

అస్మదర్థకంలో – నాదు నేరిమి, నా నేరిమి

ఆత్మార్థకంలో – తనదురూపు, తనరూపు

**పజ్ పవర్ణాలు ఆదేశంగా రావటం :** సమాసాల్లో కొన్ని చోట్ల (1) 'నాము' మొదలైన శబ్దాల 'ము' వర్ణానికి 'పజ్' ఆదేశంగా వస్తుంది. (2) 'కనుము' మొదలైన శబ్ధాల 'ము' వర్ణానికి 'ప' ఆదేశం వస్తుంది. (స.19).

ఉదా॥ నాఁప చేను (నాము + చేను)

పాఁప తేఁడు (పాము + తేఁడు)

ప్రేఁప బెత్తము (ప్రేము + బెత్తము)

వేఁప చెట్టు (వేము+ చెట్టు)

అంపపొది (అమ్ము + పొది)

ఎంపముక్క (ఎమ్ము + ముక్క)

**కనుమ్వాదులు :**

కనుపపులు (కనుము+పులు)

ఇలాగే ఇనుప కడ్డీ (ఇనుము + కడ్డీ)

ఉడుప కుక్క (ఉడుము+ కుక్క)

ఎనుపపడ్డ (ఎనుము+పడ్డ)

జనుపనార (జనము + నార)

మినుపవడ (మినుము + వడ)

**సమాస విభక్తికి లోపం:** విగ్రహ వాక్యంలో కనిపించే సమాస విభక్తికి లోపం వస్తుంది. అయితే ద్వితీయాది విభక్తుల బహువచన లకారానికి (లడాగమం) మాత్రం లోపం రాదు.

ఉదా॥ రాముని బాణములు (రాముని యొక్క బాణములు) > 'యొక్క' లోపం

గుణముల ప్రోక (గుణముల యొక్క ప్రోక) 'యొక్క' లోపం. ల కి లోపం లేదు.

**ద్విగు సమాసంలోని వ్యాకరణ కార్యాలు:** కర్మధారయ సమాసంలో పూర్వపదం సంఖ్యా వాచకమైతే అది 'ద్విగు సమానం' అవుతుంది.

సమానాధికరణంలో ఉత్తర పదం పరమయితే 'మూఁడు' శబ్దంలోని 'డుజ్' వర్ణానికి లోపం – తర్వాతి హల్లుకు ద్విత్వం వస్తాయి.

ఉదా।। మూఁడు + జగములు – (ముజ్జగములు)

మూఁడు + లోకములు – ముల్లోకములు.

**ద్విగువుకు ఏకవచనం రావడం:** ఆచ్ఛిక ద్విగు సమాసానికి ప్రాయికంగా ఏకవచనం వస్తుంది. అయితే మిశ్ర సమాసానికి రాదు.

ఉదా।। ముచ్చిచ్చు : (మూఁడు + చిచ్చులు)

ముక్కారు : (మూడు + కారులు)

ముప్పాతిక : (మూఁడు + పాతికలు )

ముత్రోవ : (మూఁడు + త్రోవలు)

ముప్విధములు : మూఁడు + విధములు > మూ + వ్విధములు > ముప్విధములు, 'మూఁడు' ఆచ్ఛిక శబ్దం. విధములు : తత్సమం. అంటే ఈ ద్విగు సమాసం 'మిశ్ర సమాసం'. మిశ్ర సమాసంలో బహువచనానికి ఏకవచనం రాదు. 'ముప్విధములు' అనే ఉంటుంది.

**ద్వంద్వ సమాసంలో జరిగే వ్యాకరణ కార్యాలు :** ఉభయ పదార్థ ప్రాధాన్యంగలిగింది ద్వంద్వ సమాసం అని పైన పేర్కొన్నాము. ఈ ద్వంద్వ సమాసం సాధారణంగా బహువచనంలో ఉంటుంది.

ఉదా।। 'తల్లి దండ్రులు' తల్లి + తండ్రి > ఈ రెండు పదాలుచేరి 'తల్లి దండ్రులు' అనే సమాసం ఏర్పడుతుంది. ఈ ద్వంద్వ సమాసంలో రెండు పదాలకు సమప్రాధాన్యం ఉంటుంది. ద్వంద్వం సాధారణంగా బహువచనంలో ఉంటుంది.

ఈ ద్వంద్వ సమాసం 'స్త్రీ సమం' పూర్వపదంగా ఉండి, ఏదైనా ఆచ్ఛిక పదంతో కలిసి ఏర్పడుతుంది.

ఉదా।। అన్నదమ్ములు (అన్న + తమ్ముఁడు) అన్న–స్త్రీ సమం. తమ్ముఁడు– ఆచ్ఛిక శబ్దం

అలాగే తల్లిదండ్రులు: ఊరు పల్లెలు, ఆలుమగలు.

*మగఁడును బిడ్డలును : మగఁడు: స్త్రీ సమం కాదు. ఇది పుంలింగ తుల్యం. అందువల్ల ఈ శబ్దాలతో ద్వంద్వసమాసం ఏర్పడదు.

అలాగే పల్లమును గల్లెమును : 'పల్లము' స్త్రీ సమం కాదు. నపుంసక లింగ తుల్యం. అందువల్ల ద్వంద్వం ఏర్పడదు.

**ఋకారానికి 'ర' వర్ణం ఆదేశం కావటం:** ద్వంద్వ సమాసంలో ఋకారానికి 'ర' వర్ణం ఆదేశం అవుతుంది.

ఉదా॥ మాత్రపితలు

మాతృ + పితృ > ('ఋ' కి, 'ర' ఆదేశం రావటం) మాత్ర + పితృ > (ఋ కారాంతానికి అత్వం, స్త్రీ వద్భావం రావటం) మాత్ర పిత, అవుతుంది. దీనిపైన 'లు' చేరి 'మాత్ర పితలు' అవుతుంది.

**బహువ్రీహి సమాసంలో జరిగే వ్యాకరణ కార్యాలు :** అన్య పదార్థ ప్రాధాన్యం కలది బహువ్రీహి సమాసం అని పైన పేర్కొన్నాము. తెలుగులో స్త్రీ సమ శబ్దాలతో బహువ్రీహి సమాసాలు అరుదుగా కనిపిస్తాయి.

ఉదా॥ ముక్కంటి : మూఁడు కన్నులు గలవాఁడు (శివుఁడు) అనే అర్థంలో మూఁడు + కన్నులు > ఇవి రెండూ స్త్రీ సమాలే. సమాస విభక్తి లోపించి – మూఁడు + కన్ను – బహువ్రీహిలో సమాసాంత కార్యాలు వస్తుంటాయి. 'న్ను'కు ంటి ఆదేశంగా వస్తుంది. ముక్కంటి అవుతుంది.

ఇలాగే వేగంటి (వేయి + కన్నులు)

చలివెలుఁగు (చలి + వెలుగు)

వేవెలుగు (వేయి + వెలుఁగు)

కవ్వడి (కవ + వడి)

నిక్కల (నిక్కము + కల)

పువ్విలుకాఁడు (పూవు + విలుకాఁడు)

ఇలాగే బహువ్రీహి ఒకోసారి పుంలింగతుల్యాన్నిఉత్తర పదంగా కలిగి ఉండవచ్చు.

* బహువ్రీహి సమాసంలో స్త్రీని తెలిపేటపుడు ఉపమానం మీద చేరే 'మేను' అనే శబ్దానికి 'బోఁడి' అనే శబ్దం ఆదేశం అవుతుంది. అలరుబోఁడి అలరు వంటి మేను గలది. అలరు + మేను > 'మేను' కు 'బోఁడి' ఆదేశం > అలరుబోఁడి. ఇలాగే ననబోఁడి; పూవు బోఁడి; విరి బోఁడి; మొదలైనవి.

**సమాస విభక్తికి లోపం రావటం:** సమాస విభక్తికి లోపం వస్తుంది. లడాగమానికి మాత్రం అంటే సమాసం యొక్క విగ్రహవాక్యంలోనున్న పదాలకు ఏదో ఒక విభక్తి ఉంటుంది. ఆ విభక్తి ప్రత్యయం సమాస నిర్మాణంలో లోపిస్తుంది.

ఉదా॥ రాజు యొక్క కొడుకు > 'యొక్క షష్ఠీ విభక్తి > లోపించి 'రాజు కొడుకు' అనే సమాసం రూపం ఏర్పడుతుంది.

గుణముల ప్రోక – గుణముల యొక్క ప్రోక: 'యొక్క' లోపిస్తుంది. లడాగమం 'ల' లోపించదు. బహువచనం తెలపడానికి విభక్తి ప్రత్యయం ముందు 'ల' చేరుతుంది.

ఈవిధంగా చిన్నయసూరి సమాసపరిచ్ఛేదంలో సమాస విభజనను, తెలుగు సమాస నిర్మాణరీతిని వివరించారు.

**-0-**

పాఠం -2

# వ్యాసరూప ప్రశ్నలు

**విషయ సూచిక**

1. ఉపోద్ఘాతం
2. తద్ధిత పరిచ్ఛేదం
3. కృదంత పరిచ్ఛేదం
4. ప్రకీర్ణక పరిచ్ఛేదం

**1. ఉపోద్ఘాతం:**

ఈ పాఠ్య భాగంలో తద్ధిత ప్రత్యాయాలను , కృత్రప్రత్యాలను, ఇతర భాషా రూపాల ప్రక్రియలను గూర్చి తెలుసుకుంటారు.

**2. తద్ధిత పరిచ్ఛేదం :**

## 1) బాలవ్యాకర్త పేర్కొన్న తద్ధితాలను వివరించండి?

'తద్ధితం' అనే సంజ్ఞ సంస్కృతం నుంచి తెచ్చుకొన్నది. తద్ధితము అంటే తత్ +హితము. 'ప్రయోగాల కోసం హితమైనది' అని అర్థం. తద్ధిత ప్రత్యయాలు నామాలపైన వివిధార్థాల్లో చేరతాయి. అవి చేరి ఏర్పడిన నామాల్ని 'తద్ధితాంత నామాలు' అంటారు. నామవాచకాల్లో ఇవి కూడా ఒక భాగం, వీటిని ఆంగ్లంలో "Secondary Derivatives" అంటారు.

తద్ధిత ప్రత్యయాలు, నామాలకు ఏయే అర్థాల్లో చేరతాయో, అవి చేరేటపుడు ఏయే వ్యాకరణ కార్యాలు జరుగుతాయో తెలుసుకుందాం.

**బాలవ్యాకర్త పేర్కొన్న తద్ధిత ప్రత్యయాలు:-**

(1) తాచ్ఛీల్యము, (2) తిర్యక్కులకు, (3) త్వార్థం, (4) దఘ్నార్థం, (5) మతుబర్థం (6) మానార్థం, (7) యువతి విటీ రజస్వలలు, (8) స్వార్థం అనే అర్థాల్లో నామాలకు చేరతాయి,

**1. తాచ్ఛీల్యము(మారి, పోతు):**

(మారి, పోతు) వస్తువు యొక్క (తత్) స్వభావాన్నితెలిపేది, తాచ్ఛీల్యము (తత్ + శీలం). ఈ అర్థంలో ప్రాతిపదికకు 'మారి, పోతు' అనే ప్రత్యయాలు చేరతాయి.

ఉదా॥ మంటమారి, తిండిబోతు

**2. 'తిర్యక్కులకు' (కా):**

తిర్యక్కులు అనే అర్థంలో నామానికి 'కా' అనేప్రత్యయం చేరుతుంది. (తద్ధి. 14) 'తిర్యక్కులు'

అంటే పశుపక్ష్యాదులు. ఉదా॥ ఇబ్బందికాడు. 'ఇబ్బంది' అనేది ఒక అడవిపంది పేరు. నామం.

'కా' చేరి 'ఇబ్బందికా'. 'కా' ప్రత్యయాంతం మగాది గణంలో చేరుతుంది. కాబట్టి 'డుజ్' చేరుతుంది. (ఆచ్ఛిక. 4) ఇబ్బంది కా + డుజ్. 'జిత్తు' చేరితే దానిముందు బిందువు వస్తుంది. (ండు / ఁడు) దీర్ఘం కాబట్టి అరసున్న మాత్రమే చేరి 'ఇబ్బంది కాఁడు'. ఇలాగే పరికాఁడు. ఒంటిగాఁడు. కొమ్ముకాఁడు కొన్ని చోట్ల కకారానికి గకారం వస్తుంది. ఒంటిగాఁడు ఇవన్నీ అడవిపందుల పేర్లే.

**3. త్వార్థము (తన, తిక, ఇమి, న మొ॥వి):**

త్వ + అర్థము > త్వార్థము. 'త్వార్థము' అంటే 'భావార్థం, ప్రాతిపదికను వినగానే మనకు అర్థ జ్ఞానంలో విశేషణంగా తోచేది 'భావం'. ఆ అర్థంలో సంస్కృతంలో నామానికి 'త్వ' చేరుతుంది. అందుకే దీన్ని 'త్వార్థం' అన్నారు. ఉదా॥ రామత్వమ్ అంటే రాముని భావము అని అర్థం. సీతాత్వం అంటే సీత భావం అని అర్థం. ఈ అర్థంలో తెలుగులో 'తన' వర్ణకం చేరుతుంది

ఉదా॥ రామునితనము, సీతతనము మొ॥వి.

'త్వార్థం'లో తన వర్ణకం ఒక్కటే కాకుండా టిక–ము, ఇమి, న, ఇక, న, ర, కార, వు అనే ప్రత్యయాలు కూడా నామాలకు చేరతాయి.

**–తిక వర్ణకం:** చిన్నతికము, చుట్టతికము, దొంగతికము, పేదతికము మొ॥వి.

**– 'ఇమి' వర్ణకం:** 'త్వార్థం' అనే అర్థంలో నామాలకు 'ఇమి' అనే తద్ధిత ప్రత్యయం చేరుతుంది. (తద్ధిత) పేరిమి: పేరు (పెద్ద) యొక్క భావము > పేరు యొక్క ఇమి > 'యొక్క' లోపం > పేరు + ఇమి > అపదాది స్వరసంధి > పేరిమి.

ఉదా॥ కడు + ఇమి > కడిమి,

క్రుచ్చు + ఇమి > క్రుచ్చిమి

చెలి + ఇమి > చెలిమి

పోఁడి + ఇమి > పోఁడిమి

వాఁడి + ఇమి > వాఁడిమి

వేఁడి + ఇమి > వేఁడిమి

వీటిమీద 'సు' చేరి స్త్రీ సమాలు కాబట్టి త.57 చే లోపిస్తుంది.

**–'న' వర్ణకం :** 'గుణ' 'వాచకాలైన' నల్ల మొదలైన నామాలకు త్వార్థంలో 'న' అనే తద్ధిత ప్రత్యయం చేరుతుంది. నల్లన : నల్ల (రంగు) యొక్క భావం: 'న' చేరుతుంది.

ఉదా॥ నల్లన, తెల్లన, పచ్చన, ఎఱ్ఱన, చామన,

**–'ఇక' వర్ణకం :** త్వార్థంలో నామాలకు 'ఇక' అనే తద్ధిత ప్రత్యయం చేరుతుంది.

ఉదా॥ అగ్గలిక, ఒమ్మిక

మగటిమి, పేదఱిమి, ఒజ్జనము, కోడంట్రికము, కోమలికము మొదలైన రూపాల్ని ప్రయోగాల్ని బట్టి గ్రహించాలి.

**– 'కార' వర్ణకం :** ఉదా॥ చెలికారము

**– 'పు' వర్ణకం :** ఉదా॥ తెలుపు, ఎఱుపు, పసుపు, నలుపు.

'ఱిక' మొదలైన ప్రత్యయాలు 'త్వార్థం'లో రానపుడు, మొదటనే చెప్పినట్లు భావార్థకం (త్వార్థం)లో అన్ని నామాలకు 'తన' వర్ణకం చేరుతుంది. ఉదా॥ చిన్నఱికము. 'ఱిక' రానపుడు : చిన్నతనము, అలాగే ముచ్చుఁదనము, నల్లఁదనము, అగ్గలంపుఁదనము, ఒజ్జతనము మొదలైన రూపాలు వస్తాయి.

**4. దఘ్నార్థం (బంటి, కొలది):**

'దఘ్నార్థం'లో నామాలకు బంటి, కొలఁది అనే తద్ధిత ప్రత్యయాలు చేరతాయి. సంస్కృతంలో 'దఘ్నచ్' అనే ప్రత్యయం 'లోతు'ను తెలుపుతుంది. ఉదా॥ కంఠదఘ్నము అంటే కంఠంలోతని అర్థం. ఈ అర్థంలో తెలుగులో 'బంటి', 'కొలఁది' అనే ప్రత్యయాలు వస్తాయి. ఉదా॥ మోఁకాలిబంటి, మోకాలికొలది. ఇలాగే ఱొమ్ముబంటి, ఱొమ్ముకొలఁది.

**5. మతుబర్థం (అ, అం, అరి, అడి, ఇడి, కత్తియ మొ॥వి) :**

మతుబర్థంలో కా, కత్తి, ఈ, అరి, ఇ, త, ఆఁడి, ఇఁడి; అ, అము అనే తద్ధిత ప్రత్యయాలు నామాలకు చేరతాయి.

**కా. కత్తియ వర్ణకాలు:** 'మతుప్' అనే సంస్కృత తద్ధిత ప్రత్యయానికి 'కలది', 'కలవాఁడు' అనే అర్థాలు ఉన్నాయి.

(అ) 'కలవాఁడు' అనే అర్థంలో పురుషుణ్ణి తెలిపే నామానికి –కా అనే ప్రత్యయం చేరుతుంది.

ఉదా॥ ఆటకాడు

(ఆ) –కలది అనే అర్థంలో 'కత్తియ' చేరుతుంది.

ఉదా॥ ఆటకత్తియ

అడపకాఁడు/ అడపకత్తియ, ఎమ్మెకాఁడు / ఎమ్మెకత్తియ, ఓయారకాఁడు / ఓయారకత్తియ, కటారికాఁడు / కటారి కత్తియ, కొల్లగాఁడు / కొల్ల గత్తియ, చెలిమికాఁడు / చెలిమి కత్తియ, చేరువకాఁడు / చేరువ కత్తియ, చౌరవకాఁడు / చౌరవ కత్తియ, జట్టిగాఁడు / జట్టి గత్తియ, జాజరకాఁడు / జాజర

కత్తియ, జూదగాఁడు / జూద గత్తియ, తిండికాఁడు / తిండి కత్తియ, తేరగాఁడు / తేరగత్తియ, దొడ్డ కాఁడు / దొడ్డ కత్తియ, నీటు గాఁడు / నీటు గత్తియ, నేస్త గాఁడు / నేస్త గత్తియ, బేర గాఁడు / బేర కత్తియ, పగ కాఁడు /పగ కత్తియ, విల్లు కాఁడు / విల్లు కత్తియ, వెచ్చగాఁడు / వెచ్చ గత్తియ, సొగసుకాఁడు / సొగసు కత్తియ మొదలైనవి.

**'ఈ' వర్ణకం :** 'అటమట' మొదలైన నామాలకు పురుషుణ్ణి తెలిపేటప్పుడు 'ఈ' అనే తద్ధిత ప్రత్యయం చేరుతుంది. ఉదా॥ అటమటీఁడు, కమ్మ తీఁడు, కన్నడీఁడు, కొండీఁడు, బానసీఁడు, బూటకీఁడు, మందడీఁడు, సుంకీఁడు, ఉక్కీఁడు.

**'అరి' వర్ణకం :** మతుబర్థంలో (కలవాఁడు / కలది) అనే అర్థంలో 'అరి' అనే తద్ధిత ప్రత్యయం చేరుతుంది. ఉదా॥ జాలరి. ఒఱవరి, కల్లరి, చదువరి, జూదరి, టక్కరి, తగవరి, తీరువరి, తెరువరి, నెరువరి, మతకరి, వెరపరి, వేఁటరి, సిగ్గరి, సుంకరి.

**'ఇ' వర్ణకం :** ఓయారము మొదలైన నామాలకు మతుబర్థంలో 'ఇ' అనే తద్ధిత ప్రత్యయం చేరుతుంది.

ఉదా॥ కడలు > కడలి; చాగము > చాగి; జోగము > జోగి; మతకము > మతకి; తుటారము > తుటారి; బండారము > బండారి; బిత్తరము > బిత్తరి; బిటారము > బిటారి; బేహారము > బేహారి; మచ్చరము > మచ్చరి; మిటారము > మిటారి; విన్నాణము > విన్నాణి; వెక్కసము > వెక్కసి.

**'తో' వర్ణకం :** మతు బర్థంలో స్త్రీని గురించి 'కలది' అని తెలిపేటపుడు, కులవాచక నామాలకు 'త' అనే తద్ధిత ప్రత్యయం చేరుతుంది.

ఉదా॥ కొఱవత, చెంచెత, మాలెత, గుబ్బెత, ముట్టుత

**6. మానార్థం (ఎఁడు):**

మానార్థం (కొలతను తెలిపేది)లో ఏకవచనంలో 'ఎఁడు' అనే తద్ధిత ప్రత్యయం నామానికి చేరుతుంది.

ఉదా॥ తూము + ఎఁడు > తూమెఁడు

ముంత + ఎఁడు > ముంతెఁడు; ఎత్తు + ఎఁడు > ఎత్తెఁడు;

వీసె + ఎఁడు > వీసెఁడు; జేన + ఎఁడు > జేనెఁడు;

మూర + ఎఁడు > మూరెఁడు; కుండ + ఎఁడు > కుండెఁడు;

గంప + ఎఁడు > గంపెఁడు మొదలైనవి.

**7. యువతి, విటీ, రజస్వల :**

కులవాచకాలు గాని యువతి, విటీ, రజస్వల అనే నామాలకు కూడా మతుబర్థంలో 'త' చేరుతుంది.

ఉదా॥ యువతి, గుబ్బెత, మిండత, ముట్టుత

**'ఆఁడి' వర్ణకం :** బహువచనాంతాలైన 'వగ' మొదలైన నామాలకు 'కలది' అనే అర్థంలో స్త్రీని తెలిపేటపుడు (మతుబర్థంలో) 'ఆఁడి' అనే తద్ధిత ప్రత్యయం చేరుతుంది.

ఉదా॥ వగలు + ఆఁడి > వగలాఁడి

చిన్నెలు + ఆఁడి > చిన్నెలాఁడి

వన్నెలు + ఆఁడి > వన్నెలాఁడి

దొమ్ములు + ఆఁడి > దొమ్ములాఁడి

ఎమ్మెలు + ఆఁడి > ఎమ్మెలాఁడి

**'ఆ' ప్రత్యయం:** బహువచనాంతాలైన 'వగ' మొదలైన నామాలకు పురుషుణ్ణి తెలిపేటపుడు 'కలవాఁడు' అనే అర్థంలో 'ఆ' అనే తద్ధిత ప్రత్యయం చేరుతుంది.

ఉదా॥ వగలాడు, చిన్నెలాఁడు.

**'ఇఁడి' వర్ణకం:** మతుబర్థంలో లేనివాఁడు, లేనిది అనే అర్థంలో 'ముక్కు మొదలైన నామాలకు 'ఇఁడి' అనే తద్ధిత ప్రత్యయం చేరుతుంది.

ఉదా॥ ముక్కిఁడి, (ముక్కులేనివాఁడు), వాలిఁడి (తోకలేనివాఁడు),

వెరవిఁడి (వెరవులేనివాఁడు), సిగ్గిఁడి (సిగ్గులేనివాఁడు)

**'అ' ప్రత్యయం :** మతుబర్థంలో కొన్ని నామాలకు 'అ' అనే తద్ధిత ప్రత్యయం చేరుతుంది.

ఉదా॥ అడపము + అ > అడప

**'అము' ప్రత్యయం:** 'పెండ్లి కలది' అనే మతుబర్థంలో 'పెండ్లి' అనే నామానికి 'అము' అనే ప్రత్యయం చేరుతుంది.

ఉదా॥ పెండ్లి + అము > పెండ్లము

**8. స్వార్థం :** స్వ + అర్థం > స్వార్థం : 'స్వార్థం' అంటే ప్రకృతి అర్థం.

**స్వార్థంలో 'ఇక' వర్ణకం:** స్వార్థంలో 'ఇక' వర్ణకం నామానికి చేరుతుంది

ఉదా॥ అరమర + ఇక > అరమరిక

ఆము > ఆమిక; అల్లి బిల్లి > అల్లిబిల్లిక;

గండి > గండిక; నడవడి > నడవడిక;

నాడు > నాడిక; నివ్వాళి > నివ్వాళిక;

పొత్తి > పొత్తిక; మాన > మానిక;

మెల > మెలిక; వాలు > వాలిక;

**'ఉక' వర్ణకం :** చిఱుత మొదలైన నామాలకు 'స్వార్థం'లో, 'ఉక' అనే తద్ధిత ప్రత్యయం చేరుతుంది

ఉదా॥ చిఱుత + ఉక > చిఱుతుక; నాతి + ఉక > నాతుక; మెలత + ఉక > మెల=cతుక;

పడcతి + ఉక > పడcతుక; మడcతి + ఉక > మడcతుక;

పొలతి + ఉక > పొలతుక; నిప్పు + ఉక > నిప్పుక;

వెలcది + ఉక > వెలcదుక; ఎమ్ము + ఉక > ఎమ్ముక మొదలైనవి.

**కా, కత్తియ వర్ణకాలు:** 'స్వార్థం' లో కొన్ని నామాలకు పురుషుణ్ణి తెలిపేటప్పుడు 'కా' వర్ణకం, స్త్రీని తెలిపేటప్పుడు 'కత్తియ' వర్ణకం చేరతాయి.

ఉదా॥ చెలికాcడు, చెలికత్తియ, హెగ్గడికాcడు, హెగ్గడి కత్తియ.

**'రు' ప్రత్యయం :** 'స్వార్థం'లో కొన్ని నామాలకు 'ఈ' అనే తద్ధిత ప్రత్యయం చేరుతుంది.

ఉదా॥ మొక్కలీcడు. కల్లరీcడు.

ఈ తద్ధిత ప్రత్యయాలు పరమైనప్పుడు కొన్ని సందర్భాలలో ప్రాతిపదిక ఉ > అ గా, ఉ > ఎ గా క > గ గా మారతాయి.

ఉదా॥ తొత్తు > తొత్తటికము (ఉ > అ గా మారటం)

చెంచు + త చెంచెత (ఉ > ఎ గా మారటం)

కా, కత్తియల 'క'కారం 'గ'కారంగా మారటం, దోసిలి మొ॥న శబ్దాలలో 'లి' లోపించి 'దోసెడు' వంటి రూపాలేర్పడటం వంటివి ప్రక్రియలను చిన్నయసూరి పేర్కొన్నాడు.

నామాలకు, విశేషణాలకు చేరే నామ విభక్తులకన్నా భిన్నమైన ప్రత్యయాలు ఈ తద్ధితాలు. ఈ తద్ధితాలను ఉపయోగించటం వలన రచనలో పొదుపు సమకూరుతుంది.

ఉదా॥ సిగ్గులేనివాడు అనటం కంటే 'సిగ్గిడి' అనటం పొదుపు. అలా పొదుపుగా భాషను ఉపయోగించటం నాగరకుల లక్షణం. అందుకే ప్రతిభాషలోను తద్ధిత పదప్రయోగ ప్రాచుర్యం ఏర్పడింది. భాషలోని తద్ధిత సంపద ఆ భాష యొక్క దేశ్య పద సంపద.

–0–

## 3.కృదంత పరిచ్ఛేదం

### 2) కృదంతం అంటే ఏమిటో వివరించి చిన్నయసూరి కృదంతపరిచ్ఛేతంలో పేర్కొన్న కృత్తులను తెలపండి?

కృత్ ప్రత్యయములు అంతమందుగల పదాలు కృదంతాలు. ధాతువుకు వివిధ అర్థాల్లో చేరే డుఞ్భిన్న ప్రత్యయమే కృత్. 'డుఞ్' అంటే క్రియా విభక్తి ప్రత్యయాలైన డుఞ్, రు, వు, రు, ను, ముఞ్ అనేవి. ఇవి కానివి కృత్ ప్రత్యయాలు. ఇవి చేరి ఏర్పడే నామాలు కృదంతనామాలు. వీటిని ఆంగ్లంలో Primary Derivatives అని అంటారు.

కృదంత పరిచ్ఛేదంలో ఏ ధాతువులకు ఏ కృత్ ప్రత్యయాలు చేరతాయో చిన్నయసూరి వివరించాడు. పద్దెనిమిది సూత్రాలలో 24 విశేష కృత్యాలు నిరూపించాడు. చివరి సూత్రంలో ఐదు కృత్తుల్ని క్రోడీకరించాడు. ఇవి కొన్ని ధాతువులకు మాత్రమే చేరటాన్ని బట్టి వాటిని గణ నిర్ణయం కావించబడలేదు. తక్కిన పద్దెనిమిది కృత్ ప్రత్యయాలు చేరే ధాతువులకు గణ నిర్ణయం కావించబడింది.

కృత్ ప్రత్యయాలకు అర్థాల్ని వ్యవహారంలో ఉన్నట్లుగా గ్రహించాలి. కృత్ ప్రత్యయాలు భావార్థకం, కర్త్రర్థం, కర్మార్థం మొదలైన అర్థాల్లో పూర్వకవులు వాడారు.

మహాకవుల ప్రయోగాల్ని అనుసరించి కృత్ ప్రత్యయాల అర్థం చేసుకోవాలి. ఈ అర్థంలో ఈ కృత్ ప్రత్యయం వచ్చింది అని స్పష్టంగా చెప్పలేం.

అందువల్లనే తద్ధిత పరిచ్ఛేదంలో ఏ నామానికి ఏ ప్రత్యయం ఏ అర్థంలో వస్తుందో వివరించిన సూరి కృదంత పరిచ్ఛేదంలో ఏ ధాతువులకు ఏ కృత్ ప్రత్యయం వస్తుందో తెలిపాడు. కానీ ఏ అర్థంలో ఏ కృత్ ప్రత్యయం వస్తుందో తెలపలేదు.

**1.'అ' – వర్ణకం:**

నీఁటు మొదలైన ధాతువులకు 'అ' అనే కృత్ ప్రత్యయం చేరుతుంది. నీఁటు + అ = నీఁట.

అలాగే కట్ట, చుట్ట, చేద, పాయ, పిడచ మొదలైనవి. (కృ. 18)

**2.'అక' – వర్ణకం:**

మాఁటు మొదలైన ధాతువులకు 'అక' అనే కృత్ ప్రత్యయం చేరుతుంది.

ఉదా॥ మాఁటు + అక = మాఁటకము, అల్లకము, నమ్మకము మొ॥వి. (కృ. 19)

**3.'అవు' – వర్ణకం:**

వడి మొదలైనవి ఇలాగే గ్రహించాలి అనే (కృ. 22) సూత్రంలో సూరి వివరించాడు.

ఉదా॥ తగు + అవు = తగవు. ఉఁటు + అవు = ఉఁటవు మొదలైనవి.

**4.'ఇ' వర్ణకం:**

వడి మొదలైనవి ఇలాగే గ్రహించాలి అనే (కృ. 22) సూత్రంలో సూరి వివరించాడు.

ఉదా।। చేయు + ఇ = చేయి. వ్రాయు + ఇ = వ్రాయి.

**5.'ఇక' వర్ణకం:**

'అంజు' మొదలైన ధాతువులకు 'ఇక' అనే కృత్ ప్రత్యయం చేరుతుంది.

ఉదా।। అంజు + ఇక = అంజిక.

ఇలాగే అమరు > అమరిక, అరయు > అరయిక

అలయు > అలయిక, ఆడు > ఆడిక, ఓడు >ఓడిక

ఓపు > ఓపిక, కూడు > కూడిక, కోరు >కోరిక,

పొందు > పొందిక, పోలు > పోలిక మొదలైనవి.

కను + ఇక దీర్ఘం వచ్చి కాను + ఇక కానిక.

తూఁగు > తూనిక

**6.'ఇకి' వర్ణకం:**

కోరు మొదలైన ధాతువులకు ఇక అనే కృత్ ప్రత్యయం చేరుతుంది.

ఉదా।। కోరు + ఇకి కోరికి ; పూను > పూనికి, పోలు> పోలికి, మను>మనికి, విను > వినికి,

చూచు + ఇకి – చూడు + ఇకి చూడికి మొదలైనవి.

**7.'ఇమి' ప్రత్యయం**

ఇవి అనే కృత్ ప్రత్యయం 'కలుగు' మొదలైన ధాతువులపైన చేరి కొన్ని కృదంతాలు ఏర్పడతాయి (కృ. 4)

ఉదా।। కలుగు + ఇమి – కలు+ఇమి కలిమి.

ఇలాగే ఓరుచు > ఓరిమి, నేరుచు > నేరిమి, వ్రేలుచు > వ్రేలిమి, బడియు > బడిమి, బ్రదుకు > బ్రదిమి, ఒడ్డు > ఒడ్డిమి, తాలు > తాలిమి మొదలైనవి.

**8.'ఉ' ప్రత్యయం:**

అడుకు మొదలైన ధాతువులకు 'ఉ' అనే కృత్ ప్రత్యయం చేరుతుంది. (కృ. 21)

ఉదా॥ అడుకు + ఉ > అడుకు. అలాగే అంటు, ఒప్పు మొదలైనవి.

నిజానికి ధాతువుయొక్క సహజ స్వరూపమే కృద్రూపంగా కనిపిస్తుంది. ఎటువంటి వర్ణకాన్ని చేర్చకుండా కృత్ రూపాన్ని సిద్ధింపచేయకూడదనే ఒక వర్ణకంతో వ్యాకర్త వీటిని నిరూపించినట్లుగా అనిపిస్తుంది.

**9.'క' ప్రత్యయం:** అలుగు మొదలైన ధాతువులకు 'క' అనే కృత్ ప్రత్యయం చేరుతుంది.

**1. గకారాంత ధాతువులు:** అలుక: అలుగు + క > అలుక

ఇలాగే ఆఁగు + క > ఆఁక, ఎఱుగు + క > ఎఱుక, కలఁగు + క > కలఁక : కాఁగు + క > కాఁక, తునుఁగు + క > తునుక, నలఁగు + క > నలక, మూఁడగు + క > మూఁక, మడఁగు + క > మడఁక; మలఁగు + క > మలక, వంగు + క > వంక; వీఁగు + క > వీఁక మొదలైనవి.

ఇలాంటి సందర్భాల్లో ఒక్కోసారి ధాతువు చివరి గ కారం ముందున్న బిందువు లోపిస్తోంది.

ఎఱుఁగు + క > ఎఱుఁక, మునుగు + క > మునుక మొదలైనవి.

**2. చకారాంత ధాతువులు :** క ప్రత్యయం చేరేటప్పుడు ధాతువు చివరి చకారం లోపిస్తుంది.

నడచు + క > నడక, మొలచు + క > మొలక

**3. వ కారాంత ధాతువులు:** పోవు + క > పోక

**4. యకారాంతధాతువులు:** కినియు + క > కినుక. ముదియు + క > ముదుక

**10.'కలి' వర్ణకం:**

వడి మొదలైనవి ఇలాగే గ్రహించాలి (కృ. 22) అనే సూత్రం క్రింద సూరి వివరించాడు.

ఉదా॥ కను + కలి > కనుకలి, విను + కలి > వినుకలి

**11.'కువ' వర్ణకం:**

అడగు మొదలైన ధాతువులకు కువ అనే కృత్ ప్రత్యయం చేరి కొన్ని కృదంతాలు ఏర్పడతాయి.

**1. గ కారాంత ధాతువులు:** అడఁగు + కువ > అడకువ. (గకారలోపం) ఇలాగే కలఁగు + కువ > కలకువ, నలఁగు + కువ > నలకువ, పెనఁగు + కువ > పెనకువ, మెలఁగు + కువ > మెలకువ, లోఁగు + కువ > లోకువ, వేఁగు + కువ > వేకువ మొదలైనవి

**2. చకారంతధాతువులు:** మఱచు + కువ > మఱకువ (చకారంలోపం)

**3. య కారంతధాతువు :** పొలయు + కువ > పొలకువ (యకారంలోపం)

**12.'గడ' వర్ణకం:**

చేరు మొదలైన ధాతువులుకు గడ అనే కృత్ ప్రత్యయం చేరుతుంది.

ఉదా॥ చేరు + గడ > చేరుగడ, తేఱు + గడ > తేఱుగడ, మను + గడ > మనుగడ, వీడు + గడ > వీడుగడ మొదలైనవి

తిరుగు + గడ – (గు వర్ణ లోపం) > తిరుగడ.

**13.'ట' వర్ణకం:**

ఆడు మొదలైన ధాతువులకు ట అనే కృత్ ప్రత్యయం చేరుతుంది. చేరేటప్పుడు ధాతువు చివరి అక్షరం లోపిస్తుంది.

ఆడు + ట > ఆట, ఊరు + ట > ఊట, ఊఱడు + ట > ఊఱట

ఏఁకరు + ట > ఏఁకట, ఓడు + ట > ఓట, తివురు + ట > తివుట, తేరు + ట > తేట, త్రిమ్మరు + ట > త్రిమ్మట, పండు > పంట, పాడు + ట > పాట, మండు + ట > మంట, వండు + ట > వంట, వేసటు + ట > వేసట మొదలైనవి.

ఏదైనా శబ్దాన్ని అనుసరించి ప్రయోగించినప్పుడు ఆట శబ్దం సామాన్యంగా క్లీబసమం అవుతుంది. అలాంటప్పుడు ము వర్ణకాన్ని అలాగే నిలుపుకుంటుంది. కోల + ఆడు > కోలాడు ట ప్రత్యయం చేరి కోలాడు + ట > డు లోపించి > కోలాట అవుతుంది. దీనిపైన ము చేరి కోలాటము అనే రూపం ఏర్పడుతుంది. ఇలాగే పోరాడు + ట > పోరాటము, మంద్రాడు + ట > మంద్రాటము.

**14.'టు' వర్ణకం:**

పడు మొదలైన ధాతువులకు టు అనే కృత్ ప్రత్యయం చేరుతుంది. అలా చేరేటప్పుడు 1.ధాతువులు మొదటి అక్షరాలే మిగులుతాయి. 2. అలా మిగిలిన అక్షరాలు దీర్ఘాలవుతాయి.

ఉదా॥ పడు + టు > పాటు. ఇలాగే చెడు + టు > చేటు, ఏయు + టు > ఏటు, ఓడు + టు > ఓటు, వ్రేయు + టు > వ్రేటు, అడుచు + టు > ఆటు, పొడుచు + టు > పోటు, వయిచు + టు > వాటు మొదలైనవి.

**15.'డు' వర్ణకం:**

ఆఱు మొదలైన ధాతువులకు 'డు' అనే కృత్ ప్రత్యయం చేరుతుంది. (కృ.20)

ఉదా॥ ఆఱు + దు > ఆఱుదు, అమ్ము + దు > అమ్ముదు, అల్లు + దు > అల్లుదు, దిగు + దు

> దిగుడు మొదలైనవి.

త్రోచు + దు > త్రోపుదు, దంచు + దు > దంపుదు, పెంపు + దు > పెంపుదు (చకార లోపం).

మాయు + దు > మాపుదు (యకార లోపం)

**16.'త' వర్ణకం:**

ఆవులించు మొ॥న ధాతువులకు 'త' అనే కృత్ ప్రత్యయం చేరుతుంది. (కృ.10)

ఉదా॥ ఆవులించు + త > ఆవులింత. (చకారలోపం)

ఇగిలించు + త > ఇగిలింత, ఓకిలించు + త > ఓకిలింత కుళ్లగించు + త > కుళ్లగింత, కుసిలించు + త > కుసిలింత, కొక్కిరించు + త > కొక్కరింత, కొప్పరించు + త > కొప్పరింత , గిలిగించు + త > గిలిగింత మొదలైనవి.

**17.'తజ్' వర్ణకం:**

చేయు మొదలైన ధాతువులుకు తజ్ అనే ప్రత్యయం చేరి కొన్ని కృదంత నామాలు ఏర్పడతాయి.(కృ.5) ఇందులో ధాతువులన్నీ యకారాంతాలుగా ఉంటాయి.

జ కారం ఇద్వర్థం కాబట్టి త అనే కృత్ ప్రత్యయం ముందు అరసున్నగానీ, నిండుసున్న గానీ వస్తాయి. (తత్సమ 19)

ఉదా॥ చేయు + తజ్ > చేఁత (యకారంలోపిస్తుంది).

ఇలాగే అలయు + తజ్ > అలత,

కూయు + తజ్ > కూత

కోయు + తజ్ > కోత,

గీయు + తజ్ > గీత,

నేయు + తజ్ > నేత,

పూయు + తజ్ > పూత,

పోయ > తజ్

మూయు + తజ్ > మూత,

మేయు + తజ్ > మేత,

మ్రోయు + తజ్ > మ్రోఁత,

రోయు + తజ్ > రోత,

లాయు + తజ్ > లాత,

వ్రాయు + తజ్ > వ్రాత,

వ్రేయు + తజ్ > వ్రేత మొదలైనవి

**18.'నజి' వర్ణకం:**

అప్ప మొదలైన ధాతువులకు నజి అనే కృత్ ప్రత్యయం చేరుతుంది.(కృ. 12)

జి ఇధ్వర్థం కాబట్టి ధాతువు చివరి ఉత్వం అత్వం అవుతుంది.(క్రి. 20)

ఉదా॥ అప్ప + నజి > అప్పన (జి ఇద్వర్ణం లోపిస్తుంది)

ఇలాగే ఒజ్జ + నజి > ఒజ్జన, ఒప్ప + నజి > ఒప్పన, గట్ట + నజి > గట్టన, గడ + నజి > గడన, దట్ట + నజి > దట్టన, దీవ + నజి > దీవన, పాట + నజి > పాటన, మన్న + నజి > మన్నన.

వీచు + నజి > వీవన (చకారానికి వకారం ఆదేశం)

**19.'ప' వర్ణకం:**

తిరియు మొదలైన ధాతువులకు 'ప' అనే కృత్ ప్రత్యయం చేరుతుంది. (కృ. 10)

ఉదా॥ తిరియు + ప + ము > తిరిపము (యకారలోపం)

ఇలాగే పొలయు + ప + ము > పొలపము, మురియు + ప + ము > మురిపము, సొలయు + ప + ము > సొలపము, వలియు + ప + ము > వలిపము, కలియు + ప > కలి + ప > కలిపము. అత్వంవస్తుందని వివరణ కలప + ము చేరి కలపము

**20.'పు' వర్ణకం:**

మాయు మొదలైన ధాతువులకు 'పు' అనే కృత్ ప్రత్యయం చేరుతుంది.(కృ. 11) ఉదా॥

**1. యకారాంతధాతువులు:** మాయు+పు > మాపు (యకారలోపం) మేయు +పు > మేపు.

**2. చకారాంతధాతువులు :** అడుచు + పు > అడుపు (చకారం లోపిస్తుంది).

ఇలాగే ఇంచు + పు > ఇంపు, ఏచు + పు > ఏచు, తలంచు + పు > తలంపు, తోఁచు + పు > తోఁపు, త్రేఁచు + పు > త్రేఁపు, పూఁచు + పు > పూఁపు, పెనుచు + పు > పెనుపు, పొలుచు + పు > పొలుపు, ప్రోచు + పు > ప్రోపు, మోచు + పు > మోపు, వలయు + పు > వలపు, వాచు + పు > వాపు

మెచ్చు + పు > మెప్పు (చకారం పకారంగా మారటం)

**3. నకారాంతధాతువులు:** కను + పు, > కానుపు (కను ధాతువుకు దీర్ఘము)

**21.'బడి' వర్ణకం:**

'ట' లు మొదలైన వర్ణాలతో అంతమయ్యే ధాతువులకు బడి అనే ప్రత్యయం చేరుతుంది. (కృ. 14)

ఉదా॥ ఏలు + బడి > ఏలుబడి

ఇలాగే కట్టు + బడి > కట్టుబడి, కను + బడి > కనుబడి, కొను + బడి > కొనుబడి.

గిట్టు + బడి > గిట్టుబడి, చెల్లు + బడి > చెల్లుబడి, చేరు + బడి > చేరుబడి, తగులు + బడి > తగులబడి, తీఱు + బడి > తీఱుబడి, పెట్టు + బడి > పెట్టుబడి, మొక్కు + బడి > మొక్కుబడి, వచ్చు + బడి > వచ్చుబడి, సాగు + బడి > సాగుబడి మొదలైనవి.

పోవు + బడి పోబడి. (వు లోపము)

**22.'వడి' వర్ణకం:**

వడి మొదలైనవి ఇలానే గ్రహించాలి. (కృ. 22) అనే సూత్రంలో చిన్నయసూరి వివరించాడు.

ఉదా॥ కొలుచు + వడి > కొలువడి (చకారం లోపం)

ఇలాగే గెలుచు + వడి > గెలువడి, నడుచు + వడి > నడవడి మొదలైనవి.

కలుగు + వడి > మేవడి (వ్యతిరేకార్థంలో 'మే' ఆదేశం)

**23.'వి' వర్ణకం:**

వడి మొదలైనవి ఇలానే గ్రహించాలి. (కృ. 22) అనే సూత్రంలో చిన్నయసూరి వివరించాడు.

ఉదా॥ తనియు + వి > తనివి (యకారలోపం) అలాగే తెలియు +వి > తెలివి, విరియు +వి > విరివి మొదలైనవి.

**24.'వు' వర్ణకం:**

'మను' మొదలైన ధాతవులకు 'వు' అనే కృత్ ప్రత్యయం చేరుతుంది. (కృ. 17)

ఉదా॥ మను + వు > మనువు, కాచు + వు > కావు, కొలుచు +వు కొలువు, చచ్చు + వు చావు పూచు + వు పూవు

ఈ విధంగా బాలవ్యాకర్త కృత్ ప్రత్యయాల్ని వివరించాడు. ఇలాంటివి కవుల ప్రయోగాల్ని అనుసరించి తెలుసుకోవాలని చిన్నయసూరి సూచించాడు. కాని కొన్ని కృద్రూపాలు సరిగా గుర్తించబడలేదు.

దేశాన్ని కోశాన్ని చూచి భాషలో అత్యంత ప్రధానమైన ఇటువంటి శబ్దజాతాన్ని, వాటి స్వరూపాన్ని సంగ్రహించవలసి ఉంటుంది. ఇవి వ్యాకరణ ద్యోతకతచే ఏర్పడినవి.

ఈ కృత్తులు పరమయ్యేటప్పుడు కృద్వృత్తిలో కలిగిన మార్పుల్ని చిన్నయసూరి ఇలా వివరించాడు.

1) క, గ, త, ప, వ, ఇమి మున్నగు కృత్తులు పరమగునపుడు క, గ, చ, య, వ మున్నగు వర్ణములకు లోపము.

ఉదా॥ బ్రదుకు – బ్రదిమి; కలుగు – కలిమి; కూడుచు – కూరిమి; మూయు – మూఁత;

పోవు – పోక.

2) 'ట' వర్ణకము పరమగుచో అంత్యలోపము:

ఉదా॥ ఆడు – ఆట; పాడు – పాట.

3) 'టు' పరమగునపుడు ఆద్యక్షర శేషము, దీర్ఘము:

ఉదా॥ కఱచు – కాటు; పడు – పాటు.

4) 'డు' పరమగునపుడు చ, య, లకు పకారము:

ఉదా॥ త్రోచు – త్రోపుడు; మాయు – మాపుడు.

–0–

## 4.ప్రకీర్ణక పరిచ్ఛేదం

### 5) ప్రకీర్ణ పరిచ్ఛేదంలో పేర్కొన్న ముఖ్యాంశాల్ని వివరించండి.

**1. ఋ ౠ వర్ణంబులు, ర, ల తుల్యంబులు:**

అచ్చులే అయినప్పటికీ పదాదిన ఉన్న ఋ, ౠ వర్ణాలు, వ్యాకరణ కార్య విషయంలో తమ ధర్మాన్ని వీడి ర, ల హల్లుల ధర్మాన్ని చేపడుతున్నాయి.

అతడు + ఋషి :ఉత్తునకచ్చు పరంబగునపుడు సంధియగు, అనే సూత్రం చేత సంధి జరగాలి. కాని సంధి జరుగక 'అతడు ఋషి' – అనే ఉంటుంది.

'ఆ + ఋషి' : సంధి లేని చోట యడాగమం రావాలి. కాని అలా యడాగమం జరుగకుండా 'ఆ ఋషి' అనే ఉంటుంది. ఈ రెండు లక్ష్యాలు అచ్చునకు రావలసిన రెండు కార్యాలు రాకుండటానికి చూపబడ్డాయి.

'వచ్చెను + ఋషి' – అన్నప్పుడు "పదాద్యంబులు ఋ, ౠ వర్ణంబులు ర, ల తుల్యంబులు" – అనే సూత్రం చేత ఋ వర్ణానికి రవర్ణతుల్యత్వం కలుగుతుంది. అప్పుడు 'ద్రుతంబునకు సరళస్థిరంబులు పరంబులగునపుడు లోపసంశ్లేషంబులు విభాషనగు" (బాల.సంధి.18) అనే సూత్రం చేత ద్రుతానికి లోపం రాగా, 'వచ్చె ఋషి' అని, ద్రుతానికి మీది హల్లుతో సంశ్లేషం రాగా 'వచ్చెన్ ఋషి' – అని అవుతుంది. పైకార్యం జరుగని పక్షంలో ద్రుతానికి స్వత్వం కలిగి 'వచ్చెను ఋషి' – అని యథాతథంగానే ఉండిపోతుంది. దానినే సూరివృత్తిలో 'ఇట ద్రుతమునకు లోపసంశ్లేష స్వత్వములు' – అని వివరించాడు.

**2.ఆచ్ఛిక పదాలతో ఉత్తమంగా ఉండే రు, లు, డు ల ముందు ఏత్వం హ్రస్వం కావటం:**

ఆచ్ఛికపదంబులం దుత్తమంబులగు రు లు డు ల ముందఱి యేత్వంబునకు హ్రస్వంబు విభాష నగు. (ప్రకీ-2)

ఆచ్ఛిక పదములందు రు, లు, డు - అను నక్షరము లుత్తమములై యున్నపుడు, వానికి పూర్వమందున్న ఏత్వమునకు హ్రస్వము విభాషగా వస్తుంది.

ఉదా॥ 'నల్లేరు' అన్నది మూడక్షరముల తెలుగు పదము. రు మూడవ యక్షరమై యున్నది. దానికి పూర్వమందున్న ఏవర్ణమునకు హ్రస్వము రాగా 'నల్లెరు' అని యగును. ఈవిధి వైభాషికము. కావున హ్రస్వము రాని పక్షమున 'నల్లేరు' అనియే యుండును.

'ఉత్తమంబులగు' అను విశేషణముచేత పేరు, కేలు, పేడు - మున్నగుచోటి ఏ వర్ణమునకు హ్రస్వము రాదు. విభాషయని యనుటచే సమానపదమునకే యీ సూత్రము వర్తిస్తుంది. సమాసములకు వర్తింపదు. అందువలననే మిన్నేఱు, పెడగేలు, ముప్పేరు, ముయ్యేడు - మున్నగుచోట్ల హ్రస్వము గలుగదు.

**3. ఊయలాదుల విషయం:**

1. తొలి అచ్చుమీది హల్లునకు ద్విత్వం రావటం

ఊయేలాదులం దొలియచ్చుమీఁది హల్లునకు ద్విర్వచనంబొండె నగు. (ప్రకీ-6)

ఊయేల మున్నగువానియొక్క తొలియచ్చు, మీది హల్లునకు ద్విత్వము వికల్పముగా నగునని వస్తుంది.

ఆయె - అన్నది 'అగు' అను ధాతువునకు 'ఎను' పరమైనపుడు యత్వము కలుగగా ఏర్పడిన రూపము. అగు+ఎను = ఆయెను. ఈ సూత్రముచేత యకారము ద్విత్వము నొందగా దీర్ఘమునకు హ్రస్వము కలిగి అయ్యెను అని యగును. 'నోవు' అన్నది క్రియాధాతువుగను, నామముగను కూడ కలదు. రెండు చోట్లను గూడ 'నొవ్వు' అను రూపము కలుగవచ్చును.

'కోపు' అను మాటకు అందము, సంస్కారము, నాట్యమునందలి విధము, సమయము, మద్యము, మిష మున్నగు నర్థములు పెక్కులు గలవు. వీనికి 'కొప్పు' అను రూపము ధనురగ్రము (వింటికొన) యను నర్థమున మాత్రమే కలుగును.

'తేప' యను పదమునకు 'తెప్ప' యను రూపము ప్లవము అను నర్థమున మాత్రమే కలుగును. దానికి 'పర్యాయము' అను నర్థము కూడ కలదు. అప్పుడీకార్యము జరుగదు.

'మోక' అన్నది అంకురము అన్న యర్థమునందు మాత్రమే 'మొక్క' యను రూపము నొందును.

ఎల్లిదము, ఒయ్య, ఒయ్యారము, జజ్జర, తినినయ, తియ్యము, తెమ్మ, తొయ్యలి, దివ్వియ, నువ్వు, నొవ్వి, పువ్వు, మొట్టిక, మొవ్వు, వియ్యము - అన్నవి తక్కిన వానికి రూపములు.

2. ఊయేల, పయ్యెద, తాయెతు అనే శబ్దాలలో తప్ప తక్కిన శబ్దాలలో యాకు ఎ ఏ లతో కూడిక లేదు.

3. ఊయేల, ఊయాల – దీర్ఘాలు వైకల్పికంగా హ్రస్వం కావడం.

**4. అక్కటాదుల జడ్డకు లోపం:**

అక్కట మున్నగు శబ్దములయొక్క జడ్డకు (ద్విత్వమునకు) విభాషగా లోపం వస్తుంది. అక్కటాదులయందు విశేష్యములు, విశేషణములు, సర్వనామములు, అవ్యయములు, క్రియాధాతువులు, క్రియలు గూడ చేరియున్నాయి.

'అక్కట' అన్న శబ్దము యొక్క జడ్డకు లోపం రాగా 'అకట' అని యగును. అటిక, అటుక, అటె – మున్నగు విధముగా తక్కినవానికి రూపములుండును.

విభాష యని యనుటచేత దవ్వు, నవ్వు, నువ్వు, పువ్వు, ముక్కు, మమ్ము, మిమ్ము, తమ్ము – మున్నగు ఉదంతములకు అచ్చు పరమగునపుడు జడ్డకు లోపము కలుగదు. అమ్మ, అక్క మున్నగువానికిని పదాదిస్వరముతో, సంధి యగునెడల జడ్డకు లోపము కలుగదు.

**5. అడంగ్వాదుల డాకు ణ కారం:**

అడఁగు మున్నగువాని డ వర్ణమునకు విభాషగా ణకార వస్తుంది. ఉదా।। అడఁగు **–అణఁగు**

'అడఁగు' అనుచోటి డ వర్ణమునకు ణత్వము కలుగగా 'అణఁగు' అని యగును. కణఁగు, చిల్లాణము, తణగము, మిణుఁగు, వణఁకు, మిణుఁగురు – అన్నవి తక్కిన వానికి రూపములు.

నాఁడెము – నాణెము'

సంస్కృత సమేతరములయిన తెలుఁగు శబ్దములయందుఁ "బరుష సరళంబులకు ముందే బిందువు కానంబడుచున్నది" అని యనుటచేత స్థిర వర్ణమయిన కారమునకు పూర్వమందున్న బిందువు తొలగిపోవలయును. 'పోఁడి' అన్నది యిట్లే 'పోణి' అని యగును.

విభాషయని యనుట చేత కృత్తులు మున్నగునవి పరములగునపుడు సైతం అడంగ్వాదుల డాకు ణత్వము కలుగవచ్చును. అణఁకువ, కణఁక, పోణిమి మున్నగునవి యుదాహరణములు.

**6. జూదాదుల దాకు జకారంబు:**

జూదము మున్నగు శబ్దముల యొక్క దకారమునకు విభాషగా జకారం వస్తుంది.

ఉదా।। జూదము – జూజము అని యగును. అవుద – అవుజు, జవాది – జవాజి, జాది –

జాజి, జాదు – జాజు, విరవాదు – విరవాజి అన్నవి తక్కినవానికి రూపములు.

**7.నిందలో ఆమ్రేడితానికి గి–గీ లు:**

నిందార్థమునందు ఆమ్రేడితము యొక్క ఆద్యక్షరము హ్రస్వమైనచో 'గి', దీర్ఘమైనచో 'గీ' ఆదేశంగా వస్తాయి.

ఉదా।। కుంభకర్ణుఁడు – గింభకర్ణుఁడు

రావణుఁడు – గీవణుఁడు అని యగును.

నిందయందని యనుటచే 'రాముఁడు రాముఁడు' మున్నగువిధముగా ప్రశంసాద్యర్థములందు ఈ కార్యము జరుగదు.

**8.హాదులు, నీలుగు మొదలైన శబ్దాల ఆద్యక్షరలోపం:**

హకారముతో ప్రారంభమగు మాటల యొక్కయు, నీలుగు మొదలగు మాటలయొక్కయు తొలి హల్లునకు బహుళముగా లోపం వస్తుంది.

ఉదా।। హడపము – అడపము

హరిదళము – అరిదళము

హలది – అలది

నీలుగు – ఈలుగు

నెగయు – ఎగయు

పొందు – ఒందు.

పూను, పొదవు అను రెంటికి కూడ అప్పకవి తొలి హల్లు లోపిస్తుందని చెప్పాడు. కాని అది పొరపాటని ఊను, ఒదవు అని రెండు ధాతువులు, పూను, పొదవు అనే రెండు ధాతువులు భిన్నాలని చిన్నయసూరి పేర్కొన్నాడు.

**9.ఓయారాదుల దొలిదీర్ఘం హ్రస్వం కావటం:**

ఓయారము మొదలయిన శబ్దముల తొలి యక్షరము యొక్క దీర్ఘానికి హ్రస్వం వస్తుందని చిన్నయసూరి పేర్కొన్నాడు.

ఉదా।। ఓయారము – ఒయారము

కేళాకూళి – కెళాకూళి

కొలె, గుడారము, గొరువంక, జొహారు, మఱు, ములుగు, మొఱకు, విడియము – ఇవి హ్రస్వం పొందిన రూపాలు.

'నీలుగు' అన్నది ప్రస్తుత సూత్రము చేత 'నిలుగు' అని యగును. 'బేహరము' అను శబ్దముయొక్క తొలి దీర్ఘానికి హ్రస్వం రాదు.

పేఁడ – పెండ అని యగును.

**10.కొన్ని ధ్వనుల మార్పు:**

అ) పద మధ్య హ్రస్వం దీర్ఘం కావటం. (ప్రకీర్ణ –15)

ఉదా॥ ఏతము – ఏతాము

గాలము – గాలాము

గోతము – గోతాము

ఆ) పద మధ్య దీర్ఘం హ్రస్వం కావడం.(ప్రకీర్ణ –11)

ఉదా॥ ఆరాటము – ఆరటము

కొమారుడు – కొమరుడు

కక్కూఱితి – కక్కుఱితి

ఇ) పద మధ్య స్వర లోపం.(ప్రకీర్ణ –16,17,18,19,20)

ఉదా॥ పొలతి – పొల్తి

కలికి – కల్కి

ములికి – ముల్కి

కినుక – కిన్క

అబ్బురము – అబ్రము

అదురుచు – అద్రుచు

ఈ) పదాది డ కారం దకారం కావటం.(ప్రకీర్ణ–14)

ఉదా॥ డక్కు – దక్కు

డాగు – దాగు

డిగు – దిగు ,	డొంగ – దొంగ

**11. ఇతరాలు:**

పద్యపాదంలోని ప్రథమాక్షరాన్ని యతి అంటారని, ద్వితీయాక్షరాన్ని ప్రాస అంటారని ఛందశ్శాస్త్ర సంబంధ విషయాన్ని ప్రస్తావించాడు. లఘువు అలఘువులయిన య వ లకు మైత్రి చెల్లుతుందని, రేఫకు శకటరేఫకు చెల్లదని పేర్కొన్నాడు. యతిమైత్రి విషయంలో లఘువులు అలఘువులు మొదలైన విషయాలను పూర్వకవుల ప్రయోగాలను బట్టి తెలుసుకోమని పేర్కొన్నాడు.

–0–

పాఠం -3

# పారిభాషిక పదాలు

**విషయ సూచిక**

1. ఉపోద్ఘాతం
2. కారక పరిచ్ఛేదం
3. సమాస పరిచ్ఛేదం
4. తద్ధిత పరిచ్ఛేదం
5. కృదంత పరిచ్ఛేదం
6. ప్రకీర్ణక పరిచ్ఛేదం

## 1. ఉపోద్ఘాతం

ఈ పాటం లో కారక, సమాన, తదిత, కృదంతా, ప్రకీర్ణక పరచ్ఛేదాల్లోని పారిభాషిక పదాలు వివరించబడ్డాయి.

## 2. కారక పరిచ్ఛేదం

**1. అధికరణము:**

'అధికరణంబునా నాధారంబు'. అధికరణమంటే ఆధారమని అర్థం. ఈ ఆధారము మూడు విధాలు.

**1. ఔపశ్లేషికము:** 'శ్లేషస్య సమీపం ఉపశ్లేషం, తత్కృతమ్ ఔపశ్లేషికమ్'. శ్లేషమంటే సంబంధం. ఏకదేశ సంబంధాన్ని కలిగియుండేది ఔపశ్లేషికం.

ఉదా॥ ఘటమందు జలమున్నది

ఇక్కడ ఘటం ఆధారం. జలానికి అత్యంత సన్నిహితంగా కూడియున్నది. అందుచేత ఇది ఔపశ్లేషికం.

**2. వైషయికం:** విషయ సంబంధమైనది వైషయికం.

ఉదా॥ మోక్షమందిచ్ఛ గలదు.

ఇక్కడ ఇచ్ఛ విషయం. దీనితో సంబంధం గల ఆధారం మోక్షం. కాబట్టి అది వైషయికాధారం.

**3. అభివ్యాపకము:** అంతటా వ్యాపించి యుండటం అభివ్యాపకం. కర్తగాని, కర్మగాని దేని యొక్క సర్వావయవాలను వ్యాపించి యుంటుందో అది అభివ్యాపకం.

ఉదా॥ అన్నింటి యందు ఈశ్వరుండు గలడు.

ఇక్కడ ఈశ్వరుడు సర్వవ్యాపకుడు. అటువంటి సర్వవ్యాపకునికి ఆధారం 'అన్ని'

ఈ పైన పేర్కొన్న ఔపశ్లేషిక, వైషయిక, అభివ్యాపక అర్థాలలో అందు రావటాన్ని గమనించవచ్చు.

**2. అనభిహితకర్త:**

ఆఖ్యాతాదులచే (క్రియా విభక్తి మొదలయిన వాటిచే) అభిహితము( తెలియజేయబడిన) కాని కర్త. ఇటువంటి కర్తృవాచకం తృతీయలో యుంటుంది. ఇటువంటి అనభిహితకర్తకు ఒకానొకచో షష్ఠి రావచ్చును.( బా.వ్యా. క్రియా-124)

ఉదా॥ రామునిచే మిథిల కనంబడియె

రామునకు మిథిల కనంబడియె

**3. ఆఖ్యాతము:**

ఆఖ్యాతము అంటే క్రియాపదం. 'రాముడు రావణుని సంహరించెను' -అనే ఈ వాక్యంలో 'సంహరించెను' అనేది క్రియ. ఆఖ్యాతం. ఈ క్రియాపదం వలన కలిగే ఆక్షాంక్షనుబట్టి 'ఎవరు'- అని ప్రశ్నిస్తే 'రాముడు' -అనే సమాధానం వస్తుంది. ఈ వాక్యంలో ఆఖ్యాతం 'సంహరింపబడియె'.

**4. ఆఖ్యాత:**

'ఆఖ్యాత' - అంటే విద్యను బోధించేవాడు గురువు. బోధకుడు. 'ఉపయోగంబునందాఖ్యాతకు తోడవర్ణకంబగు' - అనే సూత్రంలో ఈ పదం వాడబడింది. ఉదా॥ రామకృష్ణులు సాందీపని తోడఁ జదివిరి'

ఇందులో 'సాందీపని'- ఆఖ్యాత

**5. అచ్చికము:**

'అచ్చ' - అచ్చ తెనుగు పదాలతో ఏర్పడేది అచ్చికము.

ఉదా॥ తేని యానతి : తేని యొక్క ఆనతి ఈ రెండు పదాలు అచ్చికాలె. చెఱువు నీరు చెఱువు, నీరు అనేవి రెండూ అచ్చికాలే. సిరి చెలువుఁడు, సిరి, చెలువుఁడు అనే రెండు పదాలు అచ్చికాలే. అందువల్ల తేని యానతి, చెఱువు నీరు, సిరి చెలువుఁడు - అనేవి అచ్చిక సమాసాలు.

**6. ఉత్సర్గము:**

ఉత్సర్గము అంటే సామాన్యవిధి. సార్వత్రిక సూత్రమని చెప్పవచ్చు . వ్యాకరణంలో విశేషసూత్రాలు

సామాన్య సూత్రాన్ని బాధించి ప్రవర్తిస్తుంటాయి.

ఉదా॥ తద్ధిత పరిచ్ఛేదంలో 'తనము' భావంలో(త్వార్థము)లో విధించబడింది. ఇది సామాన్య నియమం. దీనిని బాధిస్తూ చిన్నాదులకు 'ఱికము' – విధించబడింది. తన విధించబడిన తరువాత 'ఱికము' వర్ణకము రాకూడదు. దానినే సూచిస్తూ ' ఇట విశేషంబుత్సర్గంబునకు విభాషను బాధకంబగు'– అని సూరి సూచించాడు.

అంటే చిన్నాదులకు ఱికము, తనము రెండూ విభాషగా చేరతాయని తాత్పర్యం.

**7. ఆనంతర్యార్థము:**

ఆనంతర్యం అనగా అనంతరానికి సంబంధించిన అర్థం కలదని అర్థం. అంతరం లేనిది అనంతరం. అనంతరత్వమే ఆనంతర్యం. ఈ అర్థంలో ద్రుతాంతమగు దువర్ణకము చేరుతుంది. (క్రియా. 42)

ఉదా॥'జాబిలితోఁ తెంచుదుం గువలయంబులు వికసిల్లె'

ఇందు తొలిక్రియ – తోఁతెంచుట, మలిక్రియ – వికసిల్లుట

ఈ రెండు క్రియలకు ఏ మాత్రము అంతరము లేదు. వెంట వెంటనే జరుగుటయే అనంతర్యార్థములోని ఆంతర్యము. దీనిని గుర్తింపఁజాలక కొందఱిది అనావశ్యకమని భావించిరి. 'పిమ్మట, పిదప, తరువాత' అను సాధారణార్థబోధకమని భ్రాంతి పడిరికాని యిట్టి యర్థమునకాక, 'జాబిలుతోఁతెంచుట', 'కువలయంబులు వికసిల్లుట' అను రెండు కార్యములు అసంలక్ష్యక్రమములన్నమాట. అనగా వాని పౌర్వాపర్యమును గుర్తుపట్టఁజాలమని భావము. అట్టి యెడలనే 'దున్' వర్ణకము కల్గునని చిన్నయసూరి నిర్దేశము.

**8. ఉపధ:**

ఉపధ అంటే తుది వర్ణానికి ముందున్న వర్ణం 'అలోంత్యా త్పూర్వ ఉపధా' అని అష్టాధ్యాయి (1–1–64) ఉపధయనగా దుది వర్ణమునకు ముందు వర్ణము. అని చిన్నయసూరి నిర్వచనం. ఉదా॥ అర్చి – ఆర్ చ్ ఇ – పై ఉదాహరణలో చివరి వర్ణం 'ఇ' దానికి ముందరి వర్ణం 'చ్' దీనిని 'ఉపధ' అంటారు. అలాగే రాజి – 'ర్ + ఆ + జ్ + ఇ పై ఉదాహరణలో జకారం ఉపధ. జకారం తాలవ్యం. రాజి + లు = రాజులు. పై ఉదాహరణల్లో తాలవ్య చజలు దంత్య చజలు (చ జ)గా మారాయి.

**9. ఉపయోగము:**

నియమ పూర్వక విద్యా స్వీకారము 'ఉపయోగము' అని పిలువబడుతుంది. 'నియమపూర్వక

విద్యాస్వీకారం బుపయోగంబనంబడు' అని చిన్నయసూరి నిర్వచనం. ఉదా॥ రామకృష్ణులు సాందీపని తోడ వేదంబులం జదివిరి'. వేదములు చదవడం' నియమ పూర్వకమైన విద్యాస్వీకారం. ఉపాధ్యాయుడు ఉచ్చరించిన దానిని శిష్యుడు అలాగే ఉచ్చరిస్తూ విద్యను గ్రహించడం 'ఉపయోగం' అనే పరిభాషతో పిలువబడుతుంది. రామకృష్ణులు శిష్యులు, సాందీపమహాముని గురువు. గురువు స్వరప్రధానమైన వేదం. దాని ఉచ్చరిస్తూ ఉంటే శిష్యులు అలాగే ఉచ్చరిస్తూ నియమపూర్వకంగా విద్యను స్వీకరించారు. ఈ సందర్భంలో అఖ్యాత (గురువు)ను తెలిపే ప్రాతిపాదికకు 'తోడ' అనే ప్రత్యయం చేరుతుంది. ఉదా॥ సాందీపుని తోడ.

**10. కరణము:**

క్రియా సిద్ధికి మిక్కిలిగా ఉపకరించేది కరణం. క్రియ నెరవేరడానికి పనికి వచ్చే సాధనాల్లో ఏ సాధనం ఆ క్రియను నేరవేరుస్తుందో దానిని 'కరణం' అంటారు. ఉదా॥ 'ఖడ్గంబు చేత ఖండించే', ఖండించడం అనే క్రియ సిద్ధించింది ఖడ్గం వల్లనే. ఖండిచడానికి చేయి కూడా ఉపకరించినప్పటికీ, మిక్కిలిగా ఉపకరించింది 'ఖడ్గం' మాత్రమే. అందువల్ల ఇది కరణం. కరణార్థంలో ప్రాతిపదికకు చేత, తోడ ప్రత్యయాలు చేరతాయి. ఉదా॥ ఖడ్గముచేత ఖండించె; కోల తోడ కూలనేసె. 'క్రియా సిద్ధిం బ్రకృష్టోప కారకంబు కరణంబు' అని చిన్నయసూరి నిర్వచనం.

**11. కర్త:**

ధాతువుకు రెండర్థాలున్నాయి. 1. ఫలం 2. వ్యాపారం. ధాత్వర్థ వ్యాపారాన్ని ఆశ్రయించేది కర్త. అంటే వ్యాపారాన్ని (క్రియను) నిర్వహించినవాడు కర్త. ఉదా॥ 'దేవదత్తుని చేత వంటకము వండబడియె' వంటచేయడం అనేది ధాత్వర్థమైన వ్యాపారం. దానికి ఆశ్రయమైనవాడు, ఆ వ్యాపారాన్ని నిర్వర్తించినవాడు దేవదత్తుడు కర్త. సాధారణంగా కర్తను తెలిపే ప్రాతిపదికకు ప్రథమా విభక్తి ప్రత్యయాలు చేరతాయి. ఉదా॥ రాముడు రావణుని సంహరించెను. అనభిహిత కర్త అయినపుడు కర్తను తెలిపే ప్రాతిపదికకు 'చేత' అనే ప్రత్యయం చేరుతుంది. రాముని చేత రావణుడు సంహరింపబడెను, 'ధాత్వర్థవ్యాపారాశ్రయంబు కర్తనాబడు' అని చిన్నయసూరి నిర్వచనం.

**12. కర్మ(కర్మము):**

ధాతువుకు రెండర్థాలున్నాయి. 1. ఫలం, 2. వ్యాపారం. ధాత్వర్థ ఫలాశ్రయం 'కర్మము' అనబడుతుంది. ఫలాన్ని ఆశ్రయించేది 'కర్మము'.

ఉదా: దేవదత్తుడు వంటకమును వండెను, 'వండుట' అనే క్రియవల్ల సిద్ధించిన ఫలం 'వంటకము'. కర్మము.

ఉదా॥ దేవదత్తుడు వంటకమును వండెను, 'వండుట' అనే క్రియవల్ల సిద్ధించిన ఫలం 'వంటకము'. కర్మార్థంలో, ప్రాతిపదికకు ద్వితీయా విభక్తి ప్రత్యయం చేరుతుంది. 'ధాత్వర్థఫలాశ్రయంబు కర్మము నాబడు' అని చిన్నయసూరి నిర్వచనం.

### 13. కృత్తు/ కృదంతము:

ధాతువుకు చేరే, 'డుజ్' ఇతర ప్రత్యయాల్ని 'కృత్తులు' అంటారు. డుఙ్ = డుజ్, రు: వు,రు: ము అనేవి క్రియాప్రత్యయాలు వీటికన్నవేరుగా ఉండి, ధాతువుకు చేరే ఇతర ప్రత్యయాల్ని కృత్తులు అంటారు.

ఉదా॥ 'మొలచు' ధాతువు 'క' కృత్ ప్రత్యయం మొలచు + క = మొలక – కృదంతం.

'అలుగు' ధాతువు – 'క' కృత్ ప్రత్యయం – 'అలుక' కృదంతం.

'కలుగు' ధాతువు – 'ఇమి' కృత్ ప్రత్యమం – 'కలిమి' కృదంతం.

'చేయు' ధాతువు – 'తజ్' కృత్ ప్రత్యయం – 'చేత' కృదంతం.

'ధాతువునకు విహితంబగు డుజ్భిన్న ప్రత్యయంబు కృత్తున్నాడు' అని చిన్నయసూరి నిర్వచనం.

### 14. క్త్వార్థము:

సమాన ఆశ్రయాలైన క్రియలలో ముందు జరిగిన క్రియను తెలిపే ధాతువుకు 'ఇ' అనే ప్రత్యయం చేరుతుంది. దీనినే 'క్త్వార్థం–క్త్వార్థకం' అంటారు. సంస్కృతంలో 'క్త్వా' అనే ప్రత్యయార్థంలో తెలుగులో 'ఇ' అనే ప్రత్యయం చేరుతుంది. దీనినే భూతకాలిక అసమాపకార్థాన్ని తెలిపే ప్రత్యయం అని కూడా అంటారు.

### 15. చేదర్థము:

ఈ అర్థమునందు ద్రుతాంతమగు నవర్ణకము వచ్చును. వానలు కురిసినం బంటలు పండును. (క్రియా. 41)

చేత్ = అయినచో, వానలు కురిసినచో పంటలు పండునని యర్థము. వానలు కురవనిచో పంటలు పండవు అని చెప్పినట్లే.

వృత్తమగు భావలక్షణమందును, చేదర్థమునందును 'నన్' ప్రత్యయము పరమగుపట్ల సూరి

'చేదాద్యర్థకమ'ని పేర్కొనెను. శతృతుమానంతర్య చేదాద్యర్థకంబులు. "ఇట్లే" చేదాద్యర్థ కాంతంబయిన యుండునకున్నాదేశంబు విభాషనగు" (క్రియా. 57)

**16. తచ్ఛీలము:**

దాని యొక్క స్వభావమని అర్థం. తద్ధర్మాదులలో ఇది ఒకటి. ఈ అర్థంలో తద్ధర్మాద్యర్థక క్రియ ఉపయోగించబడుతుంది.

ఉదా॥ జ్వలన జ్వాలములుప్పరంబెగయు.

**17. తద్ధితము:**

సుబంతాలకు భావార్థం మొదలైన వాటిల్లో చేరే ప్రత్యయాల్ని తద్ధిత ప్రత్యయాలు అంటారు. సుబంతాలంటే నామ విభక్తి ప్రత్యయాలు అంతంలో ఉండే శబ్దాలు. తద్ధితాలు చేరే ఏర్పడే నామవాచకాలని 'తద్ధితాంతాలు' అంటారు. ఉదా॥ రాముడు సుబంతము. భావార్థములో 'తన' అనే తద్ధిత ప్రత్యయం చేరుతుంది. 'రాముని తనము' అనే తద్ధితాంతం ఏర్పడుతుంది.

చిన్నఱికము, పేరమి, నల్లన, అగ్గలిక, చిఱుతుక, ఆటకాడు, ఆటకత్తియ మొదలైనవి తద్ధితాంతాలు. పై ఉదాహరణల్లో ఱిక, ఇమి, న, ఇక, ఉక, కాడు, కత్తియ అనేవి తద్ధిత ప్రత్యయాలు.

**18. తుమర్థము:**

ఏ క్రియ కోసం మరో క్రియ జరుగుతుందో ఆ క్రియ తుమర్థం. ఈ సందర్భంలో ధాతువునకు 'నుజీ' చేరుతుంది. సంస్కృతంలో ఈ సందర్భంలో తుమ్ అనే ప్రత్యయం చేరుతుంది. ఉదా॥ గంతుమ్, హర్తుమ్ మొదలైనవి. తుమ్ అనే ప్రత్యయ అర్థంలో తెలుగులో నుజీ చేరుతుంది – కాబట్టి దీనికి తుమర్థం అనే పేరు వచ్చింది. నుజీ అని చెప్పినదాని వలన ధాతువులోని చివరి ఉత్వానికి అత్వం అవుతుంది. ఉదా॥ వందు ధాతువు, తుమర్థంలో వందు + నుజీ = వండను. ఇది తుమర్థ రూపం.

ఉదా॥ చైత్రుండు వండను పోయెను; ఈ ఉదాహరణలో వండడం కోసం పోయాడు అని అర్థం. వండుట అనే క్రియ కోసం పోవుట అనే మరో క్రియ జరిగింది. కాబట్టి వందు అనే ధాతువుకు తుమర్థంలో నుజీ చేరింది.

**19. త్రర్థము:**

త్రర్థము అంటే తృవర్ణకార్థం. కర్త్రర్థకం. ఈ అర్థంలో 'కలుగు'నకు కలాదేశం విభాషగా వస్తుందని సూరి (బా.వ్యా.క్రియా–105) పేర్కొన్నాడు.

ఉదా॥ కలవాఁడు, కలాఁడు.

**20. త్రికము:**

ఆ ఈ ఏ అనే సర్వనామాలను త్రికం అంటారు. ఇది సూరి స్వంతంగా కల్పించిన సంజ్ఞ. కర్మదారయంలో పూర్వం పదం త్రికంగా ఉండవచ్చు. ఉదా॥ ఆ చందము, ఈ చిందము, ఏ బృందము.

త్రికము మీద జరిగే సంధి కార్యాల్ని త్రికసంధి అంటారు. ఉదా॥ ఆ + కన్య = అక్కన్య. ఈ + కాలము = ఇక్కాలము. ఏ + లోకము = ఎల్లోకము. సంధి జరగని రూపాలు ఎలాగూ ఉంటాయి. ఆకన్య. ఈ కాలము, ఏ లాలోకము. త్రికసంధి బహుళం కాబట్టి ఊష్మం వచ్చినా, రేఫం వచ్చినా సంధి జరగదు – అంటే ద్విత్వం రాదు. పూర్వాచ్చు హ్రస్వం కాదు. ఉదా॥ ఆ రూపము, ఈ శబ్దము, ఏ షండము, ఆ సుకృతి – ఆ హయము మొదలైనవి.

**21. తృవర్ణకార్థం:**

తృవర్ణకము యొక్క అర్థమునందు ధాతువునకు – ఎడి, – ఎడు అను ప్రత్యయము లగును.

సంస్కృతమునందు కర్త్రర్థమున 'తృ' అను ప్రత్యయము విధింపబడును.

'కర్తృ' అనే రూపంలో కర్–తృ– అను రెండు భాగాలున్నాయి. అందులో రెండవదయిన 'తృ' ప్రత్యయము సంస్కృతములో ఏ అర్థంలో వస్తుందో ఆ అర్థంలో వచ్చే ప్రత్యయానికి 'తృవర్ణకార్థమని సంకేతం.'

'ప్రహరించు' అను ధాతువునకు 'ఎడి' అను ప్రత్యయము రాగా 'ప్రహరించెడి' అని యగును. అట్లే 'ఎడు' అను ప్రత్యయము రాగా 'ప్రహరించెడు' అని యగును. ఇక్కడ కీ రూపములు సమగ్రములు కావు. ఇది కర్త్రర్థమునం దగుటచే 'వాఁడు' అను శబ్దము పరమందు కలుగగా ప్రహరించెడివాఁడు – ప్రహరించెడువాఁడు' అని యగును. సంస్కృతమునందలి 'ప్రహర్త' యను పదమునకున్న యర్థమే వీనికి కూడ నుండును.

**22. త్వార్థము:**

'త్వ" అనే సంస్కృత ప్రత్యయం యొక్క అర్థంలో తెలుగులో 'తన' అనే ప్రత్యయం చేరుతుంది. సంస్కృతంలో 'త్వ' అనే ప్రత్యయం భావార్థంలో చేరుతుంది. ప్రాతిపదిక వల్ల కలిగే అర్థం, భావంలో విశేషణంగా తోచేది భావం. ఉదా॥ 'రామ' ప్రకృతి. దీనిలో విశేషణంగా తోచేది రామత్వం అనే ధర్మం. భావార్థంలో సంస్కృతంలో త్వ అనే ప్రత్యయం చేరుతుంది. ఉదా॥ రామ + త్వ రామత్వం. తెలుగులో ఈ సందర్భంలో తన అనే ప్రత్యయం చేరి రామునితనం అని ఏర్పడుతుంది.

తెలుగులో త్వార్థంలో 'తిక' అనే ప్రత్యయం 'ఇమి' అనే ప్రత్యయం. న అనే ప్రత్యయం, ఇక అనే ప్రత్యయం, కార అనే ప్రత్యయం పు అనే ప్రత్యయం చేరుతుంటాయి. ఉదా॥ చిన్నతికము, పేరిమి, నల్లన, అగ్గలిక, చెలికారము, తెలుపు మొదలైనవి.

త్వార్థంబనగా భావంబు. 'ప్రకృతి జన్య బోధంబునందు ప్రకారంబు భావంబు', అని చిన్నయసూరి నిర్వచనాలు.

**23. దఘ్నార్థము:**

'దఘ్నార్థం'లో నామాలకు బంటి, కొలఁది అనే తద్ధిత ప్రత్యయాలు చేరతాయి. సంస్కృతంలో 'దఘ్నచ్' అనే ప్రత్యయం 'లోతు'ను తెలుపుతుంది. ఉదా॥ కంఠదఘ్నము అంటే కంఠంలోతని అర్థం. ఈ అర్థంలో తెలుగులో 'బంటి', 'కొలఁది' అనే ప్రత్యయాలు వస్తాయి. ఉదా॥ మోఁకాలిబంటి, మోకాలికొలది. ఇలాగే తొమ్మబంటి, తొమ్మకొలఁది.

**24. ద్వంద్వసమాసం :**

సమాసంలోని ఉభయపదాల అర్థం ప్రాధాన్యంగలది 'ద్వంద్వ సమాసం'. అంటే – సమాసంలో ఉండే అన్ని పదాల అర్థమూ సమప్రాధాన్యం కలిగి ఉంటాయి. ద్వంద్వ సమాసాలు సాధారణంగా బహువచనంలోనే ఉంటాయి.

ఉదా॥ తల్లిదండ్రులు : 'తల్లి' అనే పదానికి, 'తండ్రి' అనే పదానికి సమాసంలో సమ ప్రాధాన్యం ఉంది. ఇలాగే అన్నదమ్ములు, ఊరు పల్లెలు మొదలైనవి ద్వంద్వసమాసాలు.

**25. ద్విగుసమాసం :**

కర్మధారయ సమాసంలో పూర్వపదం సంఖ్యను తెలిపితే అది ద్విగు సమాసం అవుతుంది.

ఉదా॥ ముజ్జగములు, మూఁడు లోకములు.

వీటిలో 'మూఁడు' అనే పూర్వపదాలు సంఖ్యను తెలుపుతున్నాయి.

జగములు, లోకములు అనే పదాలతో కలిసి ద్విగు సమాసాలు ఏర్పడ్డాయి.

**26. ధాతుజ విశేషణము:**

ధాతువుల నుండి పుట్టిన విశేషణాలు ధాతుజ విశేషణాలు. ధాతుజ విశేషణాలనే క్రియాజన్య విశేషణాలని కూడా అంటారు. ఇవి ఏడు రకాలు.

1,2,3. తద్ధర్మ ధాతుజ విశేషణాలు: 'ఎడి' వర్ణకాంతం ='వండెడి', 'ఎడు' వర్ణకాంతం = వండెడు; ఎడి, ఎదులు లోపించిన రూపం =వండు.

4. వర్తమాన ధాతుజ విశేషణం: ఉన్న వర్ణకాంతం ఉదా॥ వండుచున్న

5. భవిష్యత్ ధాతుజ విశేషణం: కలజీ వర్ణకాంతం. ఉదా॥ వండగల

6. భూతకాలిక ధాతుజ విశేషణం: న వర్ణకాంతం. ఉదా॥ వండిన

7. వ్యతిరేకార్థక ధాతుజ విశేషణం: నిజీ వర్ణకాంతం. జీ అని చెప్పినందువల్ల ధాతువు చివరి ఉత్వం అత్వం అవుతుంది. ఉదా॥ వండని

కర్మధారయ సమాసాలలో ధాతుజ విశేషణాలు పూర్వపదాలుగా ఉంటాయి. ఉదా॥ వండెడువాడు, వండెడివాడు, వండువాడు, వండుచున్నవాడు, వండగలవాడు, వండినవాడు,

'ఎడి ప్రభృతి వర్ణకాంతంబు, లేదును ధాతుజ విశేషణంబులని' ప్రాచీనులు వ్యవహరింతురు అని చిన్నయ సూరి నిర్వచనం.

**27. నామము:**

నామం అంటే ప్రాతిపదిక. దీనినే ప్రకృతి అని కూడా అంటారు. వ్యక్తిని గాని, వస్తువునుగాని, భావాన్నిగాని తెలిపేది నామం.

నామం నాలుగు రకాలుగా ఉంటుంది. 1. సంజ్ఞానామం : ఉదా॥ అమ్మ, అన్న కొండ మొదలైనవి. వీటినే సామాన్య నామాలని కూడా అంటారు.

2. కృదంతనామాలు: ధాతువు మీద కృత్ ప్రత్యయం చేరి ఏర్పడే నామాలు ఉదా॥ 'రమ్' సంస్కృత ధాతువు. దాని నుంచి ఏర్పడిన కృదంతనామం రామ. తెలుగులో ఏలు + ఇక =ఏలిక. ఆడు + ట = ఆట మొదలయినవి కృదంతనామాలు.

3. తద్ధితాంత నామం: సుబంతాలు మీద తద్ధిత ప్రత్యయాలు చేరి ఏర్పడే నామం. 'భృగు' సంస్కృత నామం 'భృగువు కొడుకు' అనే అర్థంలో ఏర్పడే భార్గవ శబ్దం తద్ధితాంత నామం.

4. సమాసనామం : ప్రసిద్ధార్థాలుండే రెండు పదాలు కలిసి ఏకార్థంలో, ఏకపదంగా ఏర్పడేది సమాసం. ఉదా॥ రాజు కొడుకు: రాజు, కొడుకు ప్రసిద్ధార్థాలుండే రెండు పదాలు. రాజు యొక్క పుత్రుడు అనే అర్థంలో ఇవి రెండూ చేరి ఏకార్థంలో రాజుకొడుకు అనే షష్ఠీ తత్పురుష సమాసం ఏర్పడుతున్నది. 'నామంబనగా బ్రాతిపదికము' అని చిన్నయసూరి నిర్వచనం. సంస్కృతంలో 'సమాసానికి ఉదా॥ రాజ పురుషః

**28. నిర్ధారణము:**

'జాతి గుణక్రియా సంజ్ఞల చేత సముదాయంబు నుండి యేకదేశంబునకుం బృథక్కరణంబు నిర్ధారణంబగు" –అని సూరి వివరించాడు. సముదాయము అంటే సమూహమని అర్థం. ఏకదేశము అంటే ఒక్కటి అని అర్థం. పృథక్కరణము అంటే వేరుచేయటం. ఒకే సముదాయానికి చెందిన అనేకమైనవాటిలోనుండి ఒక దానిని వేరు చేసి నిరూపించటం నిర్ధారణం. అలా నిర్ధారణ చేసే సందర్భంలో సముదాయవాచకానికి 'లోపల' అనే ప్రత్యయం వస్తుంది.

ఉదా॥ మనుష్యులలోపల క్షత్రియుండు శూరుండు.

ఇందులో నిర్ధారణ చేయబడినవాడు క్షత్రియుడు. మనుష్యులు సమూహవాచకం.

## 29. ప్రాతిపదిక:

"నియతోపస్థితికము ప్రాతిపదికార్థము". నియతమైన ఉపస్థితికము– అంటే నియతమైన స్ఫురణ కలది. ఒక పదానికున్న అన్ని అర్థాలు అంటే లింగము, వచనము, విభక్తి, జాతి, వ్యక్తి మొదలైన వాటిని ప్రాతిపదికయే బోధిస్తుంది. 'రాముడు' – అనే శబ్దంలోని ప్రాతిపదికయే దశరథుని పెద్దకొడుకని, పుంలింగమని, ఏకవచనమని, రామాయణ కథానాయకుడని తెలుపుతుంది. ఇది వాక్యంలోని పదంగా గాక విడిగా వాడబడినది కాబట్టి దీని వ్యాప్తి ఇంతవరకే నియతమవుతున్నది. ఇలా ఇతర పదాల అపేక్ష లేకుండా వాడేటప్పుడు ప్రాతిపదికార్థంలో ప్రకృతికి ప్రథమా విభక్తి చేరుతుంది.

## 30. ప్రేరణార్థకం:

ప్రేరకుడు కర్తగా గలది ప్రేరణార్థకం. అన్నంత క్రియకు 'చేయు' – అనే సహాయక్రియను చేరిస్తే అది ప్రేరణార్థకమవుతుంది.

ఉదా॥ చొక్కుచు, చొక్కచేయుచు

చిన్నయసూరి అన్ని ధాతువులకు ప్రేరణార్థంలో 'ఇంచుక్' ఆగమంగా వస్తుందని చెప్పాడు.

ఉదా॥ పంపించు, ఆవులించు, నుతించు.

## 31. బహువ్రీహి సమాసం:

అన్యపదార్థ ప్రాధాన్యంగలది బహువ్రీహి సమాసం. అంటే సమాసంలో ఉన్న పదాలయొక్క అర్థంకాకుండ ఈ రెండు పదాల సమిష్టి అర్థంతో వేరే అర్థం స్ఫురిస్తే అది 'బహువ్రీహి' సమాసం అవుతుంది. ఈ సమాసాలలో సాధారణంగా విగ్రహ వాక్యంలో కలవాఁడు, కలది అనే పదాలు వస్తుంటాయి.

ఉదా॥ ముక్కంటి : మూఁడు, కన్నులు అనే రెండు పదాలు చేరి మూఁడు కన్నులు గలవాడు, శివుడు అనే అన్యపదార్థం ప్రాధాన్యం కలుగుతోంది. అందువల్ల ఇది బహువ్రీహి సమాసం అయింది.

అలాగే చలివెలుగు – చల్లని వెలుగు కలవాడు (చంద్రుఁడు)

వేవెలుగు – వేయి వెలుగులు కలవాఁడు (సూర్యుఁడు)

**33. భావ లక్షణము :**

'భావ లక్షణం' అంటే మరో క్రియకు లక్షణ భూతం అయిన క్రియ. అంటే మరో క్రియకు ఏది లక్షితం అవుతుందో ఆ క్రియ భావ లక్షణం. చైత్రుండు వండన తిథి వచ్చెను. వంట – లక్షణం, వచ్చుట – లక్ష్యం, 'వండుట' అనే క్రియ 'వచ్చుట' అనే క్రియ ఎప్పుడు జరిగిందో సూచిస్తున్నది. కాబట్టి 'వండుట' అనేది భావలక్షణం. 'వండు' ధాతువు క్రి.40 'వండు' + నుజి క్రి.20 వండను. 'భావ లక్షణంబునా నన్యక్రియకు లక్షణభూతంబగు క్రియ అని చిన్నయసూరి నిర్వచనం.

**34. భావార్థకం:**

భావము అంటే ధాతువు యొక్క అర్థం. 'టవర్ణకంబు భావంబునందగు'(క్రియా–35) –అన్న సూత్రాన్ని బట్టి టవర్ణకాన్ని చేరిస్తే భావార్థక రూపం ఏర్పడుతుంది.

ఉదా॥ వండుట, వచ్చుట.

సంప్రదాన, అపాదాన, అధికరణాదుల కంటే భిన్నమైన స్వస్వామి భావం. జన్యజనక భావము మొ॥న సంబధాలు శేష పదానికి అర్థం. అటువంటి సంబంధ రూపార్థంలో షష్ఠీవిభక్తి ప్రయోగించబడుతుంది.

ఉదా॥ రామునికి సంబంధించిన గుణాలు రాముని యొక్క గుణాలు(యొక్క)

నాకు సంబంధించిన మిత్రుడు నా మిత్త్రుడు, నాకు మిత్త్రుడు(కు)

ఇలా సంబంధార్థంలో కు, యొక్క ప్రత్యయాలు వస్తాయని చిన్నయసూరి పేర్కొన్నాడు.

**35. భావి:**

భవిష్యత్కాలమని అర్థం. భావి యనగా నప్పటికిఁ బుట్టకుండునది. ఇక మీఁదఁ బుట్టఁ బోవునది.

సూరి 'భావినా విద్యమాన ప్రాగభావ ప్రతియోగి'– అని చెప్పాడు.

ప్రాక్ + అభావము= వస్తువు పుట్టుక ముందుండే అభావం. అటువంటి ప్రాగభావానికి విరోధి భావి.

ఉదా॥ ఘటము కాగలదు.

**36. భూతము:**

'భూతంబునా విద్యమాన ధ్వంసప్రతియోగి'– అని సూరి నిర్వచనం. ముందుండి అప్పటికి లేకుండునది. ధ్వంసము = అభావము, ప్రతియోగి = విరోధి. అప్పటికి లేనిదానికి విరోధ అంటే పూర్వమందు ఉన్నదని తాత్పర్యం. ఉదా॥ ఘటముండెను.

భూతక్రియావృత్తి యగు ధాతువునకు 'లిట్' ను విధించాడు.

**37. మతుబర్థము:**

సంస్కృతంలో 'మతుప్' ప్రత్యయం అంతంలో ఉండే శబ్దాలు 'శ్రీమంతమ్', గుణవంతమ్' మొదలగునవి. తెలుగులో ఈ అర్థంలో 'కలది, కలవాడు'– వాడుతాము. కలవాడు అనే అర్థాన్నిచ్చే తద్ధిత ప్రత్యయాలు –కాడు, కత్తియ, అరి, ఆడు మొదలగునవి. ఈ 'మతుప్' ప్రత్యయార్థాన్నిచ్చే ప్రత్యయాలు అంతంలో ఉంటే దానిని మతుబంతాలు అని అంటారు.

**38. మానార్థము:**

మానార్థం (కొలతను తెలిపేది)లో ఏకవచనంలో 'ఎండు' అనే తద్ధిత ప్రత్యయం నామానికి చేరుతుంది.

ఉదా॥ తూము + ఎండు > తూమెండు

ముంత + ఎండు > ముంతెండు;

ఎత్తు + ఎండు > ఎత్తెండు;

వీసె + ఎండు > వీసెండు;

జేన + ఎండు > జేనెండు;

మూర + ఎండు > మూరెండు;

కుండ + ఎండు > కుండెండు;

గంప + ఎండు > గంపెండు మొదలైనవి.

**39. మిశ్ర సమాసం:**

సంస్కృత సమం, అచ్ఛికం రెండూ కలిసి ఏర్పడి సమాసాలు మిశ్ర సమాసాలు.

ఉదా॥ రాజుముదల: 'రాజు' సంస్కృత సమం. 'ముదల' –అచ్ఛికం. రెండూ కలిసి 'రాజుముదల' అనే మిశ్ర సమాసం ఏర్పడింది.

చెఱువు నుదకము : చెఱువు, అచ్ఛికం, ఉదకము సంస్కృత సమం. రెండూ కలిసి 'చెఱువునుదకము' అనే మిశ్ర సమాసం ఏర్పడింది.

సిరి వల్లభుండు : సిరి – అచ్ఛికం, వల్లభుఁడు – సంస్కృతసమం రెండూకలిసి 'సిరివల్లభుఁడు అనే మిశ్ర సమాసం ఏర్పడింది.

**40. ముత్తు:**

ముజ్ + జీత్తులు కలిసి మజీ్జత్తులు అవుతాయి. వీటినే 'ముత్తు' అని చెపుతూ 'ముజీ్జత్తులు ముత్తునాఁబడు'– అని ప్రత్యాహారపద్ధతిలో చిన్నయసూరి సంకేతించి చెప్పాడు.

మధ్యమ ముడుజ్జులు = ముజ్జు

ముజ్జు + జీత్తులు = ముత్తు

జీత్తులు: 3. లజి : వ్యతిరేకార్థము

4. మిజి : వ్యతిరేక భావార్థకము

5. కజి : వ్యతిరేక

6. నుజి : తుమన్నర్థకము

7. కలజి: భవిష్యదర్థకము

8. నిజి : వ్యతిరేక తృవర్ణకార్థకము

9. పడుజి : కర్మార్థకము

10. కుజి : వ్యతిరేకంలో ముజ్జుపరమైనప్పుడు వచ్చేది.

ఇలా మొత్తం 12 సంజ్ఞలీ సంక్షిప్త సంజ్ఞలో ఉన్నాయి.

41. **వర్తమానం:**

'వర్తమానంబునాఁ బ్రారబ్ధా పరిసమాప్తంబు. అప్పటికి ముగియకుందునది' – అని సూరి వివరణ.

వర్తమానమంటే అప్పటికి ముగిసిపోకుండ కొనసాగుతున్నదని అర్థం.

ఉదా॥ చదువుతున్నాడు

ఈ అర్థంలో 'లట్' ను సంకేతించి 'వర్తమానంబున లట్టగు' అని సూరి చెప్పాడు.

## 42. వ్యతిరేక క్త్వార్థము:

"కజి వ్యతిరేక క్త్వార్థంబు నందగు" నని బా.వ్యా. (క్రియా 39).

ఉదా॥ వండక, పండక, కొట్టక, తిట్టక.

వండు + కజి

జిత్తు పరంబగునపుడుత్వంబునకత్వంబగు (క్రియా–20)

వండు + (అ) క > వండక

ఇట్లు సూరి సంస్కృత వ్యాకరణానుసారంగా ఇత్సంజ్ఞలతో రూప సాధనము కావించును.

## 43.వ్యతిరేక తృవర్ణకార్థం:

వ్యతిరేక విశిష్టమగు కర్త్రర్థమునందు ధాతువునకు 'నిజి' యను ప్రత్యయము రాగా 'వండు+నిజి' అని యుండును. జిత్తు పరమందుండుటచే ధాతువు యొక్క ఉత్వమునకు అత్వము కలిగి 'వండ+ని=వండని' అని యగును. ఆ పైని తచ్ఛబ్దము చేరగా 'వండనివాఁడు' అని యగును.

ఎడి, ఎడు, – లోపము, ఉన్న, కల, న, ని – అనే వానిని గల ధాతువులను ధాతుజవిశేషణములని లేదా క్రియాజన్య విశేషణములని అంటారు. వచ్చెడి, వచ్చు – అన్నవి తద్ధర్మార్థక ధాతుజ వివేషణములు. వచ్చుచున్న – అన్నది వర్తమానార్థక ధాతుజ వివేషణము. రాఁగల – అన్నది భవిష్యదర్థక ధాతుజ విశేషణము. రాని – అన్నది వ్యతిరేకార్థక ధాతుజ విశేషణము.

ఉదా॥ వండు + నిజి + వాఁడు = వండనివాఁడు

| | | |
|---|---|---|
| 1. –ఎడి | : వండెడివాఁడు | : తృవర్ణకార్థము లేక కర్త్రర్థము లేక తద్ధర్మార్థకము |
| 2. –ఎడు | : వండెడువాఁడు | : తృవర్ణకార్థము లేక కర్త్రర్థము లేక తద్ధర్మార్థకము |
| 3. –లోపము | : వండువాఁడు | : తృవర్ణకార్థము లేక కర్త్రర్థము లేక తద్ధర్మార్థకము |
| 4. –ఉన్న | : వండుచున్నవాఁడు | : వర్తమానార్థక శత్రర్థము |
| 5. –కల(జి) | : వండఁగలవాఁడు | : భవిష్యదర్థక శత్రర్థము |
| 6. –న | : వండినవాఁడు | : క్తవదర్థము (భూతార్థము) |

7. –ని(జి) : వండనివాఁడు : వ్యతిరేక తృవర్ణకార్థము

ఇవి యేడును ధాతుజ విశేషణములు.

**44. వ్యధికరణం:**

ద్వితీయాది విభక్తులతో ఉన్న పూర్వపదం, పరపదంతో కలిసి ఈ సమాసం ఏర్పడుతుంది. ఈ వ్యధికరణ సమాసాన్ని తత్పురుష సమాసం అని కూడా వ్యవహరిస్తారు.

| | | |
|---|---|---|
| ద్వితీయా తత్పురుష సమాసం | : నెలతాల్పు | > నెలను తాల్పు |
| తృతీయా తత్పురుషం | : నెల తక్కువవాఁడు | > నెలచేత తక్కువ వాడు. |
| చతుర్థీ తత్పురుషం | : దేవరమేలు | > దేవరకొఱకుమేలు |
| పంచమీ తత్పురుషం | : దొంగ భయము | > దొంగవలన భయము |
| షష్ఠీ తత్పురుషం | : రాముని బాణము | > రాముని యొక్క బాణము |
| సప్తమీ తత్పురుషం | : మాటనేర్పరి | > మాటయందు నేర్పరి. |

**45. శత్రర్థము:**

శత్రర్థము అనగా వర్తమానకాల అసమాపక క్రియ. "చువర్ణకంబు ద్రుతాంతంబు క్రియాన్వయంబున శత్రర్థంబునందగు" (క్రియా. 43)

| | | |
|---|---|---|
| | బోవుచున్నాడు | (వర్తమానము |
| చూచుచుం | బోయెను | (భూతార్థము) |
| | బోవఁగలడు | (భవిష్యదర్థము) |

శత్రర్థమనగా శతృప్రత్యయార్థమని యర్థము. అనగా వర్తమానార్థము. మానార్థమందలి యీ యసమాపక క్రియ, మూడర్థములందలి క్రియలతో అనుసంధానము కలిగియున్నది. క్రియాన్వయమే ప్రధానముగాని సమాపకక్రియ అర్థమునందున్నది ప్రధానముగాదు. ఆయా అర్థములందలి వర్తమాన స్థితిని తెలుపుతుంది. ఈ అర్థంలో ధాతువుకు 'చు' చేరుతుంది.

**46. శబ్ద పల్లవము :**

ధాతువులు మొదలైన వాటికి, ధాతువులు అనుప్రయుక్తాలై విలక్షణమైన అర్థాన్ని బోధించే శబ్దాలు శబ్ద పల్లవములు అని పిలువబడతాయి. 'పల్లవం' అంటే చిగురు. రెండు దళాలు ఒకటై చిగురు అయినట్లు, రెండు శబ్దాలు కలిసి ఒక శబ్దంగా ఏర్పడం వల్ల శబ్ద పల్లవం అనే పేరు వచ్చింది. శబ్ద పల్లవం లక్షణాలు:

1. పూర్వావయవం ధాతువు గాని మరొకటి గాని అయి ఉంటుంది.

2. పరావయవం తప్పనిసరిగా ధాతువే అయి ఉంటుంది.

3. ఇవి కలిసి ఏర్పడిన రూపం విలక్షణం అయిన అర్థాన్ని బోధిస్తుంటుంది.

4. శబ్ద పల్లవాలు ఏర్పడేటప్పుడు ఆగమం, ఆదేశం, లోపం మొదలైన వ్యాకరణ కార్యాలు జరుగుతాయి.

ఉదా: కూరుచుండు : కూరుచు : కూడబెట్టు. ఉండు వసించు, 'కూరుచు' ధాతువు పూర్వావయం: ఉండు ధాతువు పరావయవం. ఇవి రెండూ కలిసి శబ్ద పల్లవం అవుతాయి. కూరుచు + ఉండు అనే రెండు పదాల అర్థం కంటే విలక్షణ అర్థం వస్తుంది – కాబట్టి కూరుచుండు అనేది శబ్ద పల్లవం అవుతుంది. విజయము చేయు 'విజయము నామవాచకము అవుతుంది. రాజులు మొదలైన వారు రావడాన్ని మర్యాద పూర్వకంగా విజయము చేయు అంటారు.

## 47. శేషము:

'శేషమనగా సంబంధము' – అని సూరి పేర్కొన్నాడు. శేషశబ్దానికి అర్థం మిగిలినదని అర్థం. ఇక్కడ చెప్పబడిన అర్థాల కంటే మిగిలినవని అర్థం. కారకాలైన కర్మ, కరణ, సంప్రదాన, అపాదాన, అధికరణాదుల కంటే భిన్నమైన స్వస్వామి భావం. జన్యజనక భావము మొ॥న సంబధాలు శేష పదానికి అర్థం. అటువంటి సంబంధ రూపార్థంలో షష్ఠీవిభక్తి ప్రయోగించబడుతుంది.

ఉదా॥ రామునికి సంబంధించిన గుణాలు; రాముని యొక్క గుణాలు(యొక్క)

నాకు సంబంధించిన మిత్రుడు; నా మిత్త్రుడు, నాకు మిత్త్రుడు(కు)

ఇలా సంబంధార్థంలో కు, యొక్క ప్రత్యయాలు వస్తాయని చిన్నయసూరి పేర్కొన్నాడు.

## 48. సాతత్యము:

సతతము ఉండేది సాతత్యము. తద్ధర్మాద్యకాలలో ఒకటిగా సూరి దీనిని చెప్పాడు.

ఉదా॥ సర్వము నందీశ్వరుడుండును.

సర్వము ఈశ్వరుని యందుండెను.

## 49. సమాసము:

"సమర్థంబులగు పదంబు లేక పదంబగుట సమాసంబు" అని సూరి సమాసానికి ఇచ్చిన నిర్వచనం. సామర్థ్యం కలిగిన రెండులేదా అంతకంటే ఎక్కువ పదాలు చేరి ఏక పదం కావడం సమాసం. సమాసంలో ఉండే సామర్థ్యాన్ని, ఏకార్థభావ సామర్థ్యం అంటారు. "పృథగ్భూతంబులగు నర్థంబులకేకార్థీ భావంబు

సామర్థ్యంబు” అని చిన్నయసూరి వివరణ. వేర్వేరుగా ఉన్న అర్థాలకు ఏకార్థం రావడం ‘సామర్థ్యం’ అని సూరి వివరించాడు. అంటే ప్రక్రియ దశలో వేర్వేరుగా ప్రసిద్ధార్థాలు కలిగిన పదాలు సముదాయ శక్తి వల్ల,ఏకార్థంలో పర్యవసించడం సామర్థ్యం అని భావం. ఉదా॥ రాజు, కొడుకు అనే పదాలు వేర్వేరుగా ప్రసిద్ధార్థాలు గల పదాలు. సంబంధార్థంలో ‘రాజు’ యొక్క కొడుకు’ – అనే షష్ఠీ తత్పురుష సమాసం ఏర్పడుతుంది. ఇలా ప్రసిద్ధార్థాలుండే రెండు పదాలు కలిసి ఏకార్థంలో ఏకపదంగా ఏర్పడుతున్నది. ఇది సమాసం. అలాగే తెల్లగుఱ్ఱము విశేషణ పూర్వపద కర్మధారయం, తల్లిదండ్రులు – ద్వంద్వ సమాసం, కమల నేత్రుడు = బహువ్రీహి సమాసం మొదలైనవి.

**50. సమానాధికరణం :**

సమానమైన విభక్తులతో కలిసి ఉండటమే సమానాధికరణం. దీన్నే ‘కర్మధారయం’ అంటారు. ఇందులో పూర్వోత్తర పదాలు ప్రథమావిభక్తులతో ఉంటాయి. విశేషణంతో విశేష్యం కలిసి ఏర్పడే సమాసం కర్మధారయం.

ఉదా॥ తెల్ల గుఱ్ఱము; తెల్ల – విశేషణం, గుఱ్ఱము – విశేష్యం.

విశేషణంతో విశేష్యం కలిసి, ‘విశేషణ పూర్వ పద కర్మధారయ సమాసం’ ఏర్పడింది.

**51. ఉపమాన పూర్వపద కర్మధారయ సమాసం:** సంస్కృతం లక్షణం పట్టని తెలుగు సమాసాలు ఉ ండవచ్చు.

ఉదా॥ చిగురు కేలు : ఇందులో ‘చిగురు’ ఉపమానం. ‘కేలు’ ఉపమేయం. ఇవి రెండూ కలిసి ‘చిగురుకేలు’ అనే ఉపమాన పూర్వపద కర్మధారయ సమాసం ఏర్పడింది. ఇలాగే ‘జుంటిమోవి’ కూడా. ఇలాంటివి సంస్కృతంలో ఉండవు.

సంస్కృతంలో ‘ఉపమాన ఉత్తరపద కర్మధారయాలే’ ఉంటాయి.

ఉదా॥ ముఖ పద్మము;

ముఖము – పూర్వపదం, విశేష్యం– పద్మము.

ఇందులో ఉత్తర పదం–ఉపమానం అలాగే

‘చరణ కమలములు’

**52. సర్వనామము:**

'అన్ని' మొదలైన శబ్దాలు సర్వనామాలు అని పిలువబడతాయి. వీటిలో సంఖ్యావాచకాలు కూడా చేరతాయి. నామవాచకానికి బదులుగా వచ్చే పదాలు సర్వనామాలు. రాముడు దశరథుని పుత్రుడు. 'అతడు' తండ్రి ఆజ్ఞపై అడవికి వెళ్లెను రాముడు అనే నామవాచకానికి బదులు వచ్చిన 'అతడు' సర్వనామం. వాడు, అతడు, ఆమె, నీవు, నేను మొదలైనవి సర్వనామాలు. అలాగే : ముగ్గురు, నలుగురు మొదలైన సంఖ్యావాచకాలు కూడా సర్వనామాలే. అన్ని ప్రభృతులు 'సర్వనామంబులు' అని చిన్నయసూరి నిర్వచనం.

**53. సంప్రదానము:**

'త్యాగోద్దేశంబు సంప్రదానంబు నాఁబడు'. త్యాగ + ఉద్దేశము. త్యాగానికి ఉద్దేశింపబడిన వ్యక్తి. ఏదైనా వస్తువును దానంగా ఇవ్వటానికి ఏ వ్యక్తి ఉద్దేశించబడతాడో ఆ వ్యక్తి సంప్రదానం.

ఉదా॥ జనకుండు రాముని కొఱకుఁ గన్యనిచ్చెను.

ఇందులో కన్య నీయటానికి ఉద్దేశించినవాడు రాముడు కాబట్టి రాముడు సంప్రదానం. సంప్రదానార్థంలో రాముడికి చతుర్థి ప్రత్యయం వచ్చి 'రాముని కొఱకు' –అవుతుంది.

**54. సంభావన:**

సంభావనమంటే ఊహ. తద్ధర్మాద్యర్థకాలలో ఒకటిగా సూరి చెప్పాడు.

ఉదా॥ ఇప్పుడు వాడింటనుండును

**55. సాంస్కృతికము:**

సమాసంలోని పదాలయొక్క భాషను అనుసరించి చేయబడిన విభజనలో ఇదొకటి. సాంస్కృతిక సమాసాన్ని 'సిద్ధ సాంస్కృతికం' అని 'సాధ్య సాంస్కృతికం' అని రెండు రకాలుగా విభజించవచ్చు.

**1. సిద్ధ సాంస్కృతిక సమాసం :** కేవల సంస్కృత పదాలు కలిసి ఏర్పడేది సిద్ధ సాంస్కృతిక సమాసం. సంస్కృతంలోనే సమాసం ఏర్పడి తెలుగు విభక్తుల్ని చేర్చుకొని 'సిద్ధ సాంస్కృతిక సమాసం' ఏర్పడుతుంది.

ఉదా॥ రాజాజ్ఞ, తటాకోదకమ్, లక్ష్మీవల్లభా అనేవి సంస్కృత సమాసాలు. వాటికి చివర దీర్ఘం హ్రస్వమై, ము, డుజ్ చేరి 'రాజాజ్ఞ, తటాకోదకము, లక్ష్మీవల్లభుఁడు' అనే సిద్ధ సాంస్కృతిక సమాసాలు ఏర్పడ్డాయి.

**2.సాధ్య సాంస్కృతిక సమాసం:** 'సంస్కృత సమాలు' కలిసి ఏర్పడేది సాధ్య సాంస్కృతిక సమాసం. ఉదా॥ రాజు, ఆజ్ఞ అనేవి సంస్కృత సమాలు. ఈ రెండు తత్సమాలు చేరి 'రాజు నాజ్ఞ' అనే షష్ఠీ తత్పురుష సమాసం ఏర్పడుతుంది. అలాగే 'తటాకంబు', 'ఉదకము' తత్సమాలు. 'తటాకంబు నుదకము'

అనే సప్తమీ తత్పురుష సమాసం ఏర్పడుతుంది. 'లక్ష్మి', 'వల్లభుఁడు' – అనే తత్సమాలు కలిసి

ి 'లక్ష్మీవల్లభుఁడు' అనే షష్ఠీ తత్పురుషం ఏర్పడుతుంది. ఇవి సాధ్య సాంస్కృతికాలు.

**56. హేతువు:**

'ఫలసాధన యోగ్యంబగు పదార్థంబు హేతువు' అని సూరి నిర్వచించాడు. ఫలాన్ని సాధించటానికి యోగ్యమైన పదార్థం హేతువని తాత్పర్యం.

ఉదా॥ ధనముచేత సౌఖ్యంబు గలుగు; విద్యచేత యశంబు గలుగు.

పై ఉదాహరణలో సౌఖ్యమనే ఫలాన్ని సాధించటానికి ధనం హేతువు. యశమనే ఫలాన్ని పొందటానికి విద్యహేతువు. అందుచేత ధన విద్యా శబ్దాలకు చేత చేరుతుంది.

–0–

పాఠం -4

# రూప సాధనలు

## విషయ సూచిక

1. ఉపోద్ఘాతం
2. సమాస పరిచ్ఛేదం
3. తద్ధిత పరిచ్ఛేదం
4. కృదంత పరిచ్ఛేదం
5. ప్రకీర్ణక పరిచ్ఛేదం

## 1. ఉపోద్ఘాతం

ఈ పాటంలో సమాసపరిచ్ఛేదం, తద్ధిత పరిచ్ఛేదం, క్రృదంత పరిచ్ఛేదం, ప్రకీర్ణక పరిచ్ఛేదాలలోని వ్యాకరణ రుపసాధనలు ఇవ్వబడ్డాయి.

## 2.సమాస పరిచ్ఛేదము

- **రాజునాజ్ఞ**

ప్రాతిపదిక 'రాజు'

రాజు యొక్క + ఆజ్ఞ

సూ॥ సమాస విభక్తికి లోపంబగు లట్టునకు గాదు.(సమాస -25)

రాజు + ఆజ్ఞ

సూ॥ షష్ఠీ సమాసంబునందుకార ఋకారములకచ్చు పరమగునపుడు నుగాగమంబగు. (సంధి -34)

రాజు + ను + ఆజ్ఞ

రాజునాజ్ఞ

సూ॥ అమహన్నపుంసకముల కదంతంబులకు ము వర్ణకంబగు.(తత్సమ -39)

రాజునాజ్ఞ + ము

సూ॥ స్త్రీ లింగంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు. (తత్సమ -57)

దీనిచే 'రాజునాజ్ఞ

- **లక్ష్మివల్లభుడు**

లక్ష్మి + యొక్క + వల్లభ

సూ॥ సమాస విభక్తికి లోపంబగు, లట్టునకు గాదు. (సమాస -25)

సూ॥ పుంలింగబయి మహద్వాచకంబయిన నామంబు తుది యత్వంబునకుత్వంబగు. (తత్సమ-21)

లక్ష్మివల్లభ + ఉ

సూ॥ పుంలింగమగు మహద్వాచకమునకు డుజ్జగు.(తత్సమ-22)

లక్ష్మివల్లభు + డుజ్

సూ॥ జిత్తు బిందుపూర్వకంబగు(తత్సమ-19)

లక్ష్మివల్లభుడు

- **చెఱవునుదకము**

చెఱువు యొక్క ఉదకము

సూ॥ సమాస విభక్తికి లోపంబగు, లట్టునకు గాదు(సమాస -25)

చెఱువు + ఉదక

సూ॥ షష్ఠీ సమాసమునందుకార ఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు. (సంధి -34)

చెఱువు + ను + ఉదక

సూ॥ అమహన్నపుంసకముల కదంతంబులకు ము వర్ణకంబగు. (తత్సమ -39)

చెఱువునుదకము

- **ముక్కంటి**

మూడు + లు + కన్నులు + లు

సూ॥ సమాస విభక్తికి లోపంబగు, లట్టునకు గాదు.(సమాస -25)

మూడు + కన్ను

సూ॥ బహువ్రీహిని సమాసాంత కార్యంబులుం గానంబడియెడి.(సమాస-22)

మూడు + కంటి

సూ॥ సమానాధికరణంబగు నుత్తరపదంబు పరంబగునపుడు మూఁడు శబ్దము డువర్ణకంబునకు లోపంబును, మీది హల్లునకు ద్విత్వంబునగు.(సమాస-17)

మూ + క్కంటి

సూ॥ ద్విరుక్తంబగు హల్లు పరంబగునపుడాచ్చిక దీర్ఘంబునకు హ్రస్వంబగు.(సమాస-13)

దీనిచే 'ముక్కంటి'

- **వేగంటి**

వేయి + లు + కన్ను + లు

సూ॥ బహువ్రీహిని సమాసాంత కార్యంబులుం గానంబడియెడి.(సమాస-22)

వేయి + లు + క + ంటి + లు

సూ॥ సమాస విభక్తికి లోపంబగు, లట్టునకు గాదు.(సమాస -25)

వేయి + కంటి

సూ॥ బహువచనంబు పరంబగునపుడు రేయి ప్రభృతుల తుది యక్షరంబు లోపించు. ఈ లోపంబు సమాసంబులం జూపట్టెడు.(ఆచ్ఛిక-21)

వే + కంటి

సూ॥ ప్రథమ మీది పరుషంబులకు గ -స -డ -ద -వలగు(సంధి-13)

'వేగంటి'

- **నీవు ధన్యుడవు**

నీవు + ధన్యుదవు

సూ॥ ప్రథమాంతంబులగు యుష్మదస్మద్విశేషణంబుల కేకత్వంబున వు - ను - లును,

బహుత్వంబున రు, ములు నంతాగమంబులు ప్రాయికంబుగనగు.(కారక-33)

ఈ సూత్రంచే విశేషణం 'వు' చేరుతుంది

నీవు + ధన్యుడు + వు

సూ॥ ఈ యాగమంబులు పరంబులగునపు దుత్వంబున కత్వంబగు.(కారక-34)

ఈ సూత్రంచే

నీవు + ధన్యుడ + వు = నీవు ధన్యుడవు

- **నీదు కరుణ**

నీ యొక్క కరుణ

సూ॥ సమాస విభక్తికి లోపంబగు, లట్టునకు గాదు.(సమాస -25)

నీ + కరుణ

సూ॥ యుష్మదస్మదాత్మార్థకంబుల కుత్తరపదంబు పరంబగునపుడు దుగాగమంబు విభాషనగు.(సమాస-11)

దీనిచే నీ + దు + కరుణ = నీదుకరుణ

- **ఎల్లోకము**

ఏ + లోకము

సూ॥ ఆ - ఈ - ఏ యన సర్వనామంబులు త్రికంబునాఁబడు.(సమాస-4)

సూ॥ త్రికంబు మీది యసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగానగు.(సమాస-14)

ఏ + ల్లోకము

సూ॥ ద్విరుక్తంబగు హల్లు పరంబగునపు డాచ్చికంబగు దీర్ఘంబునకు

హ్రస్వంబగు.(సమాస-13)

'ఎల్లోకము'

- **ఇంటిది**

ఇంటి యొక్క + అది

సూ॥ సమాస విభక్తికి లోపంబగు, లట్టునకు గాదు.(సమాస -25)

ఇంటి + అది

సూ॥ అది, యవి శబ్దంబుల యత్తునకు వృత్తిని లోపంబు బహుళంబుగానగు.(సంధి-45)

'ఇంటిది'

- **వచ్చినవాడు**

ధాతువు 'వచ్చు'

సూ॥ భూతంబునం దిగాగమంబగు.(క్రియా-17)

వచ్చు + ఇ = వచ్చి

సూ॥ ఉన్న, కలజి, న వర్ణకంబులు భవద్భావి శతృక్తవదర్థంబులందగు.(క్రియా-46)

వచ్చి + న

సూ॥ ధాతుజ విశేషంబులకు విభక్తి వివక్షించునపుడు తచ్ఛబ్దంబను ప్రయుక్తమగు.(సమాస–9)

వచ్చిన + వాడు = వచ్చినవాడు

➢ **బెడిదపుటడిదము**

బెడిద + ము + అడిద + ము

'బెడిదము' – మువర్ణకాంతము

సూ॥ కర్మధారయంబులందు ము వర్ణకంబునకుం బు, ంపులగు.(సంధి–32)

బెడిదపు + అదిదము

సూ॥ కర్మధారయంబులందుత్తునకచ్చు పరంబగునపుడు టుగాగమంబగు.(సంధి–28)

బెడిదపు + ట్ + అడిదము

'బెడిదపుటడిదము'

➢ **ముచ్చిచ్చు**

మూడు + లు + చిచ్చు + లు

సూ॥ సమాస విభక్తికి లోపంబగు, లట్టునకు గాదు.(సమాస –25)

మూడు + చిచ్చు

సూ ॥ సమానాధికరణంబగు నుత్తరపదంబు పరంబగునపుడు మూడు శబ్దము దువర్ణంబునకు లోపంబును, మీది హల్లునకు ద్విత్వంబునగు.(సమాస–17)

మూ + చ్చిచ్చు

సూ॥ ద్విరుక్తంబగు హల్లు పరంబగునపుడాచ్చిక దీర్ఘంబునకు హ్రస్వంబగు.(సమాస–13)

ముచ్చిచ్చు

సూ॥ ద్విగువునకేకవచనంబు ప్రాయికంబుగానగు.(సమాస–18)

ఈ సూత్రంచే బహువచనంలో కూడా 'ముచ్చిచ్చు' అనే రూపమే ఉంటుంది.

➢ **ముజ్జగములు**

మూడు + లు + జగ + లు

సూ॥ సమాస విభక్తికి లోపంబగు, లట్టునకు గాదు.(సమాస –25)

మూడు + జగ

సూ ॥ సమానాధికరణంబగు నుత్తరపదంబు పరంబగునపుడు మూడు శబ్దము దువర్ణంబునకు లోపంబును, మీది హల్లునకు ద్విత్వంబునగు.(సమాస–17)

మూ + జ్జగ

సూ॥ ద్విరుక్తంబగు హల్లు పరంబగునపుడాచ్చిక దీర్ఘంబునకు హ్రస్వంబగు. (సమాస-13

ము + జ్జగ

సూ॥ లువర్ణంబు బహువచనంబు.(తత్సమ-12)

ము + జ్జగ + లు

సూ॥ వానికి మువర్ణకేతరంబయిన విభక్తి పరంబగునపుడు ముగాగమంబగు.(తత్సమ-40)

'ముజ్జగములు'

➢ **కమ్మందేనె**

కమ్మ + ము + తేనియ + ము

సూ॥ సమాస విభక్తికి లోపంబగు, లట్టునకు గాదు.(సమాస -25)

దీనిచే కమ్మ + తేనియ

సూ॥ గుణవచనంబులగు నల్లాదులకుం గర్మధారయంబునందు నిగాగమంబు బహుళంబుగానగు.(సమాస-12)

కమ్మ + ని + తేనియ

గుణవచనంబులు కొన్నిటి నిగాగమంబునకుఁ బరుషంబులు పరంబగునపుడు బిందువగు.(సమాస-వృత్తి)

దీనిచే కమ్మం + తేనియ

సూ॥ ఇయకు మారుగా నామాంతమునకిత్వంబు బహుళంబుగానగు.(ఆచ్ఛిక-23)

కమ్మం + తేనె

సూ॥ ఆచ్ఛిక సమాసంబులం దఱచుగ వర్ణలోపాగమాదేశ వికారంబులు నిత్య వైకల్పిములుగా బెక్కులు గానంబడియెడి.(ప్రౌఢ)

దీనిచే కమ్మందేనె, కమ్మఁతేనె

➢ **నాఁపచేను**

నాము యొక్క చేను

సూ॥ సమాస విభక్తికి లోపంబగు, లట్టునకు గాదు.(సమాస -25)

నాము + చేను

సూ॥ కొండొకచో సమాసంబులందు నామ్వాది కనుమ్వాదుల మువర్ణకంబులు పఙ్పవర్ణంబులగు.(సమాస-19)

నాఁపచేను

సూ॥ ఉకారాంత గోశబ్దంబుల కంతట వువర్ణకంబగు.(తత్సమ-48)

నాఁపచేను + వు

సూ॥ స్త్రీ లింగంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు.తత్సమ-57)

'నాఁపచేను'

➢ **పాఁపతేడు**

పాము + యొక్క + తే + డుఙ్

సూ॥ సమాస విభక్తికి లోపంబగు, లట్టునకు గాదు.(సమాస -25)

పాము + తే

సూ॥ కొండొకచో సమాసంబులందు నామ్వాది కనుమ్వాదుల మువర్ణకంబులు

పఙ్పవర్ణంబులగు.(సమాస-19)

పా + పఙ్ + తే

'పాఁపతే'

సూ॥ పుంలింగమగు మహద్వాచకమునకు డుఙ్ఙగు.(తత్సమ-22)

పాఁపతే + డుఙ్

సూ॥ ఙిత్తు బిందుపూర్వకంబగు.(తత్సమ-19)

'పాఁపతేఁడు'

➢ **కవ్వడి**

కవ + వడి

సూ॥ నిక్కలాదులు యథాప్రయోగంబుగ గ్రాహ్యంబులు.(సమాస-20)

'కవ్వడి'

➢ **నలువ**

నాలుగు + లు + వాయి + లు

సూ॥ బహువ్రీహిని సమాసాంత కార్యంబులుం గానంబడియెడి.(సమాస-22)

నాలుగు + లు + వ + లు

సూ॥ సమాస విభక్తికి లోపంబగు లట్టునకు గాదు.(సమాస -25)

నాటుగు + వ

సూ॥ నిక్కలాదులు యధాప్రయోగంబుగ గ్రాహ్యంబులు.(సమాస-20)

నలు + వ

'నలువ'

- **అలరుఁబోడి**

అలురు + వు + మేను + వు

సూ॥ బహువ్రీహిని స్త్రీ వాచ్యంబగుచో నుపమానంబు మీది మేనునకు బోఁడియగు. (సమాస-23)

అలరు + వు + బోడి + వు

సూ॥ సమాస విభక్తికి లోపంబగు లట్టునకు గాదు.(సమాస -25)

అలరు + బోడి

సూ॥ స్త్రీ లింగంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు.(తత్సమ-57)

అలరుబోడి

- **మాత్రపితలు**

ప్రాతిపదిక 'మాతృ + పితృ'

లు వర్ణంబు బహువచనంబు.( తత్సమ-12)

మాతృ + పితృ + లు

ఋకారాంతంబున కత్వంబును స్త్రీవద్భావంబునగు.(తత్సమ -52)

దీన్ని బట్టి మాతృపితలు అవుతుంది.

దంద్వంబునందు ఋకారంబునకు రవర్ణంబు విభాషనగు.(సమాస-24)

దీనితో 'మాత్రపితలు' అవుతుంది.

-0-

## 3.తద్ధితపరిచ్ఛేదము

- **చిన్నటికము**

ప్రాతిపదిక 'చిన్న'

సూ॥ చిన్నాదులకు 'టిక' వర్ణకంబగు.(తద్ధిత-3)

చిన్న + టిక

సూ॥ అమహన్నపుంసకముల కదంతంబులకు మువర్ణకంబగు(తత్సమ-39)

'చిన్నటికము'

➢ **తొత్తటికము**

ప్రాతిపదిక 'తొత్తు'

సూ॥ చిన్నాదులకు టిక వర్ణకంబగు(తద్ధిత-3)

తొత్తు యొక్క 'టిక'

సూ॥ సమాసవిభక్తికి లోపంబగు లట్టునకుఁగాదు(సమాస-25)

తొత్తు + టిక

సూ॥ అమహన్నపుంసకముల కదంతంబులకు మువర్ణకంబగు(తత్సమ-39)

తొత్తు + టికము

సూ॥ ఉత్వంబునకత్వంబు టికము పరంబగునపుడగు(తద్ధిత-4)

'తొత్తటికము'

➢ **ఆటగాఁడు**

ప్రాతిపదిక 'ఆట'

సూ॥ కాకత్తియ వర్ణకంబులు పుంస్త్వస్త్రీత్వంబుల మతుబర్థంబునందాటాదులకగు.(తద్ధిత-11)

ఆట + కా

సూ॥ కాకత్తియల కకారంబునకు గకారంబు కొండొకచో గానంబడియెడి(తద్ధిత-12)

ఆట + గా

సూ॥ మహత్తులగు మగాదులకుం గయిరాదులకును డుజ్ఞగు నుత్వంబు గాదు(ఆచ్ఛిక-4)

ఆట + గా + డుజ్

సూ॥ జిత్తు బిందుపూర్వంబగు.(తత్సమ-19

ఆట + గా + ండు

సూ॥ దీర్ఘము మీద సాధ్యపూర్ణము లేదు.(సంజ్ఞ-15)

ఆటగాఁడు

➢ **అటమటీఁడు**

ప్రాతిపదిక 'అటమట'

సూ॥ అటమటాదులకు మతుబర్థంబునందీవర్ణకంబు పుంస్త్వంబునందగు.(తద్ధిత–15)

అటమట + ఈ

సూ॥ మహత్తులగు మగాదులకుం గయిరాదులకును డుజ్జగు, నుత్వంబుగాదు.(ఆచ్ఛిక–4)

అటమటీ + డుజ్

సూ॥ జిత్తు బిందుపూర్వకంబగు.(తత్సమ–19)

'అటమటీఁడు'

➢ **ఓయారి**

ప్రాతిపది 'ఓయారము'

సూ॥ ఇవర్ణకంబోయారాదులకు మతుబర్థంబునందగు.(తద్ధిత–18)

ఓయారము + ఇ

సూ॥ స్త్రీలింగంబుల ప్రథమైకవచనంబునకు లోపంబగు.(తత్సమ–57)

ఓయార + ఇ = ఓయారి

➢ **చెంచెత**

ప్రాతిపదిక 'చెంచు'

సూ॥ తవర్ణకంబు కులవాచకంబునకు స్త్రీవాచ్యంబగునపుడు మతుబర్థంబునందగు.

(తద్ధిత–19)

చెంచు + త

సూ॥ తవర్ణకంబుపరంబగుచో నొకానొకచో నెత్వంబు చూపట్టెడు.(తద్ధిత–20)

చెంచెత

సూ॥ అమహన్నపుంసకముల కదంతంబులకు మువర్ణకంబగు.(తత్సమ–39)

చెంచెత + ము

సూ॥ స్త్రీ లింగంబుల ప్రథమైకవచనంబునకు లోపంబగు. (తత్సమ–57)

దీనిచే 'చెంచెత' – అనే రూపం సిద్ధిస్తుంది.

➢ **వగలాడి**

ప్రాతిపదిక 'వగ'

సూ॥ లువర్ణంబు బహువచనంబు.(తత్సమ–12)

వగ + లు

సూ॥ వగాదులకు బహువచనాంతంబులకు స్త్రీవాచ్యంబగునపుడు మతుబర్థంబునందాఁడి వర్ణకంబగు.(తద్ధిత-23)

వగ + లు + ఆడి

సూ॥ సమాస విభక్తికి లోపంబగు లట్టునకు గాదు.(సమాస-25)

వగలు + లాడి

సూ॥ అంద్వవగాగమంబులందప్ప నపదాది స్వరంబు పరంబగునపుడచ్చునకు సంధియగు.(సంధి-11)

'వగలాడి'.(సంధి-11)

- **వీసెడు**

ప్రాతిపదిక 'వీసె'

సూ॥ మానార్థంబున కేకత్వంబునందెఁడు వర్ణకంబగు.(తద్ధిత-25)

వీసె + ఎడు

సూ॥ అంద్వవగాగమంబులందప్ప నపదాది స్వరంబు పరంబగునపుడచ్చునకు సంధియగు.(సంధి-11)

'వీసెడు'

దీనిమీద 'వు' చేరినా స్త్రీసమం కాబట్టి లోపించి 'వీసెడు' - అన్నరూపం సిద్ధిస్తుంది.

- **దోసెడు**

ప్రాతిపదిక 'దోసిలి'

సూ॥ మానార్ధంబున కేకత్వంబునం దెఁడువర్ణకం బగు.(తద్ధిత-25)

దోసిలి + ఎడు

సూ॥ ఎడు వర్ణకంబు పరంబగునపుడు లివర్ణంబులోపించు.(తద్ధిత-26)

దోసి + ఎడు

సూ॥ అంద్వవగాగమంబులందప్ప నపదాది స్వరంబు పరంబగునప్పుడచ్చునకు సంధియగు.(సంధి-11)

'దోసెడు'

దీని మీద 'వు' చేరినా స్త్రీ సమం కాబట్టి లోపించి 'దోసెడు' - అనే రూపమే ఉంటుంది.

ప్రాతిపదిక ‘మోకాలు’

సూ॥ దఘ్నార్థంబున బంటి కొలcదులగు.(తద్ధిత-27)

మోకాలు + బంటి

సూ॥ ఊరు మొదలగు వానికిత్వంబగు.(ఆచ్ఛిక-30)

దీనిచే మోకాలి + బంటి

‘మోకాలి బంటి’ - రూపమేర్పడుతుంది.

-0-

## 4.కృదంత పరిచ్ఛేదము

- **ఎఱుక**

‘ఎఱుగు’ - ధాతువు

సూ॥ కవర్ణకం బలుగ్వాదుల కగు (కృ- 3)

ఎఱుగు + క

సూ॥ ఇటం గృత్కగతపవేములు పరంబు లగునపుడు కగచయవలకు లోపంబగు (కృ - 2)

ఎఱుc + క

ఇక్కడ బిందువులోపించి

‘ఎఱుక’ - అనే రూపం సిద్ధిస్తుంది.

- **కినుక**

‘కినియు’ - ధాతువు

సూ॥ కవర్ణకం బలుగ్వాదుల కగు (కృ - 3)

కినియు + క

సూ॥ ఇటం గృత్కగతపవేములు పరంబులగునపుడు కగచయవలకు లోపంబగు (కృ - 2)

కిని + క

సూ॥ కినియు, ముదియుల కుత్వంబగు.(కృ-3,వృత్తి)

కిను + క

‘కినుక’

- **కలిమి**

'కలుగు' - ధాతువు

సూ॥ ఇమివర్ణకంబు కలుగ్వాదులకగు (కృ-4)

కలుగు + ఇమి

సూ॥ ఇటం గృత్కగతపవేములు పరంబులగునపుడు కగచయవలకు లోపంబగు (కృ-2)

కలు + ఇమి

సూ॥ అంద్వవగాగమంబులందప్పు నపదాది స్వరంబు పరంబగునపుడచ్చునకు సంధియగు. (సంధి-11)

'కలిమి'

సూ॥ స్త్రీలింగంబుల ప్రథమైకవచనంబునకు లోపంబగు. (తత్సమ-57)

'కలిమి'

- **తిరిపము**

'తిరియు' - ధాతువు

సూ॥ పవర్ణకంబు తిరియ్వాదుల కగు (కృ-9)

తిరియు + ప

ఆచ్ఛికశబ్దం, క్లీబసమం కాబట్టి

సూ॥ అమహన్నపుంసకముల కదంతంబులకు ముపర్ణకంబగు. (తత్సమ-39)

తిరిప + ము = తిరిపము

- **తూనిక**

'తూగు' - ధాతువు

సూ॥ ఇక వర్ణకం బంజ్వాదుల కగు. (కృ-12)

తూగు+ఇక

సూ॥ తూను తూఁగునకగు. (కృ-12.వృత్తి)

తూను+ఇక

సూ॥ అంద్వవ గాగమంబులందప్పు నపదాదిస్వరంబు పరంబగునప్పుడచ్చునకు సంధియగు. (సంధి-11)

'తూనిక'

- **వీవన**

'వీచు' – ధాతువు

సూ॥ అప్పాదులకు నజి యగు.(కృ–13)

వీచు+నజి

సూ॥ ఆగమాన్య చకారంబుల కద్విరుక్తంబులకు ముత్తు పరంబగునపుడు పవలగు.(క్రియా–88)

వీవు+నజి

సూ॥ జిత్తు పరంబగునప్పుడత్వంబున కుత్వంబగు.

'వీవన'

- **చూడ్కి**

'చూచు' – ధాతువు

సూ॥ ఇకి కోర్వాదులకగు (కృ–16)

చూచు+ఇకి

సూ॥ చూడు చూచునకగు (కృ. 16.వృత్తి)

చూడు+ఇకి

సూ॥ అంద్వవగాగమంబలందప్పు నపదాదిస్వరంబు పరంబగునపుడచ్చునకు సంధియగు. (సంధి–11)

చూడికి

సూ॥ లాతియచ్చునకు సహితమొకానొకచో నుడినడుమ లోపంబు గానంబడియెడి (ప్రకీ–18)

చూడ్కి

- **వంటకము**

'వండు' – ధాతువు

సూ॥ అకవర్ణకంబు మాఱ్వాదులకగు (కృ–19)

వండు+అక

సూ॥ డుకారంబు టకారంబగు (కృ–19.వృత్తి)

వంట+అక

సూ॥ అంద్వవగాగుమంబులందప్పు నపదాది స్వరంబు పరంబగునపుడచ్చునకు సంధియగు (సంధి–11)

వంటక

సూ॥ అమహన్నపుంసకముల కదంతములకు మువర్ణకంబగు

వంటక+ము= వంటకము.

- **గిలిగింత**

'గిలిగించు'-ధాతువు

సూ॥ తవర్ణంబావులించు లోనగు వానికగు (కృ-10)

గిలిగించు+త

సూ॥ ఇటంగృత్కగతపవేములు పరంబులగునపుడు కగచయవలకు లోపంబగు (కృ - 2)

'గిలిగింత'

సూ॥ అమహన్నపుంసకముల కదంతములకు మువర్ణకంబగు (తత్సమ-39)

గిలిగింత + ము

సూ॥ స్త్రీలింగంబుల ప్రథమైకవచనంబునకు లోపంబగు (తత్సమ - 57)

గిలిగింత

- **కానుపు**

ధాతువు 'కను'

సూ॥ పువర్ణకంబు మాయ్యాదుల కగు (కృ - 11)

కను + పు

సూ॥ ఇక, క, పులు పరంబగునపుడు కనుకకు దీర్ఘంబగు (కృ-3 వృత్తి)

కాను + పు = కానుపు

- **అమ్మకము**

'అమ్ము'- ధాతువు

సూ॥ అకవర్ణకంబు మాఱ్వాదులకగు (కృ-19)

అమ్ము+అక

సూ॥ అంద్వవగాగమంబులందప్ప నపదాదిస్వరంబు పరంబగునప్పుడచ్చునకు సంధియగు (సంధి-11)

అమ్మక

సూ॥ అమహన్నపుంసకముల కదంతములకు మువర్ణకంబగు (తత్స-39)

'అమ్మకము'

- **నడవడి**

'నడచు' ధాతువు

సూ॥ వడిప్రభృతు లిట్లెఱుంగునది (కృ-22)

నడచు+వడి

సూ॥ ఇటంగృత్కగతపవేములు పరంబులగునపుడు కగచయవలకు లోపంబగు (కృ-2)

నడ+వడి=నడవడి

ఇవి ఇకారాంత కృదంతాలు. వీటిపై ప్రథమైక వచనాలు చేరినా, స్త్రీ సమాలు కాబట్టి ప్రథమైకవచనాలు లోపిస్తాయి.

-0-

## 5. ప్రకీర్ణ పరిచ్ఛేదం

- **ఊయల**

సూ॥ ఊయేలాదులం దొలి యచ్చు మీది హల్లునకు ద్విర్వచనంబొండెనగు. (ప్రకీ-6)

ఊ + య్యేల

సూ॥ ద్విరుక్తంబగు హల్లు పరంబగునపుడాచ్ఛికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు. (సమాస-13)

ఉయ్యేల

ద్విత్వం రాకపోతే 'ఊయేల'

- **ఏతాము**

'ఏత' - ప్రాతిపదిక

ఆచ్ఛిక శబ్దాలన్నీ స్త్రీసమాలు లేదా క్లీబసమాలే. ఇది ఆచ్ఛికం. క్లీబసమం.

సూ॥ అమహన్నపుంసకముల కదంతంబులకు మువర్ణకంబగు(తత్స-39)

ఏత + ము

సూ॥ ఏతాదులకు మువర్ణకంబు పరంబగునపుడు దీర్ఘంబు విభాషనగు(ప్రకీ-15)

ఏతాము

విభాష కాబట్టి 'ఏతము' అనే రూపము కూడా ఉంది.

- **జూజము**

ప్రాతిపదిక –'జూద'

సూ॥ అమహన్నపుంసకముల కదంతములకు మువర్ణకంబగు.(తత్సమ–39)

'జూదము'

సూ॥ జూదాదుల గాకు జకారంబు విభాషనగు.

జూజము – విభాష కాబట్టి 'జూదము' అనే రూపం కూడా సిద్ధిస్తుంది.

- **గీవణుడు**

రావణుడు + రావణుడు

సూ॥ నిందయందామ్రేడితంబు నాద్యక్షరములకు హ్రస్వ దీర్ఘంబులకు గిగీలగు(ప్రకీర్ణ)

రావణుడు + గీవణుడు = రావణుడు గీవణుడు

- **మ్రాన్పడె**

మ్రాను + పడె

సూ॥ పదాంతంబులయి యసంయుక్తంబులయిన నులురుల యుత్వంబునకు లోపంబు బహుళంబుగానగు

మ్రాన్ + పడె = మ్రాన్పడె

- **అబ్రము/కప్రము**

అబ్బురము / కప్పురము

సూ॥ అబ్బురాదులం దుత్వంబునకు లోపంబు విభాషనగు(ప్రకీ–19)

అబ్బ్ + రము / కప్ప్ + రము

ద్విత్వం మీద సంయుక్తం ఏర్పడే సందర్భంలో ద్విత్వంలోని ఒక హల్లు లోపిస్తుంది.

'అబ్రము' / కప్రము

- **చిల్క**

'చిలుక' –ప్రాతిపదిక

సూ॥ ఆచ్ఛికంబులం బదమధ్యంబుల నలడరల యుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు (ప్రకీ–17)

చిల్ + క = చిల్క

- **అద్రుచు**

'అదురు' –ధాతువు

సూ॥ చుగాగమం బాచ్ఛికంబున కసంయుక్త నలడరాంతంబునకుం బ్రేరణంబున

బహుళంబుగానగు.(క్రియా–73)

అదురు + చు

సూ॥ చుక్పరక రువర్ణంబునకు ముందటి దువర్ణంబు నుత్వంబునకు లోపంబు విభాషనగు, నగుచో దత్పూర్వంబు గురువు గాదు.(ప్రకీ–20)

అద్రుచు – అద్రుచు

–0–

పాఠం -5

# సందర్భ సహిత వివరణలు

## విషయ సూచిక

1. ఉపోద్ఘాతం
2. కారక పరిచ్ఛేదం
3. సమాస పరిచ్ఛేదం
4. తద్ధిత పరిచ్ఛేదం
5. కృదంత పరిచ్ఛేదం
6. ప్రకీర్ణక పరిచ్ఛేదం

## 1. ఉపోద్ఘాతం

ఈ పాఠం లో కారక, సమాస, తద్ధిత , కృదంత , ప్రకీర్ణక పరిచ్ఛేదాల లోని వ్యాకరణ సూత్రాలకు సందర్భ సహిత వివరణలు పేర్కొనబడ్డాయి.

## 2. కారక పపరిచ్ఛేదం

### 1. 'పక్షంబున వలన వర్ణకంబగు'

**(లేదా)**

**'పక్షంబునం దోడ వర్ణకంబగు'**

**సందర్భం:** చిన్నయసూరి రచించిన బాలవ్యాకరణంలోని కారకపరిచ్ఛేదంలోని 'చేత వర్ణకంబు హేతుకరణంబులకు గ్రహ్యాదియోగజంబగు పంచమికిని బహుళంబుగా నగు' (కార - 4) అనే సూత్ర వృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ:** 'చేత' అనే తృతీయావిభక్తి ప్రత్యయం, హేతువులోను కరణార్థంలోను, గ్రహ్యాదియోగంలో వచ్చే పంచమీ విభక్తి స్థానంలోను బహుళంగా వస్తుంది.

హేత్వర్థంలో 'చేత'కు బదులు 'వలన' అనే పంచమీ విభక్తి కూడా వస్తుంది.

ఉదా॥ "ధనము చేత సౌఖ్యంబు కలుగు" (చేత)

"ధనము వలన సౌఖ్యంబుకలుగు" (వలన)

కరణార్థంలో చేతకు బదులు 'తోడ' - అనే తృతీయా విభక్తి కూడా వస్తుంది.

ఉదా॥ ఖడ్గంబు చేత ఖండించె (చేత)

ఖడ్గంబు తోడ ఖండించె (తోడ)

### 2. 'తుల్యార్థ యోగంబున షష్ఠియు నగు'

**సందర్భం:** చిన్నయసూరి రచించిన బాలవ్యాకరణంలోని కారకపరిచ్ఛేదంలోని 'కరణ సహార్థతుల్యార్థ యోగంబులం దృతీయకుం దోడవర్ణకం బగు' (కార - 5) అనే సూత్ర వృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ:** కరణార్థంలో, సహార్థంలో, తుల్యార్థ యోగంలో 'తోడ' – వర్ణకం వస్తుందని చెప్పి, తుల్యార్థయోగంలో మాత్రం తోడ స్థానంలో షష్ఠీవిభక్త్యర్థాన్ని బోధించే 'కు' – ప్రత్యయం వస్తుందని సూరి వృత్తిలో వివరించాడు.

ఉదా॥ చైత్రునితోడ మైత్రుండు తుల్యుండు

ఈ పై వాక్యంలో 'చైత్రునితో మైత్రుడు సమానమైన వాడు అని పోల్చి చెప్పే సందర్భంలో చైత్రునికిమైత్రుడు సమానుడని చెప్పటం ఇందులోని విషయం. అంటే తుల్యార్థ యోగంలో తోడ(తృతీయ), కు (షష్ఠి) – రెండూ వస్తాయని తాత్పర్యం.

**3. 'ప్రాయికం బనుటచే నొకానొకచో ద్వితీయయు నగు'**

**సందర్భం:** చిన్నయసూరి రచించిన బాలవ్యాకరణంలోని కారక పరిచ్ఛేదంలోని "వచ్యర్థాముఖ్యకర్మంబునకుఁ దోడకువర్ణకంబులు ప్రాయికంబుగ నగు" (కారక – 6) అనే సూత్ర వృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ :** అను పలుకు, చెప్పు మొ॥న క్రియలతో అన్వయించే అప్రధానమైన కర్మకు 'తోడ', 'కు', వర్ణకాలు వస్తాయి.

ఉదా॥ మైత్రుండు చైత్రునితోడనిట్లనియె

మైత్రుండు చైత్రునకిట్లనియె

సూత్రంలో వాడిన 'ప్రాయికంబుగా' – అనే శబ్దానికి సాధారణంగా అని అర్థం. అంటే వ్యాకరణ కార్యం వర్తించని సందర్భాలు కూడా అరుదుగా ఉండవచ్చునని చెప్పటం కోసం ఈ ప్రాయిక శబ్దాన్ని సూత్రంలో వాడతారు. ఈ పైన పేర్కొన్న సందర్భంలో వచ్యర్థ అముఖ్యకర్మకు రావలసిన తోడకు బదులుగా కర్మార్థంలో వచ్చే 'ను' – వర్ణకం వస్తుందని సూరి వివరించాడు

ఉదా॥ 'మైత్రుండు చైత్రునిట్లనియె'

**4. 'కొన్నియెడల నుద్దేశమాత్రంబున కగు'**

**సందర్భం:** చిన్నయసూరి రచించిన బాలవ్యాకరణంలోని కారకపరిచ్ఛేదంలోని 'సంప్రదానంబునకుం జతుర్థి యగు' (కార – 8) అనే సూత్రవృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ:** త్యాగానికి ఉద్దేశింపబడిన వ్యక్తి సంప్రదానం. ఆ సంప్రదానార్థంలో చతుర్థి విభక్తి వస్తుంది.

ఉదా॥ జనకుండు రాముని కొఱకు కన్యనిచ్చెను.

కొన్ని చోట్ల త్యాగం యొక్క ప్రసక్తి లేకపోయినప్పటికీ లక్షింపబడిన వ్యక్తికి చతుర్థి వస్తుంది.

ఉదా॥ పురుషార్థంబుకొఱకు యత్నింపవలయు

ఈ ఉదాహరణలో త్యాగం యొక్క ప్రసక్తి లేదు. యత్నానికి లక్ష్యమైంది పురుషార్థం. కాబట్టి చతుర్థీవిభక్తి ప్రత్యయం కలిగి 'పురుషార్థము కొఱకు' – అని అయింది.

**5. 'చతుర్థికి మాఱుగా షష్ఠియె తఱచుగc బ్రయోగంబులం గానంబడియెడి'**

**సందర్భం:** చిన్నయసూరి రచించిన బాలవ్యాకరణంలోని కారకపరిచ్ఛేదంలోని 'సంప్రదానంబునకుం జతుర్థి యగు' (కార – 8) అనే సూత్రవృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ:** సంప్రదానార్థంతో చతుర్థీ విభక్తి వస్తుందని చెప్పిన చిన్నయసూరి ప్రయోగాల్ని గమనించి, ఎక్కువగా ప్రయోగాల్లో చతుర్థికిమారుగా షష్ఠీవిభక్తితో కూడిన రూపాలే కనిపిస్తున్నాయని చెప్పాడు.

ఉదా॥ జనకుండు రామునకుం గన్య నిచ్చెను

పురుషార్థంబునకు యత్నింపవలయు

పై ఉదాహరణలలో 'కొఱకు' – కు బదులు షష్ఠి వాడటాన్ని గమనించవచ్చు.

**6. 'ఏనిప్రభృతి శబ్దంబులు కొన్ని నియమసాపేక్షంబు లయియుండు'**

**సందర్భం:** చిన్నయసూరిచే రచించబడిన బాలవ్యాకరణంలోని కారకపరిచ్ఛేదంలోని 'ఏక వాక్యంబునం దొకానొక్కండు దక్క సర్వ పదంబులు క్రమనిరపేక్షంబుగం బ్రయోగింపంజను' (కార – 37) అనే సూత్ర వృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ:** వాక్యంలో ఏదో కొన్ని శబ్దాలు తప్ప, తక్కిన శబ్దాల నన్నిటినీ కర్త కర్మ క్రియాది క్రమాన్ని అపేక్షించకుండా ఇష్టం వచ్చిన రీతిగా ప్రయోగించవచ్చు. ఏని, పోలెన్, వలెన్, అట్లు, పొంటె మొ॥న శబ్దాలు మాత్రం నియమానుసారం ప్రయోగించబడతాయని చిన్నయసూరి సూచన చేశాడు.

–0–

## 3. <u>సమాసపరిచ్ఛేదం</u>

**1. 'పృథగ్భూతంబు లగునర్థంబుల కేకార్థీభావంబు సామర్థ్యంబు'**

**సందర్భం:** ఈ వాక్యము చిన్నయసూరి రచించిన బాలవ్యాకరణంలోని సమాస పరిచ్ఛేదంలోని 'సమర్థంబులగు పదంబు లేకపదం బగుట సమాసంబు' (సమాస – 1) అనే సూత్రవృత్తిలోనిది.

**వివరణ:** సామర్థ్యంతో కూడిన పదాలు ఒకే పదంగా ఏర్పడటమే సమాసం. సమాసంగా ఏర్పడటానికి అన్ని పదాలు అర్హమైనవి కావు. ఈ సామర్థ్యాన్ని వ్యాకరణశాస్త్రం రెండు విధాలుగా చెపుతుంది.

1. వ్యపేక్షాసామర్థ్యం
2. ఏకార్థీభావ సామర్థ్యం.

ఒక వాక్యంలోని భిన్న భిన్న పదాలకు గల అన్వయం వ్యపేక్షా సామర్థ్యం. ఉదా॥ రాముడు

రావణుని సంహరించెను.

ఈ వాక్యంలో ఎవరు ఎవరిని సంహరించారు? అని ప్రశ్నిస్తే రాముడు, రావణుడు అనే సమాధానం వస్తుంది. ఇలా వాక్యంలో ఆకాంక్షను బట్టి వేర్వేరు పదాలకున్న సంబంధం తెలుస్తుంది. ఇలా ఆకాంక్షవలన ఏర్పడిన సంబంధానికి వ్యపేక్షా సామర్థ్యమనిపేరు.

వేర్వేరుగానున్న (పృథగ్భూతంబులగు) అర్థాలు ఒకే అర్థంతో అన్వయాన్ని కలిగియుండటం ఏకార్థీభావ సామర్థ్యం. వేర్వేరుగా ప్రసిద్ధములైన అర్థాలు కలిగిన పదాలను ఏకార్థంతో వర్తింపచేయటమే సామర్థ్యం. ఉదా॥ రాజనందనుడు

ఇందులో రాజు, నందనుడు అనే రెండు పదాలు, వేర్వేరు అర్థాలు కలిగినవి. ఈ రెండింటిని 'రాజు యొక్కనందనుడు' – అనే అర్థంలో వర్తింపచేసినప్పుడు 'రాజనందనుడు' అని సమాసమవుతుంది. దీనినే ఏకార్థీభావసామర్థ్యమని సూరి వివరించాడు.

**2. 'ఉభయంబులుఁ గూడినది మిశ్రం బనంబడు'**

**సందర్భం**: చిన్నయసూరిచే రచించబడిన బాలవ్యాకరణంలోని సమాస పరిచ్ఛేదంలోని 'సాంస్కృతికాచ్ఛిక మిశ్రభేదంబుచే సమాసంబు త్రివిధంబు' – అనే సూత్రవృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ:** కేవల సంస్కృతపదాలతో ఏర్పడిన సమాసము సిద్ధసంస్కృతసమాసమని, తత్సమశబ్దాలతో ఏర్పడే సమాసము సాధ్యసంస్కృత సమాసమని అంటారు. ఉదా॥ రాజాజ్ఞ (సిద్ధము), రాజునాజ్ఞ (సాధ్యము)అచ్చతెనుగు పదాలతో ఏర్పడే సమాసము ఆచ్ఛికం. ఉదా॥ తేనియానతి

సాంస్కృతికము, ఆచ్ఛికము కాకుండా, తత్సమాలకు, ఆచ్ఛికాలకు కలిగే సమాసమే 'మిశ్రమము'.

ఉదా॥రాజు + ముదల

ఇందులో 'రాజు' శబ్దం తత్సమం. 'ముదల' శబ్దం తెలుగు. ఈ రెండు శబ్దాలు కలిసి 'రాజు ముదల' అనే సమాసం ఏర్పడింది. అలాగే చెఱువు నుదకము, సిరివల్లభుడు వంటివి మిశ్రసమాసాలు. ఇలా తెలుగు, తత్సమ శబ్దాలతో కూడి ఏర్పడేవి మిశ్రసమాసాలని సూరి పేర్కొన్నాడు.

**3. 'ప్రాయికంబుగా ననుటచే సంస్కృతలక్షణంబు దొడరని సమాసంబుం గలదని సూచింపఁ బడియె'**

**సందర్భం:** చిన్నయసూరిచే రచించబడిన బాలవ్యాకరణంలోని సమాస పరిచ్ఛేదంలోని 'తత్పురుషాదులకు లక్షణంబు ప్రాయికంబుగా సంస్కృతోక్తంబ యగు' (సమా – 3) అనే సూత్ర వృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ:** తెలుగులో తత్పురుష మొదలయిన సమాసాలు, సంస్కృత సమాసాల లక్షణాలు ఎలా చెప్పారో అలాగే వర్తిస్తాయి. ఉత్తర పదార్థ ప్రాధాన్యముంటే వాటిని తత్పురుషసమాసాలని, అన్యపదార్థ ప్రాధాన్యముంటే బహువ్రీహియని, ఉభయ పదార్థ ప్రాధాన్యముంటే ద్వంద్వ సమాసమని అంటారు.

ద్వితీయాది విభక్త్యంతాలు, మీది పదంతో సమసిస్తే అది వ్యధికరణసమాసం. దీనినే తత్పురుషసమాసమని పిలుస్తారు. విశేషణానికి విశేష్యంతో కలిగే సమాసం సమానాధికరణ సమాసం.

దీనినే కర్మధారయసమాసమని అంటారు. పూర్వపదం విశేషణం కాకుండా సంఖ్యావాచకమయితే అది ద్విగుసమాసమని పేర్కొంటారు.

అన్యపదార్థ ప్రాధాన్యముంటే అది బహువ్రీహి అని, ఉభయ పదార్థ ప్రాధాన్యముంటే అది ద్వంద్వమని సూరి పేర్కొన్నాడు. ఇలా సంస్కృత భాషలోనున్న సమాసాలను పోలిన సమాసాలనే చెప్పి, సూత్రంలో 'ప్రాయికంబగు' అన్న మాటకు సార్థకతను చేకూరుస్తూ సంస్కృతంలో కనిపించని సమాసాలు తెలుగులో ఉన్నాయిని సూరి సూచించాడు.

ఉదా॥ ఉపమాన పూర్వపదకర్మధారయం

చిగురుకేలు, జుంటిమోవి

(చిగురువంటికేలు, జుంటివంటి మోవి)

సంస్కృతంలో ఇలాంటివి లేవు. పద్మము వంటి ముఖము – ముఖపద్మము అవుతుంది గానీ 'పద్మముఖము' – అని కాదు. అలాగే చరణకమలములు. ఇవి ఉపమానోత్తరపద కర్మధారయ సమాసాలు.

ఉపమానం పూర్వపదంగా నుండే కర్మధారయ సమాసాలు సంస్కృతంలో లేవు. కాబట్టి సాంస్కృతికమైన సిద్ధసమాసాలు తెలుగులో ఉండే అవకాశం లేదు. సంస్కృత సమాసాల్ని యథాతథంగా గ్రహించి, తెలుగు సంప్రదాయానుసారంగా సమాసం చివర విభక్తులను చేర్చుకోవాలి.

ఉదా॥రాజపురుష: – రాజపురుసుడు.

పీతాంబర: – పీతాంబరుఁడు

నీలోత్పలమ్ – నీలోత్పలము

రామలక్ష్మణౌ – రామలక్ష్మణులు

ఇలా సంస్కృతంలోని సర్వసమాసాల్ని గ్రహించవచ్చని తెలుపుతూ 'సిద్ధంబు సర్వంబు గ్రాహ్యంబు" అని సూరి పేర్కొన్నాడు. అయితే సంస్కృతంలో లేని ఉపమానపూర్వపద కర్మధారయ సమాసాలు తెలుగులో మాత్రమే ఉన్నాయి.

ఉదా॥ చిగురుకేలు (చిగురు వంటి కేలు)

తేనెమోవి (తేనెవంటి మోవి)

ఇవి ఉపమానపూర్వపద కర్మధారయాలు

**4. 'కేవల సంస్కృతశబ్దము వికృతిశబ్దములతోడ సమసింపదు'**

**సందర్భము:** చిన్నయసూరిచే రచించబడిన బాలవ్యాకరణంలోని సమాసపరిచ్ఛేదంలోని 'తత్పురుషాదులకు లక్షణంబు ప్రాయికంబుగా సంస్కృతోక్తంబ యగు' (సమా – 3) అనే సూత్ర

వృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ:** 'కేవల సంస్కృతశబ్దము వికృతిశబ్దముతోడ సమసింపదు' ఇందులో కేవల సంస్కృతశబ్దమంటే తెలుగు విభక్తిని పొందని శబ్దమని అర్థం. తెలుగు విభక్తి చేరకుండా ఉన్న సంస్కృతశబ్దాలు అచ్చ

తెలుగు శబ్దాలతో సమసించవు. అంటే అలా సమాసాలుగా చేయరాదని అర్థం.

ఉదా॥ అనేక మాఱులు

ఇందులో 'అనేక' సంస్కృతం, 'మాఱులు' తెలుగు. ఇలా రెండింటిని కలిపి సమాసం చేయరాదు. అలాగే అల్పము + దండు : ఇందులో పూర్వపదం తత్సమం, ఉత్తరపదం ఆచ్ఛికం. ఇటువంటి వాటిని వైరి సమాసాలంటారు. ఇలా సమాసాల్ని చేయరాదని, వీటిని దుష్టసమాసాలని సూరి తిరస్కరించాడు.

**5. 'పల్లమును గళ్ళెమును ఇత్యాదులు సమసింపవని యీనియమంబున నెఱుంగునది'**

**సందర్భము:** చిన్నయసూరి రచించిన బాలవ్యాకరణంలోని సమాసపరిచ్ఛేదంలోని 'ఆచ్ఛిక శబ్దంబుతోడ స్త్రీసమంబు ప్రాయికంబుగా ద్వంద్వంబగు' (సమా – 7) అనే సూత్రవృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ:** ద్వంద్వ సమాసంలో సాధారణంగా ఉత్తరపదం ఆచ్ఛికమై, పూర్వపదం స్త్రీసమమై యుంటుంది.

ఉదా॥ అన్నదమ్ములు, తల్లిదండ్రులు, ఆలుమగలు, ఊరు వల్లెలు

అయితే 'మగడు + బిడ్డలు' – అనే రెండు పదాలు ఆచ్ఛికాలే. పూర్వపదం డువర్ణకాంతం. స్త్రీసమం కాదు. అందుచేత దానిని సమాసం చేయటానికి వీలు లేదు. వ్యస్తంగానే ఉంటాయి. సముచ్చయార్థకమైన 'ను' చేరి 'మగడును బిడ్డలును' – అని వ్యస్తంగానే ఉంటుంది. అలాగే 'పల్లము + కళ్ళెము' – అనే రెండు పదాలు కూడా సమసింపవు. ఇందులో పూర్వపదం మువర్ణకాంతం

కాబట్టి 'ను' – అనే సముచ్చయార్థకం కలిగి 'పల్లమును కళ్ళెమును' – అవి వ్యస్తంగానే ఉంటాయి తప్ప సమాసం చేయటానికి వీలుకాదు.

-o-

## 4. తద్ధిత పరిచ్ఛేదం

### 1. 'టికాదులు రానిపక్షమందుఁ దనప్రత్యయం బన్నింటి కగు'

**సందర్భం:** చిన్నయసూరి రచించిన బాలవ్యాకరణంలోని తద్ధితపరిచ్ఛేదంలో 'మగఁటిమ్యాదులు యథా ప్రయోగంబుగ గ్రాహ్యంబులు'(తద్ధిత – 8) అనే సూత్రవృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ :** మగటిఁమి – మొ॥న తద్ధితరూపాల రూపసాధన ప్రక్రియ క్లిష్టతతో కూడినది. అందుచేత వాటిని ప్రయోగం నుంచి గ్రహించమని సూరి చెప్పాడు. ఈ సందర్భంలోనే 'టికము' – మొ॥న ప్రత్యయాలు రానప్పుడు అన్నిటికి తనము అనే ప్రత్యయం వస్తుందని పేర్కొన్నాడు.

చిన్న + టికము : చిన్నటికము;
టికము రానప్పుడు 'చిన్న + తనము : చిన్నతనము
అలాగే
ముచ్చు + ఇమి : ముచ్చిమి; ఇమి రానిపక్షంలో ముచ్చు + తనము = ముచ్చుదనము
నల్ల + న : నల్లన; న రాని పక్షంలో నల్ల + తనము : నల్లదనము.

### 2. 'కాప్రత్యయాంతంబునకు మగాది గణనంబునం జేసి డుజ్ఞగు'

**సందర్భం:** చిన్నయసూరి రచించిన బాలవ్యాకరణంలోని తద్ధితపరిచ్ఛేదంలో 'కాకత్తియ వర్ణకంబులు పుంస్త్వ స్త్రీత్వంబుల మతుబర్థంబునం దాటాదుల కగు' (తద్ధిత – 11) అనే సూత్రవృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ:** ఆట మొ॥నవానికి మతు బర్థంలో పురుషబోధకంగా 'కా' అనే ప్రత్యయం, స్త్రీ బోధకంగా 'కత్తియ' – అనే ప్రత్యయం వస్తుంది.

'ఆట + కా' – అని అన్నప్పుడు 'కా' ప్రత్యయాంతాలు మగాది గణంలోవి కావటం చేత డుజ్ ప్రత్యయం వస్తుంది. అప్పుడు "ఆట + కా + డుజ్" ఆటకాఁడు అవుతుంది.

ఆట శబ్దానికి (స్త్రీత్వంలో కత్తియ వర్ణకం రాగా) ఆట+ కత్తియ = 'ఆట కత్తియ' – అవుతుంది. ఇయకు మాఱుగా నామాంతానికి ఎత్వంవచ్చి 'ఆట కత్తె' – అవుతుంది.

### 3. 'ఆ ప్రత్యయాంతంబు మగాదిగణంబు'

**సందర్భం:** చిన్నయసూరి రచించిన బాలవ్యాకరణంలోని తద్ధితపరిచ్ఛేదంలో "వగాదులకు బహు

వచానంతంబులకుఁ బుంస్త్వంబున మతుబర్థం బాకారం బగు' (తద్ధిత – 23) అనే సూత్రవృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ:** వగ మొ॥న బహువచనాంత రూపాలపై, కలవాడు అనే అర్థంలో 'ఆ' – ప్రత్యయం చేరుతుంది. 'ఆ' ప్రత్యయం కలిగిన రూపాలు మగాదులోనివి. కాబట్టి డుజ్బుకలుగుతుంది.

వగలు + ఆ + డుజ్ = వగలాఁడు

చిన్నెలు + ఆ + డుజ్ = చిన్నెలాఁడు

వన్నెలు + ఆ + డుజ్ = వన్నెలాఁడు

–0–

## 5. కృదంతపరిచ్ఛేదము

### 1. "కినియు, ముదియుల కుత్వంబు నగు"

**సందర్భము:** చిన్నయ సూరిచే రచించబడిన బాల వ్యాకరణంలోని కృదంతపరిచ్ఛేదంలోని 'కవర్ణకం బలుగ్వాదుల కగు"(కృ–3) అనే సూత్రవృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ:** అలుగు మొ॥న ధాతువులకు 'క'– అనే ప్రత్యయం కలుగుతుందని చెప్పిన సూత్రంలో

కినియు, ముదియు అనే ధాతువులకు యవర్ణం లోపించటమే కాకుండ, వెనుకనున్న ఇత్వానికి ఉత్వం కూడ వస్తుంది. అప్పుడు కినుక, ముదుక అనే రూపాలు ఏర్పడతాయి.

కినియు > కిన్ ఇయు > కిన్ ఉక > కినుక

ముదియు > ముద్ ఇయు > మున్ ఉక > మునుక

### 2. "అనుప్రయుక్తం బయినయాట శబ్దంబు ప్రాయికంబుగాఁ గ్లీబసమం బగు"

**సందర్భం:** చిన్నయసూరి రచించిన బాలవ్యాకరణంలోని కృదంతపరిచ్ఛేదంలోని "టవర్ణకం బాడ్వాదుల కగు నగుచో నంతలోపం బగు"(కృ–7) అనే సూత్రవృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ:** ఆడు మొ॥న ధాతువులకు 'ట' అనే ప్రత్యయం కలుగుతుంది. అప్పుడు ధాతువు యొక్క చివరనున్న అక్షరానికి లోపం కలుగుతుంది. ఉదా ॥ ఆడు + ట= ఆట

ఆడు ధాతువు అనుప్రయుక్తమై ఏర్పడే కోలాడు, పోరాడు, మంద్రాడు మొ॥న వాటికి టవర్ణకం పరమైనప్పుడు ప్రాయికంగా నపుంసకత్వం కలుగుతుంది. అంటే మువర్ణకం చేరి కోలాటము, పోరాటము, మంద్రాటము వంటి రూపాలేర్పడతాయి. ప్రాయికముగునని అనటం చేత పోరాట, నీరాట మొ॥న రూపాలు కూడా సమ్మతాలేయని సూరి తాత్పర్యం.

**3. "తూను తూఁగున కగు"**

**సందర్భం:** చిన్నయసూరి రచించిన బాల వ్యాకరణంలోని కృదంత పరిచ్ఛేదంలోని 'ఇక వర్ణకం బంజ్వాదులకగు" (కృ - 12) అనే సూత్ర వృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ:** అంజు మొ॥న ధాతువులకు 'ఇక' – అనే ప్రత్యయం కలుగుతుంది. ఉదా॥ అంజు + ఇక : అంజిక. 'కనుక' అనే ధాతువు యొక్క తొలి యచ్చునకు దీర్ఘం కలుగగా కను + ఇక = కానిక అవుతుంది. తూగు+ఇక: అన్నప్పుడు 'తూను' ఆదేశమై తూను + ఇక : తూనిక అవుతుందని చిన్నయసూరి వివరించాడు.

**4. "వండు డకారంబు టకారంబగు"**

**సందర్భం:** చిన్నయసూరిచే రచించబడిన బాలవ్యాకరణంలోని కృదంతపరిచ్ఛేదంలోని 'అకవర్ణకంబు మాఙ్వాదుల కగు"(కృ–19) అనే సూత్రవృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ:** మాఙు మొ॥నవానికి 'అక ' అనే ప్రత్యయం వస్తుందని చెప్పి 'వండు' ధాతువు యొక్క 'డు' వర్ణానికి బదులుగా 'టు'వర్ణం వచ్చి,

వండు + అకము

వంట + అకము = 'వంటకము' అనే రూపం ఏర్పడుతుంది – అని వివరించాడు.

**-o-**

## 6. ప్రకీర్ణ పరిచ్ఛేదము

**1. 'ఇట ద్రుతమునకు లోపసంశ్లేష స్వత్వములు'**

(లేదా)

**'ఇట యడాగమము లేదు'**

**సందర్భము:** చిన్నయసూరిచే రచింపబడిన బాలవ్యాకరణంలో ప్రకీర్ణక పరిచ్ఛేదంలోని 'పదాద్యంబులు ఋ, ౠ వర్ణంబులు రలతుల్యంబులు' – అనే సూత్రవృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ:** అచ్చులే అయినప్పటికీ పదాదిన ఉన్న ఋ, ౠ వర్ణాలు, వ్యాకరణ కార్య విషయంలో తమ ధర్మాన్ని వీడి ర, ల హల్లుల ధర్మాన్ని చేపడుతున్నాయి.

అతడు + ఋషి :ఉత్తునకచ్చు పరంబగునపుడు సంధియగు, అనే సూత్రం చేత సంధి జరగాలి. కాని సంధి జరుగక 'అతడు ఋషి' – అనే ఉంటుంది.

'ఆ + ఋషి' : సంధి లేని చోట యడాగమం రావాలి. కాని అలా యడాగమం జరుగకుండా 'ఆ ఋషి' అనే ఉంటుంది. ఈ రెండు లక్ష్యాలు అచ్చునకు రావలసిన రెండు కార్యాలు రాకుండటానికి చూపబడ్డాయి.

'వచ్చెను + ఋషి' – అన్నప్పుడు "పదాద్యంబులు ఋ, ౠ వర్ణంబులు ర, ల తుల్యంబులు" – అనే సూత్రం చేత ఋ వర్ణానికి రవర్ణతుల్యత్వం కలుగుతుంది. అప్పుడు 'ద్రుతంబునకు సరళస్థిరంబులు పరంబులగునపుడు లోపసంశ్లేషంబులు విభాషనగు" (బాల.సంధి.18) అనే సూత్రం చేత ద్రుతానికి లోపం రాగా, 'వచ్చె ఋషి' అని, ద్రుతానికి మీది హల్లుతో సంశ్లేషం రాగా 'వచ్చెన్ ఋషి' – అని అవుతుంది. పైకార్యం జరుగని పక్షంలో ద్రుతానికి స్వత్వం కలిగి 'వచ్చెను ఋషి' – అని యథాతథంగానే ఉండిపోతుంది. దానినే సూరివృత్తిలో 'ఇట ద్రుతమునకు లోపసంశ్లేష స్వత్వములు' – అని వివరించాడు.

### 2. 'వక్ష్యమాణంబు యద్విత్వంబు'

**సందర్భము:** చిన్నయసూరిచే రచించబడిన బాలవ్యాకరణం లోని ప్రకీర్ణకపరిచ్ఛేదంలోని "ఊయేల యూయాలల చాఁపుల నొండొంటికిం గుఱుచ యొండె నగు" – (ప్రకీ–4) అనే సూత్ర వృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ:** 'వక్ష్యమాణంబు యద్విత్వంబు' –అంటే యకారానికి యద్విత్వం ఇక ముందు చెప్పబడుతుందని అర్థం.

'ఊయేల' – అనే పదం యొక్క తొలి దీర్ఘానికి హ్రస్వంరాగా, "ఉయేల" – అని అవుతుంది. రెండవ దీర్ఘానికి హ్రస్వం రాగా "ఊయెల" – అని అవుతుంది. అలాగే "ఊయాల" అని, మలి దీర్ఘానికి హ్రస్వం రాగా "ఊయల" అని అవుతుంది.

కాని తరువాత చెప్పిన "ఊయేలాదులం దొలియచ్చుమీఁది హల్లునకు ద్విర్వచనం బొండె నగు" – అనే సూత్రం చేత "ఊయేల" – పదానికి ఉయ్యేల, ఉయ్యెల అనే రెండు రూపాలు, ఊయాల పదానికి ఉయ్యాల, ఉయ్యల అనే రెండు రూపాలు కలుగుతాయని తాత్పర్యం.

### 3. "పూను పొదవుల కాదిలోపం బొకండు వచియించె నది యవిచారమూలకంబు"

**సందర్భం :** ఈ వాక్యం చిన్నయ సూరి రచించిన బాల వ్యాకరణం లోని "హొదులయు నీలుగు లోనగువాని తొలి హల్లునకు లోపంబు బహుళంబుగా నగు" (ప్రకీ 10) అనే సూత్ర వృత్తిలోనిది ఈ వాక్యం.

**వివరణ :** హకారంతో ప్రారంభమయ్యే మాటలకు, నీలుగు మొ॥న మాటలకు తొలి హల్లునకు లోపం బహుళంగా జరుగుతుంది.

ఉదా ॥ హడపము – అడపము

నీలుగు – ఈలుగు

నెగయు – ఎగయు

పొందు – ఒందు

పొనరు – ఒనరు

అయితే పూను, పొదవు అనే రెంటికి కూడ అప్పకవి తొలి హల్లు లోపిస్తుందని చెప్పాడు. అలా చెప్పటం అవిచారమూలకమని సూరి నిరసించాడు. ఊను – పూను, పొదవు – ఒదవు అనేవి వేరు వేరు. పూను, పొదుపులే ఊను, ఒదవులకు మూలరూపాలని పొరపాటు పడటం ఆలోచించకుండా చేసినదని సూరి చెప్పాడు.

1. పూను : కడగు (పూనిక)

   ఊను : ఆను, నాటు, మోపు

2. పొదవు : వ్యాపించు, ఆక్రమించి

   ఒదవు : లభించు, జనించు ఉపయోగపడు

ఇలా ఆ రెండు పదాల రూపాంతరాలకు భేదమున్నది కాబట్టి పూను, పొదవుల తొలి హల్లులు లోపించాయనటం సూరికి అంగీకారంకాదు. వాటి అర్థాలు వేరు. అవి భిన్నధాతువు నుండి పుట్టినరూపాలు.

–0–

పాఠం -6

# సూత్ర వ్యాఖ్యానాలు

## విషయ సూచిక

1. ఉపోద్ఘాతం
2. కారక పరిచ్ఛేదం
3. సమాస పరిచ్ఛేదం
4. తద్ధిత పరిచ్ఛేదం
5. కృదంత పరిచ్ఛేదం
6. ప్రకీర్ణక పరిచ్ఛేదం

## 1. ఉపోద్ఘాతం

ఈ పాఠం లో కారక, సమాస, తద్ధిత , కృదంత , ప్రకీర్ణక పరిచ్ఛేదాల లోని వ్యాకరణ సూత్రాలకు వ్యాఖ్యానాలు ఇవ్వబడ్డాయి.

## 2. **కారక పరిచ్ఛేదము**

### 1. ప్రాతిపదిక సంబోధనోక్తార్థంబులం బ్రథమ యగు. (కారక-1)

**వ్యాఖ్య :** ప్రాతిపదికార్థమునందును, సంబోధనార్థము నందును, ఉకార్థమునందును ప్రథమాభవిక్తి యగునని సూత్రార్థము. నియతమైన ఉనికిని గలిగినటువంటిది ప్రాతిపదికార్థము. కేవల ప్రాతిపదికమునుగాని, కేవల ప్రత్యయమునుగాని ప్రయో గింపరాదు. ప్రకృతి ప్రత్యయముల కలయిక వలన శబ్దమేర్పడును. కావున, ఇతర పదములతో నేవిధమైన సంబంధమును లేకుండునట్లుగా, ప్రాతిపదిక యొక్క అర్థమును మాత్రమే బోధించు నప్పుడు ప్రథమావిభక్తి యగునని యర్థము. 'రాముఁడు' అని వాడినప్పుడు దశరథుని కుమారుదు మనకు స్ఫురించును. ఇది యొక వాక్యములోని పదముగా కాక, విడిగా వాడబడినది. కావున, దీనివ్యాప్తి యింతవరకు మాత్రమేయుండి, నియతమైన యునికిని మాత్రమే స్ఫురింప జేయును. అట్లే 'రావణుఁడు' అనునప్పుడు లంకాధిపతి స్ఫురణకు వచ్చును. ఇట్లు ఇతర పదముల యపేక్ష లేకుండ వాడునప్పుడు ప్రాతిపదికార్థమునందు ప్రకృతికి ప్రథమావిభక్తి చేరును.

సంబోధన మనగా ఇతరుల నభిముఖము గావించు కొనుటకు పిలుచుట. ఇట్టి యెడల సంబోధ్యవాచకము ప్రథమా విభక్తి నొందును. 'ఓ రాముఁడ' – ఇచ్చట సంబోధ్యవాచకము 'రాముఁడు'

ప్రథమావిభక్త్యంతము. "సంబోధనంబునం - దేకార్థం బయిన పదంబు తుది యుకారంబున కకారం బగు" (తత్సమ-82) అను సూత్రము చేత అకారము కలిగి 'రాముఁడ' అనియైనది.

ఉక్తమనగా చెప్పబడినదియని యర్థము. ఆఖ్యాతము క్రియాపదము. వాక్యమునందలి క్రియాపదముచే ఏది చెప్పబడినదో దానికి ప్రథమావిభక్తి యగునని యర్థము. 'రాముఁడు రావణుని సంహరించెను' అను నీ వాక్యమునందు "సంహరించెను' అనునది క్రియ. ఈ క్రియాపదము వలన జనించిన ఆకాంక్షనుబట్టి 'ఎవరు' అని ప్రశ్నింపగా 'రాముఁడు' అని సమాధానము కలుగును. కావున నీ వాక్యమున ఆఖ్యాతము 'రాముఁడు' అను కర్తను చెప్పినది. అందువలన నిది ప్రథమాంతమై యుండవలయును. 'రావణుఁడు రామునిచే సంహరింపఁబడియె' ఈ వాక్యమునందు 'సంహరింపఁబడియె' అను ఆఖ్యాతము 'రావణుఁడు' అను కర్మమును చెప్పినది, కావున ఆఖ్యాతముచేత ఉక్తమగు రావణశబ్దమునకు ప్రథమావిభక్తి కలిగి 'రావణుఁడు' అని యైనది.

ఉకార్థమనగా కర్త యనికాని, కర్మమని కాని యర్థము చేసికొనరాదు, కర్త్రర్థక ప్రయోగమునందు కర్తను, కర్మార్థక ప్రయోగమునందు కర్మమును క్రియాపద మాకాంక్షించు చుండును. కావున, దానినట్లే చెప్పి కొనవలయును.

## 2. కర్మంబున ద్వితీయ యగు. (కారక - 2)

**వ్యాఖ్య :** కర్మార్థమునందు ద్వితీయా విభక్తి యగునని సూత్రార్థము. కర్మమనగా ధాతువు యొక్క అర్థమైన ఫలము నకు ఆశ్రయమైనది.

దేవదత్తుఁడు వంటకమును వండెను - అనుచోట 'వండెను. అనునది క్రియ. దీనికి వంట చేసెనని యర్థము. చేయుట యనునది వ్యాపారము. దానియొక్క ఫలము వంట. వంటయను ఫలమున కాశ్రయమైనది వంటకము. కావున 'వంటకము' అను శబ్దమునకు ద్వితీయా విభక్తి యగును. 'వండెను' అను క్రియ 'దేనిని' అను ప్రశ్నను గలిగింపగా 'వంటకము'ను అను సమాధాన మీయవలసి వచ్చును. కావున 'వంటకము' కర్మమై ద్వితీయా విభక్తిని పొందును.

నువర్ణంబు "ద్వితీయ" (తత్సమ - 2) అను సూత్రమును బట్టి కర్మార్థక శబ్దమునకు ద్వితీయా విభక్తి ప్రత్యయమగు 'ను' చేరును. ఇది యే ఇకారము మీద నైనచో ని వర్ణముగ మారుమ. హల్పరకమైనప్పుడు స్వరమును గోల్పోయి పొల్లునకారముగా కూడ నుండవచ్చును.

## 3. కరణ సహార్థ తుల్యార్థయోగంబులం దృతీయకుం దోడ, వర్ణకం బగు. (కారక-5)

**వ్యాఖ్య :** కరణమునందును, సహితత్వము (కూడియుండుట) ను బోధించునప్పుడును, సామ్యమును చెప్పునప్పుడును తృతీయా విభక్తి యగును. తృతీయావిభక్తియందు 'రెండు ప్రత్యయములు

గలవు. ఆ రెండింటిలో 'తోడ' అనునది యిట్టి యెడల వచ్చునని సూత్రవిధి.

కోలతోడఁ గూలనేసె – అను వాక్యమునందు 'కూలనేసె అనునది క్రియ. కూలనేయుట అను ఈ క్రియ సిద్ధించుటకు – ఉపయోగపడిన ప్రకృష్టమైన సాధనము 'కోల' కావున కరణార్థమునందలి

యీ 'కోల' యను శబ్దమునకు 'తోడ' అను 'ప్రత్యయము గలిగి 'కోలతోడ' అని యగును.

రాజు సేనలతోడ వచ్చెను – ఇచట 'వచ్చె' అనునది క్రియ. కర్త రాజు. రాజు సేనలను కలుపుకొని వచ్చెను. కావున "సేనలు' అను శబ్దమునకు తృతీయా విభక్తి ప్రత్యయ మగు ' తోడ' అనునది వచ్చును. ఇచ్చట 'తోడ' సహార్థమున వచ్చును.

చైత్రునితోడ మైత్రుండు తుల్యుండు – ఇచ్చట చైత్రు నకును మైత్రునకును తుల్యత్వమును చెప్పుట యుద్దిష్టము. కావున 'తోడ' అనునది వచ్చును.

ఇట్టి యెడ తృతీయకు బదులుగా షష్ఠియు కావచ్చును. కావుననే సూత్రమునందు "తృతీయకుం దోడ వర్ణ కం బగు" అని చెప్పవలసి వచ్చినది. శృతీయా విభక్తి ని విధించునప్పుడు మాత్రమే 'తోడ' అనునది వచ్చుననియు, పద్ధీ విభ క్తిని విధించు నెడల 'కు' వర్ణ కము వచ్చుట కాదేపము లేదనియు దాని భావము. చై త్రు నకు మైత్రుండు తుల్యుండు – అనునది యుదా 'హరణము.

### 4. ఉపయోగంబునం దాఖ్యాతకుం దోడ వర్ణకం బగు. (కారక – 8)

**వ్యాఖ్య :** 'ఉపయోగమనగా నియమపూర్వకముగా విద్యను స్వీకరించుట' యని యర్థము. ఆఖ్యాత యనగా విద్యను బోధించు వాడని యర్థము. నియమపూర్వకమైన విద్యాభ్యాసమును గూర్చి చెప్పునప్పుడు బోధకునకు 'తోడ' వర్ణకమగునని సూత్రార్థము.

రామకృష్ణులు సాందీపనితోడ వేదంబులం జదివిరి – వేదములను చదువుట ఉపయోగము. సాందీపని ఆఖ్యాత. కావున ఆఖ్యాతకు 'తోడ' వర్ణకము వచ్చి 'సాందీపనితోడ' అని యగును.

ఇట్లు కాని పక్షమున, అపాయ, భయ, జుగుప్స, పరాజయ, ప్రమాద, గ్రహణ... (బాల – 9) సూత్రమును బట్టి గ్రహ్యాది యోగజమైన పంచమికి 'వలన' అను ప్రత్యయము వచ్చి 'సాందీపని వలన' అనియు రూపము కలుగవచ్చును.

### 5. సంప్రదానంబునకుం జతుర్థి యగు. (కారక–8)

**వ్యాఖ్య :** త్యాగ + ఉద్దేశము – త్యాగోద్దేశము. త్యాగమునకు నుద్దేశింపబడిన వ్యక్తి. ఏదైన వస్తువును దానముగా నిచ్చుటకు ఏ వ్యక్తి యుద్దేశింపబడునో ఆవ్యక్తి సంప్రదానము. జనకుండు రాముని కొఱకుఁ గన్యనిచ్చెను – ఈ యుదాహరణ మందు కన్య నిచ్చుటకు లక్షింపబడినవాడు రాముడు. కావున రాముడు సంప్రదానము. సంప్రదానమునకు చతుర్థి విభక్తి యగునను ప్రస్తుత

సూత్రమువలన 'రాముడు' అను శబ్దమునకు పిమ్మట చతుర్థీ విభక్తి యగును. కొఱకు, కయి- అనునవి చతుర్థీ విభక్తి ప్రత్యయములు, కాబట్టి రాముని కొఱకు, రామునికయి-అనురూపములు కలుగును.

కొన్ని చోట్ల త్యాగము యొక్క ప్రసక్తి లేకపోయినప్పటికిని లక్షింపబడిన వ్యక్తికి చతుర్థి యగును. పురుషార్థంబు కొఱకు యత్నింపవలయు - ఈ యుదాహరణమునందు త్యాగముయొక్క ప్రసక్తి లేదు. యత్నమునకు లభ్యమైనది పురుషార్థము. కావున చతుర్థి విభక్తి ప్రత్యయము కలిగి 'పురుషార్థము కొఱకు' అని యైనది.

ప్రయోగములం దెక్కువగా చతుర్థీ విభక్తితోడి రూపములు కాక షష్ఠీ విభక్తి తోడి రూపముల

ే కనిపించుచుండుటచేత సూరి ఆ విషయమును గూడ చెప్పుచున్నాడు. సంస్కృతమునందైనచో చతుర్థీ విభక్తి వాడినప్పటికంటె షష్ఠీ విభక్తి వాడి నప్పుడు ఉద్దేశమునందు భేదము కనుపట్టును. తెలుగున అట్టి భేద మేమాత్రమును లేదు. పైగా షష్ఠిని వాడుటయే యెక్కువ. జనకుండు రామునకుఁ గన్య నిచ్చెను - ఇచ్చట సంప్రదాన మగు 'రాముడు' అను శబ్దమునకు షష్ఠీ ప్రత్యయమైన 'కు' వర్ణకము కలిగి 'రామునకు' అని యైనది. అట్లే ఉద్దేశమాత్ర మయినది 'పురుషార్థము'. దానికిని 'కు' ప్రత్యయము కలిగి, పురుషార్థంబునకు యత్నింపవలయు - అని యయ్యెను.

### 6. కంటె వర్ణకం బన్యార్థాదియోగజంబగు పంచమి కగు. (కారక-12)

**వ్యాఖ్య :** అన్యము, ఇతరము మున్నగు పదముల యర్థములతో కూడియుండునప్పుడు వచ్చు పంచమీ విభక్తికి 'కంటె' అను ప్రత్యయము వచ్చునని సూత్రార్థము.

ఉదా: రాముని కంటె నన్యుండు ధానుష్కుండు లేఁడు.

రాముని యొక్క ధనుర్విద్యా పాండిత్యము ప్రస్తుత విషయము. దీని సర్వోత్తమత్వము తెలియుటకు అన్యుల యొక్క ప్రసక్తియు, తిరస్కృతియు నవసరములు. అట్టి యెడల ప్రస్తుతమునకు పైని 'కంటె' అను ప్రత్యయము వచ్చును. కావుననే 'రాముని కంటె' అని యైనది. అట్లే దోషములలో గొప్పది లోభము; ఇతరము లంతటివి కావు - అని చెప్పవలసి వచ్చినపుడు ప్రస్తుతమగు 'లోభము' నకు కంటె వర్ణకము కలిగి 'లోభము కంటె' అని యయ్యెను.

ఇటువంటి చోట్ల 'రామునికంటె' అని యనుటకు బదులుగా "రామునకు' అని 'కు' వర్ణకముతోడి ప్రయోగములును గలవు.

### 7. పట్టి వర్ణకంబు హేతువులగు గుణక్రియల కగు. (కారక-14)

**వ్యాఖ్య :** హేతువనగా కారణము. ఒక కార్యము సిద్ధించుటకు కారణములుగా వ్యవహరించిన

గుణవాచకములకును, క్రియావాచకములకును పై ని 'పట్టి' యను ప్రత్యయము కలుగునని సూత్రార్థము.

జ్ఞానముఁబట్టి ముక్తుఁడగు – ఇచ్చట ముక్తు డగుట యన్నది కార్యము. దీనికి కారణము జ్ఞానము. ఇది గుణవాచకము, కావున దీనికి పిమ్మట 'పట్టి'యను పంచమీవిభక్తి ప్రత్యయము కలిగినది. నీవు వచ్చుటంబట్టి ధన్యుండనైతి – ఇచ్చట ధన్యుడ నగుట యన్నది కార్యము. దీనికి కారణము వచ్చుట. ఇది క్రియా వాచకము. కావున దీనికిని 'పట్టి' వర్ణకము కలిగినది.

ఈ రెండు చోట్లను 'పట్టి' వర్ణకమునకు ముందు నుగాగమము కలుగుచున్నది. సూరి బాల వ్యాకరణము నందెచ్చటను దానిని సూత్రముచే విధింపలేదు. తాను వ్రాసిన సంస్కృత సూత్రాంధ్ర వ్యాకరణమునందు 'నుక్పట్టి విభక్తౌ' అని యొక సూత్రమును వ్రాసెను. పట్టి పరమగుచుండగా

నుగాగమమగునని దాని యర్థము. తెలుగున వ్రాసిన శబ్ద లక్ష్మణ సంగ్రహము నందును నుగాగమమును గూర్చి తెల్పుచు 'పట్టి విభ క్తి రానగు' నని తెల్పియున్నాడు. బాలవ్యాకరణమునందు సూత్రవిధి లేకున్నను లక్ష్యములయందు నుగాగమము పొందుపడి యేయున్నది. కావున దానిని గ్రహించుట యావశ్యకము.

జ్ఞానము + పట్టి – అని యుండగా నడుమ ను వర్ణము వచ్చి జ్ఞానము + ను – పట్టి – అనియై ద్రుతకార్యము జరిగి జ్ఞానముఁ బట్టి; జ్ఞానముంబట్టి; జ్ఞానమున్బట్టి; జ్ఞానమునుబట్టి అను రూపము లేర్పడును. అట్లే వచ్చుట + పట్టి యనునది కూడ నుగాగను ప్రాప్తి చేత వచ్చుటఁబట్టి; వచ్చుటంబట్టి; వచ్చుటన్బట్టి; వచ్చుటనుబట్టి యని యగును.

పట్టి వర్ణకము రాని యెడల 'వలన' వర్ణకము రావచ్చును. అప్పుడు జ్ఞానమువలన ముక్తుదగు; వచ్చుటవలన ధన్యుదనయితి మున్నగు విధముగా రూపములుండును.

(నిజమునకు పట్టి' యనునదికూడ కూర్చి, గుఱించి మున్నగువాని శ్రేణిలో చేరవలసినదే. వానికి వాలెనే, దీనికిని ప్రాతిపదిక పై చేరెడి లక్షణము లేదు. పైగా 'పట్టు' అను ధాతువుయొక్క క్త్వార్థకరూపముగా స్పష్టముగా తెలియుచునేయున్నది. ఎప్పుడును ద్వితీయాంతమైన రూపము పైనే చేరుచుండుట కూడ దీని క్రియారూపమునే స్థిరీకరించుచున్నది. జ్ఞానమునుబట్టి అని యన్నప్పుడు జ్ఞానము కర్మమగుచున్నది. కావుననే ద్వితీయా ప్రత్యయమైన ను వర్ణకము కలుగుచున్నది. 'పట్టి' యనగా 'ఆధారము చేసికొని' యని యర్ధము. కావున, ఇక్కడి 'ను' వర్ణము ద్వితీయావిభక్తి ప్రత్యయమే కాని, ఆగమము కాదు. అందుచేత సూరి కూర్చి, గురించి మున్నగువానిని ప్రత్యయముల పరిగణనము నుండి విడిచి పెట్టినట్లే 'పట్టి' ని గూడ విడిచి పెట్టియుండిన సమంజసముగా నుండెడిది. అప్పు డాయన ప్రణాళికకు మఱింత బలము చేకూరెడిది.)

### 8. శేష షష్ఠికి యొక్కయు నగు. (కారక – 15)

**వ్యాఖ్య :** సంబంధమును తెలియ జేయునప్పుడు షష్ఠి విభక్తియైన 'యొక్క' యను ప్రత్యయము

కలుగునని సూత్రార్థము, 'యొక్కయు' అని సూత్రము నందు సముచ్చయార్థకమును గూడ వాడియుండుట చేత పూర్వలక్ష్యములను బట్టి పరిచిత మయిన కువర్ణకము కూడ పెక్కు చోట్ల కలుగునని సూచన చేయుట కలదు.

రాముని యొక్క గుణములు – అని యన్నప్పుడు రామునికి సంబంధించిన గుణములని యర్థము. రామునికిని గుణములకును గల సంబంధమును తెలియ జేయుటయే విషయము. కావున 'యొక్క' యను ప్రత్యయము కలిగినది. నాయొక్క మిత్రుఁడు – మున్నగుచోట్ల సైతము సంబంధమే ప్రధానాంశము. కావున సంబంధివాచకము మీద, షష్ఠి ప్రత్యయమైన 'యొక్క' వచ్చెను. ఇట్టిచోట్ల కువర్ణకముకూడ కలుగవచ్చును'. కావున 'నాకు మిత్రుఁడు' మున్నగు విధముగా కూడ ప్రయోగింపవచ్చును.

### 9. అధికరణంబునకు సప్తమి యగు. (కారక-17)

**వ్యాఖ్య –** అధికరణము అని యనగా ఆధారమని యర్థము. ఆధారము మూడు విధములుగా

నుండును. 1. ఔపశ్లేషికము – కూడియుండునది. ఘటమందు జలమున్నది – ఇచ్చట ఘటము ఆధారము. ఇది జలమునకు అత్యంత సన్నిహితముగా కూడి యున్నది. అందువలన నౌపశ్లేషికాధారము. కాబట్టి ఆధార వాచకమునకు సప్తమీవిభక్తి యగు 'అందు' వర్ణకముచేరి 'ఘటమందు' అనియైనది. 2. వైషయికము – విషయసంబంధము గలది. మోక్షమం దిచ్చ గలదు – ఇచ్చట ఇచ్ఛ విషయము. దీనితో సంబంధముగల యాధారము మోక్షము. కావున నది వైషయి కాధారము. దానికి సప్తమీ కలుగగా 'మోక్షమందు' అని యయ్యెను. 3. అభివ్యాపకము – అంతటను వ్యాపించి యుండుట. అన్నింటియం దీశ్వరుండు గలఁడు – ఇచ్చట ఈశ్వరుడు సర్వవ్యాపకుడు. అట్టి సర్వవ్యాపకునికి ఆధారము 'అన్ని'. కావుననే సప్తమి కలిగి 'అన్నింటియందు' అని యయ్యెను.

(సూత్రమునందు "సప్తమి యగు" అని మాత్రమే కలదు. అందు, న- అను రెండును సప్తమీ విభక్తి ప్రత్యయములే. ఉదాహరణములందు ఒక్క "అందు' అను ప్రత్యయము తోడి రూపములు మాత్రమే చూపబడినవి. కాని 'న' వర్తకముతోడి రూపములను చూపలేదు. అందు వర్ణకము వాడినచోట్ల నెల్ల న వర్ణకమునుగూడ వాడవచ్చునా? ఈ ప్రశ్నకు సమాధానముగ తరువాతి సూత్రము వ్యవహరించును.)

### 10. ఒకానొకచో నొక విభక్తికి మఱియొక విభక్తియు నగు. (కారక-21)

**వ్యాఖ్య :** నిర్దిష్టములయిన కొన్ని చోట్ల ఒక విభక్తి కలుగవలసియుండగా, దానితో పాటు మఱియొక విభక్తియు కలుగుట కలదని సూత్రార్థము.

మైత్రుండు గృహమును వెడలెను – ఇట విశేషము గలదు. కావున 'వలన' అను పత్యయము

కలిగి, దానిపై 'ఉండి' శబ్ద మనుప్రయుక్తము కావలయును. అప్పుడు 'వలన'కు బదులుగా ద్వితీయ కలిగి 'గృహమునుండి' యని కాని, సప్తమి కలుగగా 'గృహమున నుండి' యని కాని 'గృహము నందుండి' యని కాని యగును. అట్లుకాక 'గృహము' పై 'ను' వర్ణకము మాత్రమే చేరి 'గృహమును' అనియే యిచ్చట నున్నది. ఇది విశేషము. ఇట్టిదే 'వాహనము నుండి' అని యనుటకు బదులుగా నేర్పడిన 'వాహనమును' అను రూపముకూడ. 'ఇచ్చట ఈ రెండును వాక్యమునందు కర్మములుగా వ్యవహరించుటచేత "కర్మంబున ద్వితీయ యగు" అను విధిని బట్టి ద్వితీయా విభక్తి ప్రత్యయమగు నువర్ణకము చేరుచున్నది.

వారు సుఖ మున్నారు – ఇట సహార్థమున తోడ వర్ణకము రావలయును. అప్పుడు 'వారు సుఖముతోడ నున్నారు' అను రూపమేర్పడును. ప్రథమ వర్ణము శేషించినప్పుడు 'వారు సుఖముతో నున్నారు' అని యగును. కాని యిచ్చట తృతీయకు బదులుగా ప్రథమ వచ్చి 'సుఖమున్నారు' అని యగుట విశేషము.

### 11. జడంబు ద్వితీయకుం బ్రథమ బహుళంబుగా నగు. (కారక-24)

**వ్యాఖ్య** – జడము యొక్క ద్వితీయా విభక్తికి బదులుగా ప్రథమావిభక్తి బహుళముగా నగునని

సూత్రార్థము.

వాఁడు పూవులను దెచ్చె – ఈ వాక్యమునందు కర్మము 'పూవులు'. కావున ద్వితీయా విభక

్తి యగు 'ను' వర్ణకము వచ్చి 'పూవులను' అని యయ్యెను. ప్రస్తుత సూత్రమువలన ద్వితీయకు ప్రథమ కలుగవచ్చును. కావున 'వాఁడు పూవులు దెచ్చె' అనియు నుండవచ్చును.

'సొమ్ములు' అనునది వాక్యమున కర్మమైనపుడు 'సొమ్ములను' అని యగును. కాని కర్మము జడవాచకమగుట వలన ద్వితీయకు ప్రథమయై "సొమ్ములు దాల్చె' అను విధముగను నుండవచ్చును. 'ఇల్లు' అను కర్మమునకు ద్వితీయా విభక్తి కలిగి 'ఇంటిని' అని యగును. 'ఇల్లు' జడవాచక మగుటవలన, ప్రస్తుత సూత్రము చేత ద్వితీయకు ప్రథమయై 'వాఁడిల్లు వెడలెను' అనియు కావచ్చును.

సూత్రమున 'బహుళము' అని నిబంధించుట చేత, ఈ మార్పు సహజమైన ద్వితీయా విభక్తికి, అనగా కర్మార్థమున వచ్చిన ద్వితీయా విభక్తికి మాత్రమే కలుగును. అంతేకాని తృతీయాసప్తములకు బదులుగా వచ్చిన ద్వితీయకు రాదు. కావున అట్టి యెడల ప్రథమావిభక్తి కలుగు నవకాశము లేదని సూరి జ్ఞాపనము చేయుచున్నాడు.

### 12. ఒకానొకచో విశేషణంబుల షష్ఠికిం బ్రథమ విభాష నగు. (కారక-27)

**వ్యాఖ్య –** విశేష్యము షష్ఠీవిభక్త్యంతమై యున్నపుడు, దాని విశేషణము కొన్ని నిర్దిష్ట ప్రదేశములందు విభాషగా ప్రథ మాంతముగా నుండవచ్చునని సూత్రార్థము.

'రామునకు' అనునది విశేష్యము; ఏకవచనము; షష్ఠీ ప్రత్యయాంతము, కావున సూత్రము విశేష్యమునకుఁబోలె విశేషణంబునకు లింగ విభక్తి వచనంబులగు.(కారక–19) అను సూత్రమునుబట్టి దీని విశేషణము కూడ ఏక వచనమున షష్ఠీ ప్రత్యయాంతమునై యుండవలయును. అప్పుడు 'సుగుణాభిరామునకు రామునకు' అను విధముగా ప్రయోగముండును. ప్రస్తుత సూత్రమును బట్టి విశేషణము యొక్క షష్ఠికి బదులు ప్రథమ రాగా 'సుగుణాభి రాముఁడు రామునకు' అని యగుమ. సూత్రమున 'విభాషనగు' నని యనుటచేత ప్రథమరాని పక్షమున షష్ఠియే యుండును.

### 13. భవత్యర్థవ్యవహితంబులగు విశేషణంబులకుం బ్రథమ యగు. (కారక–28)

**వ్యాఖ్య –** భవతి + అర్థము = భవత్యర్థము = అగు, అయిన మున్నగు నర్థములనుగలది. వ్యవహితమని యనగా వేఱు పఱుపబడినదని యర్థము.

భవత్యర్థములగు అగు, అయిన మున్నగు పదములచే విశేష్యమునుండి వేరుపరుపబడిన విశేషణములకు ప్రథమావిభక్తి యగునని సూత్రార్థము. 'పురుషుని' అనునది వాక్యమున కర్మము; కావున ద్వితీయా విభక్తిని గలిగియున్నది. విశేష్యమునకుఁబోలె విశేషణంబునకు లింగ విభక్తి వచనంబులగు సూత్రమును బట్టి దీని విశేషణము కూడ ద్వితీయా విభక్తిని గలిగి యున్నచో "విద్యాశాలిని బురుషుని" అను విధముగా నుండవలయును. ప్రస్తుతోదాహరణమునందు 'పురుషుని'

అను విశేష్యమునకును 'విద్యాశాలిని' అను విశేషణమునకును నడుమ 'అగు' అను భవత్యర్థకము ప్రవేశించి వ్యవధానమును కలుగజేయు చున్నది. కావున విశేషణమునకు ప్రథమయై "విద్యాశాలియగు పురుషుని" అనియే ప్రయోగము నందినది.

'మహాత్ములకు' అను షష్ఠీ విభక్త్యంతము విశేష్యమైనప్పుడు సైతము భవత్యర్థకముచే వేరుపరుపబడి యుండుటవలన, దాని విశేషణము ప్రథమావిభక్తిని పొంది "భూతదయాళురగు మహాత్ములకు" అను విధముగా ప్రయోగింపబడినది. 'కేశవార్జున కృతిన్' అనునది ద్వితీయాంత విశేష్యము. దీనికి పూర్వమందు అతిమానుషము, అత్యద్భుతము, అతిదుష్కరము – అని మూడు విశేషణములు గలవు. అన్నింటికి చివరనున్న విశేషణమునకును విశేష్యమునకును నడుమ 'అయిన' అను భవత్యర్థకము వచ్చినది. కావుననే ఆ విశేషణములన్నియు ప్రథమాంతములుగా ప్రయుక్తములయినవి.

**14. భావార్థకాదియోగంబునం గర్తకుం బ్రథమ యగు. (కారక-32)**

**వ్యాఖ్య** - భావార్థకము మున్నగువానితో కూడియున్నప్పుడు కర్తకు ప్రథమావిభక్తి యగునని సూత్రార్థము. ధాతువు యొక్క అర్థము భావము. “ట వర్ణంబు భావంబునం దగు”(క్రియా-35) అను క్రియాపరిచ్ఛేద సూత్రమును బట్టి వచ్చుట, వండుట మున్నగునవి భావార్థకములు. వ్యతిరేక భావార్థకములు రామి, వండమి మున్నగునవి. “భావార్థకాది యోగంబున” అని సూత్రమునం దాది శబ్దమును నిబంధించుట చేత ‘రాఁగా’ మున్నగు నుజ్యంతరూపములును, ‘అందినన్’ మున్నగు చేదర్థక రూపములును, ‘పట్టిన’ మున్నగు ధాతుజ విశేషణములును గూడ గ్రహింపబడుచున్నవి. కావున, ఈ సూత్రమున అసమాపక క్రియలకు కర్తయైన శబ్దము యొక్క స్థితి బోధింప బడుచున్నది.

రాముఁడు వచ్చుట - ఇచ్చుట ‘వచ్చుట’ యన్నది భావార్థకము; వచ్చుట యను క్రియను బోధించుచున్నది. వచ్చుటకు కర్త రాముఁడు. కావున, ప్రథమా విభక్తి యయ్యెను. అట్లే తక్కిన యుదాహరణములందును వాక్యమునందలి క్రియయు, దానితో నన్వయముగల కర్తయు వేరుగా నుండగా అసమాపక క్రియ యొక్క కర్త వేరుగా నుండును. అప్పుడు కూడ అక్కడి కర్తకు ప్రథమ యగును. ‘రాముఁడు రాఁగా లమ్మణుఁడు గాంచె’ అన్న లక్ష్యమునందు ప్రధానమగు క్రియ కాంచె; వాక్యమునందలి కర్త సమాపక క్రియతో నన్వయించెడి ‘లక్ష్మణుఁడు’. అసమాపక క్రియ యగు ‘రాఁగా’ అనుదానితో అన్వయముగల కర్త “రాముఁడు’ అనునది. కావున, వాక్యమునందలి ప్రధానకర్తతో నిమిత్తము లేకుండ, అసమాపక క్రియాన్వయము గల కర్తకు కూడ ప్రథమ యగుచుండుట యిక్కడ విషయము.

-0-

## 3. <u>సమాస పరిచ్ఛేదము</u>

**1. సమర్థంబు లగు పదంబు లేక పదం బగుట సమాసంబు. (సమాస-1)**

**వ్యాఖ్య** - సామర్థ్యము గలిగిన భిన్న పదములొకే పదమైనచో సమాసమగునని యర్థము. సామర్థ్యము అనునది వ్యాకరణ శాస్త్రమున రెండు విధములుగా నుండును. 1. వ్యపేక్షా సామర్థ్యము 2 ఏకార్థీ భావ సామర్థ్యము. ఒక వాక్యమునందలి భిన్న భిన్న పదములకు గల యన్వయము వ్యపేక్షా సామర్థ్యము. ‘రాముఁడు రావణుని సంహరించెను’ అని యన్నప్పుడు క్రియ ‘సంహరించెను’ అనునది. ‘ఎవరు?’ అని ప్రశ్న వేయగా ‘రాముడు’ అను సమాధానము వచ్చును. ‘ఎవరిని?’ అని ప్రశ్న వేయగా ‘రావణుని’ అను సమాధానము వచ్చును. కావున ఏకవాక్యమునందు ఆకాంక్షను బట్టి వేర్వేరు పదముల కొక సంబంధము స్పష్టమగును. ఇట్టి ఆకాంక్ష వలన ఏర్పడిన సంబంధమునకు వ్యపేక్షాసామర్థ్యము అని పేరు. ఇది వాక్యవిషయము.

రెండవది ఏకార్థీభావసామర్థ్యము. దానినే సూరి “పృథగ్భూతంబులగు నర్థంబుల కేకార్థీభావంబు సామర్థ్యం.” మున్నగు విధముగా వివరించెను. పృథ గ్భూతంబు లగు నర్థంబులు అని యనగా

వేర్వేరుగా నున్న యర్థము లని యర్థము: వీనికి ఏకార్థీభావము సామర్థ్యము. ఏకార్థీ భావము అని యనగా ఒకే యర్థమునందు అన్వయమును గలిగించుట అని యర్థము. దీనినే మరల వివరించెను. వేర్వేరుగా ప్రసిద్ధము లయిన యర్థములు గలిగిన పదములను ఏకార్థమునందు వర్తింపజేయుట సామర్థ్యము. అట్లేర్పడిన భిన్న పదముల సముదాయ రూపమునకు సమాసము అని పేరు. 'రాజనందనుఁడు' అనునప్పుడు 'రాజు' అని 'నందనుఁడు' అని రెండు శబ్దములు గలవు. రాజు అనగా ప్రభువని యర్థము. నందనుఁడనగా కొడు కని యర్థము. ఈ రెండింటికిని వేర్వేరుగా వేర్వేరర్థములు గలవు. రెండింటిని 'రాజు యొక్క నందనుఁడు' అను నర్థమున వర్తింపజేసినపుడు సమాస మగును. ఇది ఏకార్థీభావసామర్థ్యము. సమాసవిషయమగుట చేత సూరి దీని నే వివరించెను.

**2. సాంస్కృతి కాచ్ఛిక మిశ్ర భేదంబుచే సమాసంబు త్రివిధంబు. (సమాస-2)**

వ్యాఖ్య – సమాసమునందు పదములను బట్టి సమాసములు మూడు విధములుగా నుండును. మొదటిది సాంస్కృతికము. ఇది మరల రెండు విధములు. 1. సిద్ధము. 2. సాధ్యము. కేవల సంస్కృతపదములతో నేర్పడిన సమాసమునకు సిద్ధసమాసము అని పేరు. 'రాజాజ్ఞ' అని యనినప్పుడు రాజా + ఆజ్ఞా అని విభాగింపవలయును. రాజ్ఞః (రాజుయొక్క) ఆజ్ఞా (ఆనతి) అని దీనికి విగ్రహము. ఇది సమాస మగునపుడు నడుమ సవర్ణ దీర్ఘ సంధి కలుగును. 'రాజాజ్ఞా' అని యగును. ఇంత వరకు సంస్కృతవ్యాకరణ విధానము ననుసరించియే యీ రూప మేర్పడినది. తెనుగున సాధారణముగా దీర్ఘాంతశబ్దము లుండవు. "నామంబుల తుది దీర్ఘంబునకు హ్రస్వంబగు"అను సూత్రమును బట్టి కడపటి దీర్ఘమునకు హ్రస్వము కలుగగా 'రాజాజ్ఞ' అను రూపము సిద్ధించును. ఇట్లే తటాక + ఉదకః అను పదములకు సామర్థ్యమువలన సమాసత్వము కలిగినది. గుణసంధి కలుగగా 'తటాకోదకః' అని యైనది. ఇంతవరకు సంస్కృత వ్యాకరణమునే యనుసరించితిమి. ఇప్పుడు 'ఉదకః' అనునది తెలుగున అమహ ద్వాచక మగుటవలన "అమహన్న పుంసకముల కదంతములకు మువర్ణకం బగు" అను సూత్రమునుబట్టి కడపట ముదర్ణ కమును చేర్తుము. ఇప్పుడు 'తటాకోదకము' అను రూప మేర్పడును. ఇట్లే లక్ష్మీ + వల్లభః అను రెండుపదములును సమసింపగా 'లక్ష్మీ వల్లభః' అని యగును. ఇంతవరకు సంస్కృతసంప్రదాయము. పై సమాసమునకు 'విష్ణువు' అని యర్థము, కావున మహద్వాచకము; సంస్కృతమున 'వల్లభ' యనునది పుంలింగ శబ్దము; కావున పుంలింగం బయి మహద్వాచకం బయిన శబ్దములకు 'ఉత్వడుజ్ఞులు' కలుగునను విధి చేత 'లక్ష్మీవల్లభుఁడు' అను రూప వేర్పడును. సంస్కృత వ్యాకరణసంప్రదాయము ననుసరించి సంస్కృత పదముల కైన సమాసము సిద్ధసమాసము. సమాసాంతమున మాత్రమే తెలుగు వ్యాకరణమునుబట్టి కొలది మార్పులు జరుగును.

సాధ్యసమాసమునుగూర్చి చూతము. తత్సమపదములతో నేర్పడు సమాసము సాధ్యము.

రాజు + ఆజ్ఞ – ఇందు రెండు పదములును తత్సమములే. రాజుయొక్క ఆజ్ఞ యని విగ్రహము చెప్పుకొనవలయును. కావున "షష్ఠీ సమాసంబున నుకార ఋకారంబుల కచ్చు పరం బగునపుడు నుగాగమంబగు" నను విధి చేత రాజు + ను + ఆజ్ఞ = రాజునాజ్ఞ అని యగును. ఇట్లే తటాకంబు + ఉదకము అని యుండగా నుగాగమము గలిగి 'తటాకంబునుదకము' అని యగును. లక్ష్మీ + వల్లభుఁడు అనునప్పుడు మార్పేమియు లేకుండ 'లక్ష్మీవల్లభుఁడు' అని యగును. వీని యందలి పదములు తత్సమములు. అనగా సంస్కృతనామములు ఆంగికము లయిన మార్పులు లేకుండ తెనుగు విభక్తులను బొంది శబ్దములుగా ఏర్పడినవి. కావుననే వీనికి సంధిచేయునపుడు తెలుగునందలి సంధివిధానమునే యనుసరింపవలయును. ఇట్లేర్పడిన సమాసములను సాధ్యములని యందురు. ఇంతవరకు చెప్పి కొనిన సిద్ధములు సాధ్యములును – రెండును సాంస్కృతిక సమాసములే.

రెండవది ఆచ్ఛికము. అచ్చ తెనుగుపదముల చేత నేర్పడు సమాసమునకు ఆచ్ఛికమని పేరు. 'తేనియొక్క ఆనతి' అను నర్థమున తేని + ఆనతి అను రెండుపదము లుండును. ఇచ్చటి మాటలు రెండును ఆచ్ఛికములే. ఇచ్చట సంధి లేనందువలన "సంధి లేనిచో స్వరంబు కంటెం బరం బయిన స్వరంబునకు యడాగమం బగు" అను విధి చేత ఆగమయకారము కలిగి తేని + య్ + ఆనతి = తేనియానతి అని యగును. చెఱువు + నీరు, సిరి + చెలువుఁడు – ఇక్కడి పదము లన్నియు అచ్చ తెలుగులే. ఉత్తరపదము మొదట హల్లుండుటచే సంధి ప్రసక్తి లేదు. కావున యథాతథముగనే ఆ పదములకు సమాసత్వము కలిగినది. ఇట్టి వానిని ఆచ్ఛిక సమాసములని యందురు. వీనినే పూర్వ వ్యాకర్తలు 'సమాసకములు' అని పేర్కొనిరి.

మూడవ భేదము మిశ్రసమాసము. తత్సమంబులకును ఆచ్ఛికంబులకును గలిగిన సమాసమును మిశ్రము అని యందురు. రాజు + ముదల. ఇచ్చట పూర్వశబ్దము తత్సమము; ఉత్తర శబ్దము తెనుగు. రెండింటికి 'రాజుముదల' అను రూపమున సమాస మేర్పడినది. చెఱువు + ఉదకము; సిరి + వల్ల భుఁడు. ఇచ్చట పూర్వశబ్దములు అచ్చ తెలుగులు; ఉత్తర శబ్దములు తత్సమములు. తత్సమాచ్ఛికములకు రెండింటికి నైన సమాసము లగుటవలన వీనికి మిశ్రసమాసములని పేరు.

### 3. తత్పురుషాదులకు లక్షణంబు ప్రాయికంబుగ సంస్కృతోక్తంబ యగు. (సమాస-3)

**వ్యాఖ్య –** తెలుగునందు గల తత్పురుష మున్నగు సమాసములయొక్క లక్షణము తరుచుగా సంస్కృతమునందాయా సమాసముల కెట్లు చెప్పిరో యట్లే యుండునని యర్థము. వివరణమునందు సూరి వానిని స్పష్టముచేసెను.

అర్థమునుబట్టి సమాసములు మూడు విధములుగా నుండును. సాధారణముగా ఉత్తరపదార్థ ప్రాధాన్యము గల వానిని తత్పురుష సమాసములని యందురు. అన్యపదార్థ ప్రాధాన్యము గలవానిని బహుమ్రీహి సమాసములని యందురు. ఉభయపదార్థ ప్రాధాన్యము గలవానిని ద్వంద్వ సమాసములని

యందురు.

తత్పురుష సమాసము మరల రెండు రకములుగా నుండును.

1. వ్యధికరణము – ద్వితీయాది విభక్త్యంతములు మీది పదముతో సమసించిన యెడల వ్యధికరణ మగును. దీనికే తత్పురుష మను పేరు రూఢమై యున్నది. 'నెలతాల్పు' అనునప్పుడు "నెలను ధరించువాఁడు' అని యర్థము. ఇందలి పూర్వపదము ద్వితీయా విభక్త్యంతము. కావున దీనిని ద్వితీయా తత్పురుష మని యందురు. 'నెలతక్కువవాఁడు' అనగా 'నెల చేత తక్కు వైనవాఁడు' అని యర్థము. ఇందలి పూర్వపదము తృతీయా విభక్త్యంతము. కావున దీనిని తృతీయా తత్పురుష మని యందురు. ఇట్లే పూర్వపదము ద్వితీయాదివిభ క్త్యంతమై తరువాతి పదముతో సమసింపగా తత్పురుష సమాస మగును. భిన్న విభక్తుల కేర్పడిన సమాసమగుటచే దీనికి వ్యధికరణసమాసమను పేరు కలిగెను.

2. సమానాధికరణము: విశేషణమునకు విశేష్యముతోడ సమాసము సమానాధికరణము అని సూరి నిర్వచించెను. పూర్వ పదము విశేషణమును, ఉత్తరపదము విశేష్యము నైనయెడల వానివలన నేర్పడిన సమాసము సమానాధికరణ మనిపించు కొనును. ఇందలి పూర్వపదము ప్రథమాంతమై కాని స్త్రీసమమై కాని యుండుననుట గమనార్హము. సరసము + వచనము – అనునప్పుడు పూర్వపదము విశేషణము; ప్రథమావిభక్త్యంతము. 'కర్మధారయంబుల మువర్ణకంబునకుం బుంపు లగు' అను సూత్రమునుబట్టి సరసపువచనము అని యగును. సమాసము నందు 'వచనము' అను నుత్తర పదమునకే అర్థమునుబట్టి ప్రాధాన్యము గలదు. 'సరసము' అను ముందరిపదము తరువాతి పదము యొక్క విశేషమును మాత్రమే తెలియజేయును. ఇట్లే తెల్ల + గుఱ్ఱము; మంచి + రాజు మున్నగువానియందు కూడ పూర్వపదములు విశేషణములు; ఉత్తరపదములు విశేష్యములు. ఈ రెండింటికినైన సమాసము లగుటవలన సమానాధికరణములే యగును. సమానాధికరణసమాసమునే కర్మధారయసమాసమని కూడ అందురు.

ఇందులో ఇంకొక అవాంతర భేదము కూడ కలదు. ఇందలి పూర్వపదము సంఖ్యావిశేషణమై తరువాతి పదమగు విశేష్యముతో సమసించిన యెడల దానిని ద్విగుసమాసమని యందురు. మూఁడు + జగములు – అని యన్నప్పుడు 'మూఁడు' సంఖ్యా విశేషణము. 'జగములు' విశేష్యము. ఈ రెండును సమసింపగా నేర్పడిన రూపము 'ముజ్జగములు' అనునది ద్విగుసమాసము.

ఇట్లే 'ముల్లోకములు' మున్నగు సమాసములను పేర్కొందురు.

మూఁడు + కన్నులు అను రెండు పదములు కలియగా 'ముక్కంటి' అను సమాస మేర్పడును. దీనికి మూఁడు కన్నులు గలవాడైన ఈశ్వరుఁడు అని యర్థము. సమాసము నందలి పూర్వశబ్దమునకు గాని, ఉత్తరశబ్దమునకు గాని అర్థమున ప్రాధాన్యము లేదు. మరేదో పదము యొక్క అర్థమునకు

ప్రాధాన్యము కలుగుచున్నది. కావుననే అన్యపదార్థ ప్రధానమైన వానిని సూరి బహువ్రీహిసమాసములని నిర్ణయించెను. 'చలి వెలుఁగు' అనునప్పుడు చల్లని వెలుగు కలవాడు అను నర్థము కలిగి 'చంద్రుఁడు' అను తాత్పర్యమును బోధించును. చలి + వెలుగు అను రెండు పదములును కాక అన్యపదమగు 'చంద్రుఁడు' అను పదము అర్థబోధయందు ప్రాధాన్యము వహించుటచే ఇదియు బహువ్రీహిసమాసమే యగును.

తల్లి + తండ్రి అను రెండు పదములును గలియుటచే 'తల్లిదండ్రులు' అను సమాసమేర్పడును. అర్థబోధయందు పూర్వపదమునకును ఉత్తరపదమునకును గూడ సమప్రాధాన్యము గలదు. ఇట్లు ఉభయపదార్థ ప్రధానములైనవానిని సూరి ద్వంద్వసమాసము లని నిర్ణయించెను. అన్నదమ్ములు, అక్క సెల్లెండ్రు – మున్నగునవి యిట్టి సమాసములు.

ఇంతవరకు సంస్కృతభాషయందు గల సమాసములను బోలిన సమాసములనే చూచితిమి. సూత్రమునందు 'ప్రాయికముగా' అని యుండుటచేత సంస్కృతమున కనుపట్టని సమాసములును తెలుగున గలవని సూరి సూచించెను.

ఉపమానోపమేయములకు నేర్పడినవి కూడ కర్మధారయ సమాసములే యగును. ఉపమానము ఉత్తరపదముగా నున్న యెడల ఉపమానోత్తరపదకర్మధారయము అని యందురు. ముఖ పద్మము – అనగా పద్మమువంటి ముఖము అని యర్థము. ముఖము ఉపమేయము; పద్మము ఉపమానము – ఉత్తరపదమై యున్నది. ఇట్టివే 'చరణకమలంబులు' మున్నగు సమాసములు. ఉపమానోత్తర పద కర్మధారయములు సంస్కృతము నందును గలవు.

దీనికి విపరీతములైనవి సంస్కృతమునందు లేవు. అనగా ఉపమానము పూర్వపదముగా నున్న కర్మధారయములు సంస్కృతమునందు లేవు కావున సాంస్కృతికములైన సిద్ధసమాసములు తెలుగునందు నుండుటకు వీలు లేదు. సంస్కృతమునందలి సమాసముల నన్నింటిని యథాతథముగా గ్రహించి, సమాసాంతమున తెలుగు సంప్రదాయమును బట్టి మార్పు చేసికొనవలయును. రాజపురుషః అన్న సంస్కృత సమాసము, మహత్పుంలింగ మగుటవలన ఉత్వదుజ్జులు కలిగి రాజపురుషుఁడు అని యగును. పీతాంబరః అనునది యిట్లే పీతాంబరుఁడు అని యగును. నీలోత్పలమ్ అనునది నపుంసక శబ్దము కావున తెలుగున ముువర్ణకము కలిగి నీలోత్పలము అని యగును. రామ లక్షణౌ అను ద్వంద్వ సమాసము తెలుగున ఉత్వమును, బహువచనములు ప్రత్యయమును పొంది రామలక్ష్మణులు అని యగును. "సిద్ధంబు సర్వంబు గ్రాహ్యంబు" అని యనుటవలన సంస్కృతమునందలి సర్వ సమాసములను గ్రహింపవచ్చును.

ఇంక, సంస్కృతమున నుండుటకు వీలు లేని ఉపమాన పూర్వపద కర్మధారయములు

తెలుగునందు మాత్రమే కలవు. చిగురువంటి కేలు అను నర్థమున 'చిగురుఁగేలు' అనియు, జున్ను (తేనె) వంటి మోవి అను నర్థమున 'జుంటిమోవి' అనియు సమాసములు గలవు. ఇందు పూర్వపదము ఉపమానములు; ఉత్తరపదములు ఉపమేయములు. కావున నివి ఉపమాన పూర్వపదకర్మధారయములు.

కేవల సంస్కృశశబ్దము వికృతిశబ్దముతోడ సమసింపదు. కేవల సంస్కృతశబ్ద మనగా తెలుగు విభక్తిని పొందని శబ్దమని యర్థము. తెలుగు విభక్తి చేరకుండ నున్న సంస్కృతశబ్దములు అచ్చ తెలుగు శబ్దముతో సమసింపవు. అనగా అట్లు సమాస ములుగా చేయరాదని యర్థము. అనేక + మాఱులు అని యున్నదనుకొందము. ఇందు పూర్వపదము సంస్కృతము; ఉత్తరపదము తెలుగు. కావున 'అనేకమాఱులు' మున్నగు విధముగా సమాసము చేయరాదు. ఇట్టి సమాసములను దుష్టసమాసములని శిష్టులు నిరసింతురు. వీనికే 'వైరిసమాసములు' అను పేరుకూడ కలదు. అల్పము + దండు అనునప్పుడు పూర్వపదము తత్సమము; ఉత్తరపదము ఆచ్ఛికము. సమాసమునందు పూర్వ పదము కొసనున్న మువర్ణకమునకు లోపము కలిగి 'అల్పదండు' అని యైనది. ఇదియు వైరిసమాసమే.

## 4. కర్మధారయంబు త్రిక స్త్రీసమ ముగంత ధాతుజ విశేషణ పూర్వ పదంబయి యుండు. (సమాస-5)

**వ్యాఖ్య –** కర్మధారయ సమాసమున త్రికము గాని, స్త్రీసమ పదముగాని, మువర్ణ కాంతపదము గాని, క్రియాజన్య విశేషణము గాని పూర్వపదముగా నుండి ఉత్తరపద మగు విశేష్యముతో సమసించును. దీనినిబట్టి పైని చెప్పినవానికి భిన్నములయిన పదములతో కర్మధారయ సమాసము కలుగదని నిశ్చితార్థము.

త్రికము = ఆ ఈ ఏ అను నిర్దేశాత్మక సర్వనామములు. ఆ + చందము; ఈ + చిందము; ఏ + బృందము. వీనియందు పూర్వపదములు నిర్దేశాత్మక సర్వనామములు

స్త్రీసమము – ప్రథమైక వచనము లోపించిన శబ్దము. వాఁడి+మాట; పోఁడి + పాట. వీనియందు పూర్వపదములు స్త్రీసమములు; వీని కడపట ప్రథమైకవచనమునందు కావలసిన మువర్ణము కాలేదు.

ముగంతము – ముక్ + అంతము అని విభాగము చేయవలయును. కర్మధారయమునందు పూర్వపదము మువర్ణకేతర విభక్తితో నుండు నవకాశము లేదు. అట్లున్నచో అది తత్పురుష సమాస మగును. కాని కర్మధారయము కాదు. మువర్ణకేతర విభక్తి పరమగునప్పుడు మాత్రమే ముగాగమ మగును. (బా.తత్సమ-40) కర్మధారయము నందు ముగాగమమునకు ప్రసక్తి యే లేదు. కావున 'ముగంతము' అనునప్పుడు ప్రకరణమునుబట్టి మువర్ణ కాంతమునే గ్రహింపవలయును. "అమహన్న పుంసకముల కదంతములకు మువర్ణకంబగు " (బా.తత్సమ – 39) అను సూత్రమునుబట్టి, మువర్ణకము కలిగిన శబ్దములకే యిక్కడ ప్రసక్తి కలదు. బెడిదము + అడిదము. పూర్వశబ్దము మువర్ణకాంతము.

కావున సమాసము కావచ్చును. "కర్మధారయంబుల మువర్ణకంబునకుం బుంపు లగు" (బా.సంధి – 32) అను, సూత్రముచేత బెడిదపు + అడిదము అని యైనది. తరువాత "కర్మధారయంబులం దుత్తున కచ్చు పరంబగునపుడు టుగాగమంబగు" (బా.సంధి – 28) అను సూత్రముచేత, బెడిదపు + టు + అడిదము = బెడిదపుటడిదము అని యైనది.

ధాతుజవిశేషణము – క్రియాపదమువలన నేర్పడిన విశేషణము. వచ్చిన – వచ్చుచున్న – వచ్చెడు – రాఁగల – రాని॥ మున్నగునవి ధాతుజ విశేషణముల కుదాహరణములు.

మడిసెడు + దడములు – ఇందు పూర్వపదము (మడియు + ఎడు) క్రియాజన్యవిశేషణము. కావున ఇదియు కర్మధారయ సమాసమునందు పూర్వపదముగా నుండవచ్చును.

పైన వివరించిన రీతిని కర్మధారయసమాసములుండుట కాక్షేపము లేదు; తద్భిన్నముగా నుండుటకు వీలులేదు. డువర్ణ కాంత వువర్ణ కాంత శబ్దముల వంటివి పూర్వపదములయినచో ఉత్తరపదమగు విశేష్యముతో సమసింపవు. బల్లిదుఁడు మల్లుఁడు – అని యన్నప్పుడు 'మల్లుఁడు' అను శబ్దము విశేష్యము; 'బల్లిదుఁడు' అను శబ్దము విశేషణము. విశేషణ విశేష్యము లుండుటవలన కర్మధారయసమాసమున కవకాశము కలదు. కాని, పూర్వశబ్దము త్రికాదులలోనిది కాక డువర్ణ కాంత మగుటవలన ఉత్తరపదముతో సమసింపదు. కావున రెండు పదములును వ్యస్తముగా (విడివిడిగా) నుండిపోవును.

### 5. స్త్రీ సమఘటితంబ యొకానొకండు బహుువ్రీహి చూపట్టెడు. (సమాస–6)

**వ్యాఖ్య–** తెలుగునందలి బహువ్రీహి సమాసము స్త్రీ సమఘటితమై కనుపట్టునని యర్థము. అనగా, బహువ్రీహి సమాసమునందలి పూర్వపదమును, ఉత్తరపదమును స్త్రీ సమములై యుండును – అని యర్థము.

మూఁడు + కన్నులు : ముక్కంటి. దీనికి మూడు కన్నులు గలవాఁడని యర్థము, 'ఈశ్వరుఁడు' అనునది తాత్పర్యార్థము. అన్యపదార్థ ప్రధానమను లక్షణమునకు సరిపడుటచే బహువ్రీహి సమాస మగుచున్నది. ఇందు పూర్వపదము 'మూడు' అనునది స్త్రీ సమము. 'కన్నులు' అను శబ్దము ప్రథమా విభక్త్యంత మగుటవలన స్త్రీ సమము కాదు. కాని "బహువ్రీహిని సమాసాంత కార్యంబులుం గానంబడియెడి"(సమాస – 22) సూత్రము వలన సమాసాంతకార్యములై 'కంటి' అని యగును. అప్పుడది స్త్రీ సమశబ్దమే యగును ॥ మూడు + కంటి. "సమానాధికరణం బగు నుత్తరపదంబు పరంబగునపుడు మూఁడు శబ్దంబు డువర్ణంబునకు లోపంబును మీఁదిహల్లునకు ద్విత్వంబునగు" అను (బా – 17) సూత్రముచేత డువర్ణము లోపించును; కకారమునకు ద్విత్వము కలుగును. మూ + క్కంటి. "ద్విరుక్తంబగు హల్లు పరంబగునపు డాచ్ఛికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు" అను (బా

– 18) సూత్రమువలన ము + క్కంటి = ముక్కంటి అని యగును.

ఇట్లే వేయి కన్నులు కలవాఁడు; వే + కంటి – వేగంటి యై, 'ఇంద్రుఁడు' అను నర్థమును బోధించును.

చలి + వెలుఁగు, చలివెలుఁగు, చంద్రుఁడని యర్థము. వేయి + వెలుఁగు = వే వెలుఁగు, సూర్యుఁడని యర్థము. ఇందు పూర్వోత్తర పదములు రెండును స్త్రీ సమములే.

మోట + బరువు. వువర్ణమున కాదేశముగా ఇవర్ణము కలిగి 'మోటబరి' అని యైనది. దీనికి బరువును, మోయు లక్షణముబట్టి 'ఎద్దు' అను అర్థము కలుగుచున్నది.

కావున వీని యన్నింటియందును పూర్వోత్తరపదములు స్త్రీ సమములై యుండెననియు, అన్య పదార్థమునకే ప్రాధాన్యము గలదనియు స్పష్టము. సూత్రమునందు 'ఒకానొకండు' అని యనుట చేత 'గట్టువిలుతుఁడు' మున్నగురీతి డువర్ణాంతములును లేకపోవు.

వ్యవహారసిద్ధములు = కావ్యవ్యవహారమునందును, లోక వ్యవహారమునందును స్థిరపడిన ప్రయోగములు. 'ప్రయోగ శరణం వ్యాకరణ' మ్మను సూక్తినిబట్టి, వ్యాకరణములో చూప బడని ప్రయోగములను లోకకావ్య వ్యవహారముల నుండి గ్రహింపవచ్చును. కావున బహువ్రీహీ యుదాహరణములను గొన్నింటిని జూపిన పిమ్మట సూరి వాడుక నుండి గ్రహింపుడని యనెను. పోలికనుబట్టి స్వతంత్రముగా కల్పింపక, పూర్వ ప్రయోగములను అనుసరింపుడను నియమముకూడ ఇందున్నది.

**6. ఆచ్ఛిక శబ్దంబుతోడ స్త్రీ సమంబు ప్రాయికంబుగా, ద్వంద్వం బగు. (సమాస–7)**

**వ్యాఖ్య –** ద్వంద్వ సమాసమునందు సాధారణముగా ఉత్తర పదము ఆచ్ఛికమై, పూర్వపదము స్త్రీసమమై యుండునని యర్థము. ఇది కేవలము ఆచ్ఛిక ద్వంద్వమునకు సంబంధించిన విషయము.

అన్న + తమ్ముఁడు. ఇర్వురికి ప్రాధాన్యముగల విషయము కావున 'లు' వర్ణము కలుగును. అన్న + తమ్ములు. ఇందు రెండును ఆచ్ఛికశబ్దములే. 'అన్న' యనునది స్త్రీ సమ శబ్దము. కావున పై లక్షణమునకు సరిపోయినది. "ద్వంద్వంబునం బదంబు పయి పరుషములకు గసడదవలగు" (బా. సంధి – 15) అను సూత్రము చేత 'అన్నదమ్ములు' అని యగుసు. తల్లి దండ్రులు – ఊరుపల్లెలు – ఆలుమగలు అను సమాసములన్నియు నిట్టివే.

మగఁడు + బిడ్డలు అను రెండు పదములున్న వనుకొందము. రెండును ఆచ్ఛికములే. పూర్వపదము డువర్ణకాంతము; స్త్రీసమము కానందువలన సమాసము కాదు. వ్యస్తముగానే యుండును. సముచ్చయార్థక మగు నువర్ణకము కలిగి 'మగఁడును బిడ్డలును' అని వ్యస్తముగనే యుండును. అట్లే

పల్లము + కళ్ళెము అను రెండు పదములును సమసింపవు. ఇందు పూర్వ పదము మువర్ణ కాంతము. కావున 'ను' అను సముచ్చయార్థకము కలిగి "పల్లమును గళ్ళెమును" అని వ్యస్తముగనే యుండును.

**7. త్రికంబుమీఁది యసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగా నగు. (సమాస-14)**

**వ్యాఖ్య –** త్రికము = ఆ ఈ ఏ అను నిర్దేశాత్మక సర్వనామములు. అసంయుక్త హల్లు = భిన్న హల్లుతో సంయోగము నొందని హల్లు. క – ల – య మున్నగునవి యుదాహరణములు.

త్రికమునకు పరమందున్న పదము యొక్క మొదటియక్షరము సంయుక్తాక్షరము కాని యెడల, దానికి ద్విత్వము బహుళముగా నగునని సూత్రార్థము.

ఆ + కన్య, ఇందు తొలుతటిది త్రికము. దానిమీఁది పదము యొక్క ఆద్యక్షరము 'క'. ఇది అసంయుక్తాక్షరము, ప్రస్తుత సూత్రమునుబట్టి దీనికి ద్విత్వము బహుళముగా కలుగ వచ్చును. కలిగిన యెడల ఆ + క్కన్య అని యగును. పూర్వ సూత్రమునుబట్టి 'ఆ' యను వర్ణమునకు హ్రస్వము నిత్యముగా కలిగి 'అక్కన్య' అని యగును. ఇట్లే ఇక్కాలము, ఎల్లోకము – అను రూపము లేర్పడును.

ఆ + అశ్వము అనునపుడు పరమందు హల్లు లేనందువలన ఈ సూత్రమునకు విషయము కాదేమో యని యనిపించును. కాని రెండచ్చులు సన్నిహితమైనప్పుడు సంధి యగుటయో, సంధి కాకున్న యెడల యడాగమము కలుగుటయో జరుగవలయును. ఇచ్చట పూర్వమందు దీర్ఘముండుట వలన సంధి కలుగదు. "సంధి లేనిచో స్వరంబుకంటెం బరంబయిన స్వరంబునకు యడాగమంబగు" అను సూత్రవిధినిబట్టి ఆ + య్ + అశ్వము = ఆ + య్ + అశ్వము – ఆ + యశ్వము అని యగును. ఇప్పుడు త్రికమునకు అసంయుక్తమగు హల్లు పరమందుండుటవలన ద్విత్వము బహుళముగా కలుగును. ఆ+య్యశ్వము అని యైనపిమ్మట పూర్వసూత్రముచేత ఆచ్ఛికమైన 'ఆ', వర్ణముయొక్క దీర్ఘమునకు హ్రస్వమై 'అయ్యశ్వము' అను రూపము సిద్ధించును.

ద్విత్వము బహుళముగా విధింపబడినది కావున ప్రవృత్తి, అప్రవృత్తి, వికల్పము, అన్యత్వము – అను నాలుగింటికి గాని అందు కొన్నింటికి గాని అవకాశము కలదు. ఇందలి వికల్ప విధి చేత 'ద్విత్వము కలుగని రూపములు కూడ నుండవచ్చును. అప్పుడు, ఆకన్య – ఈకాలము – ఏలోకము – ఆయశ్వము మున్నగు విధముగనే రూపములుండును. వీటిలో త్రికమునకు హ్రస్వము కలుగు ప్రసక్తియే లేదు.

బహుళము అని యనుటవలన అప్రవృత్తి కి కూడ అవకాశము కలదు. అప్రవృత్తి యనగా సూత్రములో విధింపబడినట్లు జరుగకుండుట. సూత్రమునందు బహుళమని యనుటచేత త్రికముమీది శబ్దములయొక్క మొదట ఊష్మాక్షరము కాని, రేఫాక్షరము కాని యున్న యెడల వానికి ద్విత్వము కలుగదు. ఊష్మములు = శ ష స హ – అను వర్ణములు. రేఫములు = ఱ ర – అను వర్ణములు.

ఆ + రూపము = ఆరూపము. ఈ + శబ్దము = ఈ శబ్దము. ఇక్కడ ఏవిధమైన మార్పును జరుగలేదు. తక్కిన ప్రయోగములు కూడ ద్విత్వము రానందువలన, ఇట్లే ఏవిధమైన మార్పునకు లోను గాకుండ నుండిపోయినవి.

ఈ సూత్రవిషయము కర్మధారయ సమాసమునకు సంబంధించినది.

**8. ద్విగువున కేకవచనంబు ప్రాయికంబుగా నగు; మిశ్రంబునకుఁ గాదు. (సమాస-18)**

**వ్యాఖ్య –** ద్విగుసమాసమునందు పూర్వోత్తర పదములు రెండును ఆచ్ఛికములే యైన యెడల తరుచుగా సమాసాంతము నందేకవచనమే యుండును; అట్లుకాక ఒక పదము ఆచ్ఛికమును, ఒక పదము తత్సమము నైనచో ఏకవచనము కాదు – అని సూత్రార్థము.

మూఁడు + చిచ్చులు – అనునవి సమసించునెడల పూర్వ సూత్రము (బా – 17) చేత 'డు' లోపమును, మీది హల్లునకు ద్విత్వమును గలిగి, ద్విత్వపరకమైనందున ఆచ్ఛిక దీర్ఘమునకు హ్రస్వము కలుగగా 'ముచ్చిచ్చులు' అను రూపము సిద్ధించును. ఇందలి పూర్వ శబ్దమైన 'మూఁడు' ఉత్తర శబ్దమయిన 'చిచ్చు' – రెండును ఆచ్ఛికములే యగుటవలన లువర్ణమునకు లోపము కలుగవచ్చును; అనగా ఏకత్వము నొందవచ్చునని యర్థము. అప్పుడు 'ముచ్చిచ్చు' అను రూపమేర్పడును. సూత్రమున "ఏకవచనము ప్రాయికముగా నగు" నని యనుటవలన, కొలదిగా 'ముచ్చిచ్చులు' మున్నగు విధముగా బహువచనాంతమైన ఆచ్ఛిక ద్విగుసమాసములుకూడ నుండవచ్చును.

ముక్కారు, ముప్పాతిక, ముత్త్రోవ – మున్నగునవి యేక వచనాంతములైన ఆచ్ఛిక ద్విగుసమాసములకుదాహరణ ములు.

మిశ్రద్విగువైనచో ఏకవచనము కారాదు. మూఁడు + విధములు = ముువ్విధములు అని యగును. పూర్వశబ్దమయిన 'మూఁడు' తెనుగు; ఉత్తరశబ్దమయిన 'విధములు' తత్సమము. కావున నిది మిశ్రసమాసము. మిశ్రద్విగువునకు ఏకవచనము రాదను నియమము చేత, అది బహువచనాంతముగ 'ముువ్విధములు ' అనియే యుండును. ఇట్లే ముల్లోకములు, ముజ్జగములు – మున్నగు సమాసములు బహువచనాంతములుగానే యుండును. మిశ్రము లగుటచే వీనికి ఏకత్వము కలుగదు.

**9. నిక్కలాదులు యథాప్రయోగంబుగ గ్రాహ్యంబులు. (సమాస-20)**

**వ్యాఖ్య –** నిక్కల మున్నగు సమాసములను ప్రయోగములలో నున్నట్లుగా గ్రహింపవలయు నని యర్థము.

నిక్కము + కల – ఈ రెండు శబ్దములును సమసించునపుడు పూర్వశబ్దమునందు

తొలియచ్చుమీది వర్ణముల కెల్ల లోపము కలిగినది. మీదిహల్లునకు ద్విత్వము వచ్చినది. ని + క్కల = నిక్కల అని యైనది. ఇది కర్మధారయ సమాసము.

కవ + వడి. ఈ రెండు శబ్దములును సమసించునపుడు పూర్వ శబ్దమునందు తొలియచ్చుమీది వర్ణముల కెల్ల లోపమును, మీది హల్లునకు ద్విత్వమును కలిగి క + వ్వడి = కవ్వడి అను రూప మేర్పడినది. రెండు చేతులకును వడి గలవాఁడు అను శబ్దార్థము చేత ""అర్జునుఁడు" అను అన్యశబ్దార్థమును బోధించు చున్నది కావున, ఇది బహుర్రీహిసమాసము.

పువ్వు + విలుకాఁడు. ఈ రెండు శబ్దములను సమసించునపుడు పూర్వశబ్దము నందు తొలియచ్చుమీది వర్ణముల కెల్ల లోపమును, మీది హల్లునకు ద్విత్వమును కలిగి పు + వ్విలుకాఁడు – పువ్విలుకాఁడు అను రూప మేర్పడినది. పువ్వుల వింటిని గలవాఁడు అని యౌగికార్థము. 'మన్మథుఁడు' అను అన్యశబ్దార్థమును బోధించుచుండుట చేత ఇదియు బహుర్రీహి సమాసమే.

నిక్కల యనునది అమహదర్థకము. కవ్వడి యనునది మహదర్థకము. ఈ రెండును సమాసాంతకార్యములను బట్టి స్త్రీ సమములై యున్నవి. 'పువ్విలు కాఁడు' అనునది మహదర్థకము.

దువర్ణకాంత మైయున్నది. "స్త్రీ సమఘటితంబ యొకానొకండు బహుర్రీహి చూపట్టెడు" అను (సమాస–

6) నియమమున్నది. ఐనను దువర్ణ కాంతములయిన బహుర్రీహి సమాసములును కొలదిగా కలవనుటకు ఇది యుదాహరణము.

### 10. బహుర్రీహిని సమాసాంత కార్యంబులుం గానంబడియెడి. (సమాస–22)

**వ్యాఖ్య –** బహుర్రీహి సమాసములందు సమాసాంతమున కొన్ని విధములగు ఆగమాదేశాది కార్యములు జరుగునని యర్థము.

మూఁడు + కన్నులు (కలవాఁడు). ఇదియు సమానాధికరణమే యగుటచేత 'డు' వర్ణమునకు లోపము వచ్చి మీది హల్లునకు ద్విత్వమగును. మూ + కన్నులు. ద్విత్వము పరమగుటవలన దీర్ఘమునకు హ్రస్వము కాగా 'ముక్కన్నులు' అని యగును. ఇంతవరకు పూర్వ సూత్రములచేతనే సిద్ధించును. 'కన్నులు' అను శబ్దమునందలి తొలియచ్చు మీది వర్ణముల కెల్ల పూర్ణ బిందుపూర్వక టివర్ణము ఆదేశముగా నగును. 'ముక్కంటి'. ఇట్లు 'టి' వర్ణము కలుగుట సమాసాంత కార్యము.

కడలిరాజు + చూలు. సమాసమున పూర్వశబ్దము తుది నున్న జువర్ణమునకు లోపమై కడలిరా + చూలు అని యైనది. సమాసాంతమున, ఉత్వమున కిత్వము కలిగి 'కడలి రాచూలి' అని యగును. ఇట్లిత్వము వచ్చుట సమాసాంత కార్యము.

నాలుగు + వాతులు ( కలవాఁడు). తొలిశబ్దమున కాదేశముగా 'నలు' అని యై 'నలు +

వాతులు' అని యగును. సమాసాంతమునందలి వర్ణములకు లోపము కలిగి 'నలువ' అని యగును. ఇంతవరకు నున్న బహుబ్రీహిసమాసము లన్నియు స్త్రీ సమములు.

గట్టు + విలు (కలవాఁడు), మతుబర్థమునందు మహద్వాచకమున "తుఁడు" అని ఆగమము కలిగి 'గట్టువిలుతుఁడు' అని యగును. ఇది డువర్ణ కాంతము. ఇట్లు ఆగమము కలుగుట సమాసాంతకార్యము.

సమాసాంత కార్యములను నిర్దిష్టముగా బాలవ్యాకరణము తెలుపలేదు. కావున, ప్రయోగములను బట్టి వానిని నిర్ణయించు కొనవలయును.

## 11. బహుబ్రీహిని స్త్రీవాచ్యం బగుచో నుపమానంబు మీఁది మేనునకు బోఁడి యగు. (సమాస–23)

**వ్యాఖ్య –** బహుబ్రీహి సమాసమున పూర్వశబ్దము ఉపమానవాచకమై ఉత్తరశబ్దముగా ఉ పమేయమగు 'మేను' అను శబ్దముండి, స్త్రీని బోధించునెడల, మేనుశబ్దమున కాదేశముగా 'బోఁడి' అను శబ్ద మగునని సూత్రార్థము.

అలరు + మేను. పువ్వువంటి శరీరముగల స్త్రీ యను నర్థమున ఈ రెండు పదములును సమసింపగా అలరు + మేను = అలరు + బోఁడి = అలరుబోఁడి అని యగును. ఇట్లే ననబోఁడి – పూబోఁడి, విరిబోఁడి – మున్నగు సమాసము లేర్పడును.

కొందరు మేనునకు బదులుగా సూరి పోఁడి అను శబ్దమును విధించినట్లు భావింతురు. అట్లే అయిన యెడల, "ఉదంత స్త్రీసమంబులకు పరుషసరళములు పరమగునప్పుడు నుగాగమ మగునను" విధి చేత 'అలరుఁబోఁడి' అను రూపము కలుగవచ్చును. కాని 'ననఁబోఁడి – విరిఁబోఁడి' మున్నగు విధముగా నుగాగమము కలుగుటకు బాలవ్యాకరణమును బట్టి యేయవకాశము లేదు. కావున సూరి 'పోఁడి' యని కాక 'బోఁడి' యని యే వాడెనని నిశ్చయింపక తప్పదు.

అలరుంబోఁడి – పూవుంబోఁడి మున్నగు విధములైన రూపములు బాలవ్యాకరణమును బట్టియు కావచ్చును. అలరు + ను + బోడి. "సరళ స్థిరంబులు పరంబులగునపుడు ద్రుతంబునకుఁ బూర్ణ బిందువును గానంబడియెడి" నని యనుట చేత 'అలరుం బోఁడి' యను రూపము సిద్ధించును.

## 12. ద్వంద్వంబునందు ఋకారంబునకు రవర్ణంబు విభాషనగు. (సమాస–24)

**వ్యాఖ్య –** ద్వంద్వ సమాసమునందు పూర్వపదము యొక్క కడపటి ఋ వర్ణ మునకు బదులుగా అత్వ విశిష్టమైన రకారము విభాషగా నగునని సూత్రార్థము. ఇది సౌంస్కృతిక ద్వంద్వము.

మాతృ + పితలు – ఇచ్చటి ఋవర్ణమునకు అదంతమైన రవర్ణమురాగా మాత్ + ర + పితలు = మాత్రపితలు అని యగును. రవర్ణాదేశము వైభాషిక మగుటవలన, రవర్ణము రాని పక్షమున 'మాతాపితలు' అనియగును. "అనజ్ ఋతో 'ద్వన్ద్వే" అను నియమము ననుసరించి ఋవర్ణమునకు ఆకారము కలుగగా మాత్ + ఆ + పితలు – మాతాపితలు అను రూపము కలుగును. ఈ సాధారణ నియమమునకు గొన్ని యెడల భంగము కలిగించి సూత్రమునందు చెప్పినట్లు ఋ వర్ణమునకు ర వర్ణము వచ్చుట విశేషము. సిద్ధ సమాసమునందు సంస్కృతమున లేని యీమార్పు కలుగుట మరింత విశేషము.

మాంధాతృ + రఘుక్షితీశులు – అని యున్నప్పుడు ప్రస్తుత సూత్రము చేత ఋ వర్ణమునకు బదులుగా అదంతమైన రవర్ణము వచ్చి 'మాంధాత్ర రఘుక్షితీశులు' అని యగును.

### 13. సమాసవిభక్తికి లోపం బగు; లట్టునకుఁ గాదు. (సమాస–25)

**వ్యాఖ్య –** సమాసమునందు పూర్వశబ్దము యొక్క విభక్తికి లోపమగును. ద్వితీయాది విభక్తులకు బహువచనము నందు ఆగమముగా నగు లకారమునకు మాత్రము లోపము రాదు – అని సూత్రార్థము. రామునియొక్క + బాణములు. ప్రస్తుతసూత్రముచేత 'యొక్క' యను విభక్తికి లోపము కాగా 'రాముని బాణములు' అని యగును.

సరసములు + వచనములు. పూర్వశబ్దము కడపట నున్న బహువచన ప్రత్యయమగు 'లు' వర్ణము ప్రస్తుతసూత్రము చేత లోపించును. సరసము + వచనములు. "కర్మధారయంబుల మువర్ణంబునకుఁ బుంపులగు" అను నియమమునుబట్టి 'సరసపు వచనములు' అని యగును.

వేయి + వెలుఁగులు. బహుప్రీహిని జరుగు సమాసాంత కార్యమువలన కడపటి లు వర్ణకము లోపించును. "బహువచనంబు పరంబగునపుడు రేయి ప్రభృతుల తుదియక్షరంబు లోపించు" (బా.ఆచ్చిక –28) అని సూత్రించి "ఈలోపంబు సమాసంబులందుం జూపట్టెడి" నని తెలిపెను. దీనిని బట్టి సమాసమున పూర్వపదమైన 'వేయి' శబ్దముయొక్క కడపటి 'యి' వర్ణమునకు లోపము కలిగి 'వేవెలుఁగు' అని యగును.

గుణములయొక్క + ప్రోక. విభక్తికి లోపము వచ్చి గుణముల + ప్రోక = గుణముల ప్రోక అని యగును; లడాగమమునకు లోపమురాదని సూరి యీ విషయమును చెప్పెను.

కొందరు ఏకవచనమునందలి నిగాగమమునకు సైతము సమాసమున లోపము రాదు; సూరి దీనిని చెప్పకుండుట దోషమన్నట్లుగా వాదింతురు. ఇది వాదించువారి తొందరపాటును మాత్రమే సూచించును. సూరి తన ప్రణాళికలో డుమంతము నకు నిగాగమము విధించెను. విభక్తికి లోపమును విధించు సందర్భమున నివర్ణ ప్రసక్తియే యుండదు. లడాగమ విషయము వేరు. సూరి నామమునకు

గాక, ఆగమ లకారమును విభక్తికి ముందు విధించెను. కావున, విభక్తి లోపించు నెడల దానితో పాటు లడాగమముకూడ లోపింపవలసి వచ్చును. అట్టి లోపమును వారించుటకుగాను సూరి 'లట్టునకుఁ గాదు' అని ప్రత్యేకించి చెప్పెను. కాబట్టి సూరి ప్రణాళికనుబట్టి యిదియే సరియైన విధానము.

–0–

## 4. తద్ధిత పరిచ్ఛేదము

### 1. తన వర్ణకంబు త్వార్థంబునం బగు. (తద్ధిత–1)

**వ్యాఖ్య –** 'త్వ' యను ప్రత్యయము సంస్కృతమున, నేయర్థమున కలుగునో ఆ యర్థమున తెనుగునందు 'తన' అను ప్రత్యయము కలుగునని సూత్రార్థము.

త్వార్థము అని యనగా భావము అని యర్థము. అనగా భావమును దెలుపవలసి వచ్చినప్పుడు తన వర్ణకము కలుగునని తాత్పర్యము. సంస్కృతమున రామత్వమ్, పౌత్రత్వమ్ – అను విధముగా నన్నపుడు 'రామ' మున్నగు ప్రాతిపదికల వలన పుట్టిన అర్థబోధయందలి విశేషము భావమగును. 'రామత్వమ్' అని యనగా రామునియొక్క విశిష్ట పద్ధతి అని యర్థము. తెలుగున 'రామునియొక్క + తనము' మున్నగుచోట్ల 'తనము' అన్నది కూడ అట్లే విశిష్ట పద్ధతి దెల్పును. కావుననే చిన్నయసూరి "ప్రకృతిజన్య బోధంబునందుఁ బ్రకారంబు భావంబు" అని నిర్వచించెను.

'రాముఁడు' అనగా 'రామత్వ విశిష్టుడయిన వ్యక్తి' యని యర్థము. 'పౌత్రుఁడు' అనగా 'పౌత్రత్వ విశిష్టుడయిన వ్యక్తి' యని యర్థము.

రామునియొక్క + తనము అని యున్నప్పుడు "సమాస విభక్తికి లోపంబగు" అను విధి చేత, 'యొక్కకు' లోపమురాగా 'రాముని తనము' అని యేర్పడును. నిగాగమము పాక్షికమగుటచే 'రాముయొక్క + తనము' అని యున్నప్పుడు 'రాముతనము' అని యగును.

మనుమని యొక్క + తనము అని యున్నప్పుడు యొక్కకు లోపము కలిగి 'మనుమని తనము' అని యగును. నిగాగమము అనుదంతమయిన తెనుగు డుమంతమునకు నిత్యముగా నగును. కావున నిది యొక్కటే రూపము.

నల్లఁదనము అని యన్నప్పుడు అదంతగుణవాచకమునకు తనము పరమందుండుటచేత నుగాగమము (బా. సంధి – 46) కలుగును. ఇట్టిదే పుల్లఁదనము అను యుదాహరణము.

గొప్పతనము అని యన్నప్పుడు 'గొప్ప' యను విశేషణము పై 'తనము' చేరినది. కొఱఁత +

తనము అని యున్నప్పుడు పూర్వశబ్దము యొక్క తుది వర్ణమునకు (అరసున్నతో సహా) లోపము కలుగును. అప్పుడు కొఱ + తనము = కొఱతనము అని యగును.

### 2. ఇట విశేషం బుత్సర్గంబునకు విభాషను బాధకంబగు. (తద్ధిత-2)

**వ్యాఖ్య** – ఇది పరిభాషా సూత్రము. ఉత్సర్గము అంటే సామాన్యవిధి. సార్వత్రిక సూత్రము. దీనిని నిత్యంగా బాధించి ప్రవర్తించేది విశేష సూత్రం. ఈ తద్ధితపరిచ్ఛేదమునందు విశేషముగా విధింపబడు ప్రత్యయములు సామాన్య ప్రత్యయమైన 'తనము' నకు విభాషగా బాధకము లగునని సూత్రార్థము. భావార్థంలో 'తనము' విధింపబడినది. ఇది సామాన్యము. కానీ తరువాతి సూత్రములందు విశేష ప్రత్యయములు విధింపబడినవి. అవి వచ్చుచో 'తనము' అను ప్రత్యయము రాదు. అవి రాని యెడల 'తనము' అనునదియే వచ్చును.

### 3. చిన్నాదులకు ఱిక వర్ణకం బగు. (తద్ధిత-3)

**వ్యాఖ్య** – భావమునందు చిన్నాదులకు 'ఱికము' అను ప్రత్యయము కలుగునని సూత్రార్థము.

చిన్న + తనము = చిన్నతనము. ప్రస్తుత సూత్రముచేత 'ఱికము' కలుగగా 'చిన్నఱికము' అని యగును. అట్లే కన్నె యొక్క భావము అనునర్థమున 'కన్నెతనము' అనియు 'కన్నెఱికము' అనియు రూపములగును.

చిన్నాదులలో ముවర్ణకాంత మగు 'చుట్టము' అన్నది చేరి యున్నది. దీనికి 'ఱికము' అన్నది చేరగా 'ము' వర్ణకము నకు లోపము కలిగి 'చుట్టఱికము' అని యగును. తనము పరమైనప్పుడు కర్మధారయ సామ్యమున ముවర్ణకమునకు పుంప్వా దేశము కలిగి, నుగాగమమై 'చుట్టపుఁదనము' అని యగును. దొంగఱికము, పేదఱికము, మిండఱికము, లంజెఱికము – అనునవి తక్కినవాని రూపములు.

### 4. మగఁటిమ్యాదులు యథాప్రయోగంబుగ గ్రాహ్యంబులు. (తద్ధిత-8)

**వ్యాఖ్య** – మగఁటిమి మున్నగు తద్ధితరూపములను ప్రయోగముల ననుసరించి తెలిసికొనవలయునని సూత్రార్థము. అనగా ప్రకృతి ప్రత్యయములను విభాగించి చూపుటయు, ప్రక్రియను చూపుటయు క్లేశకరమన్న యుద్దేశముతో సూత్రక ర్త యిట్లు చెప్పుట సమంజసమే.

'మగ' అనుదానికి 'టిమిట్ ' అను ప్రత్యయము రాగా మగఁటిమి అని యగును. మగవానియొక్క + తనము అని యున్నప్పుడు తచ్ఛబ్దమునకును, విభక్తికిని లోపము కలుగగా 'మగతనము' అని

యగును, పేద + ఱిమి , పేదఱిమి. ఒజ్జ + న + ము = ఒజ్జనము. 'టరము' అను ప్రత్యయము పరముకాగా 'కోడలు' అనుశబ్దమున తొలియచ్చుమీది వర్ణములకు, లోపము కలిగి 'కోటరము' అని యగును. 'కోడలు' శబ్దము యొక్క అంత్యాక్షరమునకు లోపము కలిగినపుడు పూర్ణ బిందుపూర్వకమైన ట్రము, ట్రికము – అను ప్రత్యయములును పరము కావచ్చును; కేవలము 'ఱికము' అన్న ప్రత్యయమైనను పరము కావచ్చును. అప్పుడు కోడంట్రము, కోడంట్రికము, కోడఱికము – అను రూపములు వరుసగా ఏర్పడును, 'కోమలము' అను తత్సమశబ్దముపై 'ఇకము' అన్నది చేరునపుడు ముపర్ణకమునకు లోపము కలిగి 'కోమలికము' అన్న రూపమేర్ప డును. 'చెలి' అను శబ్దమునకు 'కారము' అన్నది. భావము నందు పరమై 'చెలికారము' అని యగును. తెల్ల, ఎఱ్ఱ, నల్ల –అనువానికి 'పు' వర్ణము పరముకాగా ద్విత్వమునందొకదానికి లోపమువచ్చి, ఉత్వము కలుగుచున్నది. అప్పుడు తెలుపు, ఎఱుపు, నలుపు – అను రూపము లేర్పడును. 'పచ్చ' యన్నది పై మార్పులను పొందిన పిమ్మట 'చ' వర్ణ మున కాదేశముగా సవర్ణము నొందును. అప్పుడు 'పసుపు' అని యగును. ఇట్లు వివరించి చెప్పుటవలన క్లేశమే కాని లాభము లేదు. అందువలననే సూరి ప్రయోగములనుబట్టి గ్రహింపవలయునని చెప్పుట జరిగెను.

త్వార్థమునందగు 'ఱికము' మున్నగు ప్రత్యయములు రానియెడల, అన్నింటికిని 'తనము' అను ప్రత్యయము వచ్చును. 'చిన్నఱికము' అన్నది. ఱికము ప్రత్యయము రాని యెడల 'చిన్న తనము' అని యగును. 'ముచ్చిమి' అనునది ఇమివర్ణకము రానియెడల 'ముచ్చు + తనము' అని యగును. ఉ దంత స్త్రీ సమమునకుఁదనము పరమగునపుడు నుగాగమము కలుగునన్న (బా – సంధి – 45) విధిచేత ముచ్చు + ను + తనము "అని యై "ముచ్చుదనము" అని యగును. 'నల్లన' అన్నది. నవర్ణ కము రాని యెడల 'తన' వర్ణకము నొందును. అదంతగుణవాచక మగుటచేత నుగాగమమై 'నల్లఁదనము' అను రూపమేర్పడును. 'అగ్గలిక' అన్నది ఇక వర్ణకము రాని యెడల 'అగ్గలము + తనము' అనియై ముపర్ణమునకు బదులుగా పుంపులు రాగా 'అగ్గలంపు + తనము' అనియై నుగాగమమునొంది 'అగ్గలంపుఁదనము' అని యగును. 'ఒజ్జనము' అని యన్నప్పుడు నవర్ణకము రాని యెడల 'తనము' పరమై 'ఒజ్జతనము' అని యగుమ.

**5. కాక త్తియల కకారంబునకు గకారంబు కొండొకచోఁ గానంబడియెడి. (తద్ధిత–12)**

**వ్యాఖ్య –** పూర్వ సూత్రముచేత వచ్చిన కా, కత్తియ యను ప్రత్యయముల యొక్క కకారమునకు

కొన్ని యెడల గకారము కలుగునని సూత్రార్థము.

అందము+కా అనియుండి ములోపమును దుజ్వర్ణకమును పొంది అంద + కాఁడు అని యగును. ప్రస్తుత సూత్రము చేత క వర్ణకమునకు ఆదేశముగా గవర్ణము రాగా 'అందగాఁడు' అని యగును.

స్త్రీత్వమునందు 'అందగత్తియ' యను రూప మిట్లే యేర్పడును.

'కొండెము' అన్నది మతుబర్థమునందు పురుషబోధక మైనపుడు 'కొండెగాఁడు' అనియు, స్త్రీబోధకమైనపుడు 'కొండెగత్తియ' అనియు నగును. అట్లే 'బేరము' అన్నది. బేరగాఁడు, బేరగత్తియ అని యగును.

### 6. కాకత్తియలు కొండొక వానికి స్వార్థంబునం జూపట్టెడు. (తద్ధిత-13)

**వ్యాఖ్య –** 'కా' యను ప్రత్యయము పురుష బోధకముగాను, 'కత్తియ' యను ప్రత్యయము స్త్రీబోధకముగాను స్వార్థమునందు కొన్ని పదముల పైని చేరునని సూత్రార్థము.

'చెలి' యని యనగా సఖుఁడు, సఖియని యర్థములు. ఆయర్థమునం దే 'కా' ప్రత్యయము వచ్చి 'చెలికాఁడు' అనియు, 'కత్తియ' ప్రత్యయము వచ్చి 'చెలికత్తియ' యనియు నగును. 'హెగ్గడి' అని యనగా 'అంతఃపురమును కావలి కాయువాడు' అని యర్థము. స్త్రీ బోధకముగా కూడ ఇది యుపయోగింపబడును. దీనిపై 'కాఁడు' అనివచ్చి "హెగ్గడికాఁడు' అని యగును; స్త్రీ బోధయందు 'కత్తియ' వచ్చి 'హెగ్గడికత్తియ' అని యగును.

### 7. ఇవర్ణకం బోయారాదులకు మతుబర్థంబునం దగు. (తద్ధిత-18)

**వ్యాఖ్య –** ఓయారము మున్నగువానికి కలిగియుండుటను బోధించినప్పుడు 'ఇ' అను ప్రత్యయము కలుగును. ఇదియు స్త్రీ పురుష సామాన్య బోధకము.

ఓయారము + ఇ – అని యున్నప్పుడు తద్ధిత వృత్తియందు ము వర్ణక లోపము; అపదాది సంధియై 'ఓయారి' అని యగును. ఇట్లే అక్కసము కలవాడు 'అక్కసి, కదలి, చాగి, జోగి, తుటారి, బండారి, బిత్తరి, బిటారి, బేహారి, మచ్చరి, మిటారి, విన్నాణి, వెక్కసి – మున్నగునవి తక్కినవానికి రూపములు.

### 8. మానార్థంబున కేకత్వంబునం దెఁడు వర్ణకంబగు. (తద్ధిత-25)

**వ్యాఖ్య –** పరిమాణమును తెలియజేయునప్పుడు ఏకత్వమును బోధించు పదమునకు 'ఎఁడు' అను ప్రత్యయము కలుగునని సూత్రార్థము. తూము + ఎఁడు = తూమెఁడు. ఇక్కడ తూము,

ముంత, ఎత్తు, వీసె, జేన, మూర, కుండ, గంప – అన్నవి ఏక వచనాంత శబ్దములు. వీనికి 'ఎఁడు' అను ప్రత్యయము కలిగి అపదాదిసంధికాగా పైని చూపిన రూపము లేర్పడును.

ముత్త + ఎడు = ముత్తెడు, ఎత్తు + ఎడు =ఎత్తెడు, వీసె + ఎడు = వీసెడు,

### 9. దఘ్నార్థంబున బంటి కొలఁదు లగు. (తద్ధిత-27)

**వ్యాఖ్య –** ప్రమాణమును దెలుపవలసి వచ్చునప్పుడు సంస్కృతమున 'దఘ్నచ్' ప్రత్యయము వచ్చును. ఆ ప్రత్యయము వచ్చుటకు వీలయిన సందర్భమునందు తెలుగునందు 'బంటి' అనుప్రత్యయము కాని, 'కొలఁది' అను ప్రత్యయము కాని వచ్చునని సూత్రతాత్పర్యము.

జానుదఘ్న మన్న యర్థమున 'మోఁకాలు + బంటి' అనియై పూర్వశబ్దము తుదియచ్చున కిత్వము కలిగి 'మోఁకాలి బంటి' అని యగుచున్నది. 'మోఁకాలి కొలఁది' అన్నది కూడ ఇట్టిదే. 'మోఁకాలు లోతువరకు' అని యర్థము. 'ఔొమ్ము' అను శబ్దముపై 'బంటి' యని వచ్చు 'ఔొమ్ముబంటి' యని 'కొలఁది' రాగా 'ఔొమ్ముకొలఁది' యని యగును. ఔొమ్ము లోతువరకు అని యర్థము.

**-0-**

## 5. కృదంత పరిచ్ఛేదము .

### 1. ఇటం గృత్కగతపవేములు పరంబులగునపుడు క గ చ య వ లకు లోపంబగు. (కృదంత-2)

**వ్యాఖ్య –** 'ఇట' ననగా ఈ కృదంత పరిచ్ఛేదమునం దని యర్థము. ఈ సూత్రము చేత చెప్పబడు కార్యము కృత్సామాన్యము పరమగునప్పుడు కాక, ఈ పరిచ్ఛేదమునందలి కృత్తులకు మాత్రమే నియతము చేయుటకై 'ఇట' ననుమాట సప్రయోజనముగా వాడబడినది. కృత్ప్రయములకు సంబంధించిన క, గ, త, ప, వ, ఇమి అన్నవి పరములగునపుడు ధాతువు యొక్క చివరనున్న క, గ, చ, య, వ అను వర్ణములకు లోపము కలుగునని సూత్రార్థము.

'ఆఁగు' నకు కవర్ణకము రాగా గు వర్ణము లోపించి 'ఆఁక' అని యగును. క్రియాపరిచ్ఛేదమునందు 'కజి' యను కృత్ప్రత్యయము కలదు. అది పరమగునప్పు డీలోపము కలుగదు. 'ఆఁగక' అనియే యగును. 'ఇట'నని యనుట చేత ఈ ప్రయోజనమును గమనింపవలయును.

### 2. ఇమి వర్ణకంబు కలుగ్వాదుల కగు. (కృదంత-4)

**వ్యాఖ్య –** కలుగు మున్నగు ధాతువులకు 'ఇమి' యను ప్రత్యయము కలుగునని సూత్రార్థము. ఇమి పరమగుచుండగా ధాతువు చివరనున్న క గ చ య వ లకు లోపము కలుగును. 'కలుగు' ధాతువునకు 'ఇమి' పరమందుండగా 'గు' వర్ణము లోపించును. అప్పుడు కలు+ఇమి = కలిమి అని

యగును. ఒడ్డు, తాలు – అను ధాతువులకు చివర క గ చ య వ లలో నేదియు లేదు. అందుచేత, లోప ప్రసక్తి కలుగదు. ఒడ్డు+ఇమి=ఒడ్డిమి అని యగును. తాలిమి అను కృదంతము కూడ నిట్లే యేర్పడును.

### 3.తజ్వర్ణకంబు చేయ్యాదుల కగు.(కృదంత-5)

**వ్యాఖ్య –** చేయు మున్నగు ధాతువులకు తజ్ ప్రత్యయము కలుగునని సూత్రార్థము. 'తజ్' అని 'జ' యను ఇత్సంజ్ఞను వాడియుండుటచేత 'జిత్తు బిందుపూర్వం బగు' నన్న నియమమును బట్టి 'త' అను ప్రత్యయమునకు ముందు బిందువు కూడ నుండును. ఈ ధాతువు లన్నింటియందును, చివర య వర్ణమే కలదు. అది పూర్వ సూత్రము (బా-2) చేత లోపింపగా చేయు+తజ్జు – చే+తజ్జు = చేంత అని యగును. తక్కిన వాని ప్రక్రియకూడ ఇట్టే యుండును.

### 4.ట వర్ణకం బాడ్వాదుల కగు; నగుచో నంతలోపం బగు.(కృదంత-7)

**వ్యాఖ్య –** ఆడు మున్నగు ధాతువులకు 'ట' యను ప్రత్యయము కలుగును. అప్పుడు ధాతువుయొక్క అంతమున నున్న యక్షరమునకు లోపము కలుగును – అని సూత్రార్థము.

ఆడు+ట అని యుండగా 'డు' లోపించు 'ఆట' అని యగును. తక్కిన రూపములు నిట్లే యేర్పడును. ఆడుధాతువు అనుప్రయుక్తముకాగా ఏర్పడు కోలాడు, పోరాడు, మంద్రాడు మున్నగు వానికిని టవర్ణకము పరమగును. అప్పుడు ప్రాయికముగా నపుంసకత్వము కలుగును. అనగా ముువర్ణకము చేరి కోలాటము, పోరాటము, మంద్రాటము – అని యగును. ప్రాయికముగా నని యనుటచే పోరాట, నీరాట – మున్నగు రూపములు కూడ సమ్మతములే యగును.

### 5.ప వర్ణకంబు తిరియ్యాదుల కగు.(కృదంత-9)

**వ్యాఖ్య –** తిరియు మున్నగు ధాతువులకు ప వర్ణకము కలుగునని సూత్రార్థము. ఇచ్చట సూరి ఇచ్చిన లక్ష్యములన్నీ నపుంసకతుల్యము లగుటచేత, ము వర్ణాంతములై యుండునని యుదాహరణములనుబట్టి గ్రహింపవలసి యున్నది.

'తిరియు' నకు 'ప' వర్ణము రాగా 'యు' లోపించును. అప్పుడు ము వర్ణకము చేరి 'తిరిపము' అని యగును. పొలపము, మురిపము – మున్నగు కృదంతము లిట్లే యేర్పడినవి. 'కలియు' ధాతువునకు పవర్ణకము కలుగగా 'యు' లోపించును. అప్పుడు 'కలి+ప+ము' అని యుండును. ఇప్పుడు ఇత్వమునకు అత్వము కలిగి 'కలపము' అని యగును.

### 6.అప్పాదులకు నజి యగు.(కృదంత-13)

**వ్యాఖ్య –** అప్ప మున్నగు ధాతువులకు 'న' అను ప్రత్యయము కలుగును. అప్ప+న=అప్పన. తక్కినవన్నియు నట్టివే. 'నజి' యని జీత్తును వాడుటచే 'వీచు' ధాతువుయొక్క ఉత్వమునకు అత్వము

కలుగును. "ఆగమాన్య చకారంబుల కద్విరుక్తంబులకు ముత్తు పరంబగునపుడు పవ లగు" నన్న (బా.క్రి.88) సూత్రమును బట్టి చకారము వకారమై 'వీవన' అని యగును.

### 7. అక వర్ణకంబు మాఱ్వాదుల కగు. (కృదంత–19)

**వ్యాఖ్య –** మాఱు మున్నగువానికి 'అక' అను ప్రత్యయము కలుగునని యర్థము. ఆ పిమ్మట 'ము' వర్ణకము కూడ కలుగుచుండుట ప్రయోగములనుబట్టి తెలియుచున్నది. మాఱు+అక+ము = మాఱకము. 'పంచు' ధాతువుయొక్క చకారమునకు పత్వము కలుగగా 'పంపకము' అని యగును. వండు ధాతువుయొక్క 'డు' వర్ణమునకు బదులుగా 'టు' వర్ణము కలుగగా 'వండు+అకము=వంటు+అకము+వంటకము' అని యగును.

### 8. వడి ప్రభృతు లిట్లెఱుంగునది. (కృదంత–22)

**వ్యాఖ్య –** వడి మున్నగు ప్రత్యయయములు వేని కేయర్థము లందు ప్రయోగింపబడునో చూపిన పద్ధతి ననుసరించి గ్రహింపవలయునని సూత్రార్థము.

కొలుచు, గెలుచు, నడచు – అను ధాతువులకు వడి పరము కాగా చకారమునకు లోపము కలిగి కొలువడి మున్నగు రూపములేర్పడుచున్నవి. వ్యతిరేకార్థమునందు 'కలుగు' ధాతువునకు 'లే' యన్న యాదేశము కలిగి లే+వడి=లేవడి యగు చున్నది.

తనియు, తెలియు, విరియు – అను ధాతువులకు 'వి' అను ప్రత్యయము కలుగగా యవర్ణము లోపించి తనివి మున్నగు కృదంతము లేర్పడుచున్నవి. తగు, నగు, ఉఱు – అను ధాతువులకు 'అవు' వర్ణకము పరముకాగా తగవు మున్నగు రూపములు కలుగుచున్నవి. చేయు, వ్రాయు – అను ధాతువులకు ఇ వర్ణకము కలిగి చేయి, వ్రాయి అని యగును. కను, విను ధాతువులకు 'కలి' వర్ణకము కలిగి కనుకలి, వినుకలి అని యగును.

కృత్తులింకను గలవనియు, వానిని పెద్దల వ్యవహారమును బట్టి గ్రహింపవలయుననియు వాక్యర్త నిర్దేశము.

–0–

# 6.ప్రకీర్ణక పరిచ్ఛేదము

## 1.పదాద్యంబులు ఋ, ౠ వర్ణంబులు రలతుల్యంబులు.(ప్రకీ-1)

**వ్యాఖ్య –** పదమునకు మొదటనుండు ఋ వర్ణము రకారముతోను, ౠ వర్ణము లకారముతోను సమానము లని యర్థము. ఋ ౠ అనునవి అచ్చులు. ర ల లు హల్లులు. అచ్చులయినట్టి ఋ ౠ వర్ణములు వ్యాకరణ కార్యవిషయమున తమ ధర్మమును విడనాడి ర, ల అను హల్లుల ధర్మమును చేపట్టునని భావము.

అతఁడు+ఋషి – అని యన్నప్పుడు 'అతఁడు' లోని చివరి ఉత్వమునకు అచ్చు పరమందున్నది. కావున 'ఉత్తునకచ్చు పరమగునపుడు సంధి యగు" (బా. సంధి-1) అను నియమము ప్రకారము సంధి కావలసి యుండును. కాని ప్రస్తుత సూత్రము దానిని వారించుచున్నది. ఋ వర్ణమునకు రతుల్యత్వము గలుగుట చేత అచ్చునకు హల్లు పరమగునపుడు సంధి యను ప్రసంగము కలుగదు. పూర్వమందును, పరమందును గూడ స్వరములే యున్నప్పుడు సంధియను ప్రసంగము కలుగును. కావున ఇచ్చట యథాతథముగా 'అతఁడు ఋషి' యని మాత్రమే యుండిపోవును.

ఆ+ఋషి – అని యున్నప్పుడు దీర్ఘమునకు సంధి లేదు. కావున "సంధిలేనిచోట స్వరంబుకంటెం బరంబయిన స్వరంబునకు యడాగమం బగు" అన్న (బా. సంధి – 3) నియమము ప్రకారము యడాగమము కావలసియుండగా, ప్రస్తుత సూత్రము దానిని గూడ వారించుచున్నది. ఋ రవర్ణతుల్య మగుట వలన యడాగమమునకు అవకాశమే లేదు. కావున యథాతథముగా 'ఆ ఋషి' అనియే యుండిపోవును.

వచ్చెను+ఋషి – అని యున్నప్పుడు ప్రస్తుత సూత్రము చేత ఋ వర్ణమునకు రవర్ణతుల్యత్వము కలుగును. అప్పుడు 'ద్రుతంబునకు సరళ స్థిరంబులు పరంబు లగునపుడు లోప సంశ్లేషంబులు విభాష నగు' అన్న సూత్రము ననుసరించి ద్రుతమునకు లోపము కలుగగా 'వచ్చె ఋషి' యనియు ద్రుతమునకు మీది హల్లుతో సంశ్లేషము కలుగగా 'వచ్చెన్ ఋషి' యనియు నగును. పై కార్యము జరుగని పక్షమున ద్రుతమునకు స్వత్వము కలిగి 'వచ్చెను ఋషి' అని యథాతథముగా నుండిపోవును.

'పదాద్యములు' అన్న విశేసణము చాలా ముఖ్యము. ఋ ౠ వర్ణములు పదాద్యములు కానియెడల వానికి ర ల తుల్యత్వము లేదు. తృణము అని యున్నప్పుడు 'ఋ' రెండవ వర్ణముగా నున్నది. కావున అది స్వరధర్మమునే కలిగి యుండును. అందువలన త, తి మున్నగు వాని వంటిదే 'తృ' అన్నది కూడ. ఆ+తృణము అని యున్నప్పుడు 'త్రికంబుమీఁది యసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగా నగు' నన్న నియమమును బట్టి 'అత్తృణము' అను రూపము కూడ నేర్పడు చున్నది. అట్లే 'ప్రవృత్తి' యను పదము ఛందస్సునందు జగణమగును. 'వృ' అన్నది సంయుక్తాక్షరమే అయిన యెడల 'ప్ర' అన్నది గురువై అది తగణము కావలసి వచ్చెడిది. ఇట్లే పెక్కు ఛందోవ్యాకరణ కార్యములకు

ప్రస్తుత సూత్రము సాధకము.

ఇచ్చట ఌ వర్ణముతోడి యుదాహరణములు చూపబడలేదు. ఆ ఌ కారము – విక్ఌప్తి॥ వ్రాసె ఌ కారము – వ్రాసెన్ ఌ కారము – వ్రాసెను ఌ కారము॥ అన్న వానిని గ్రహింపనగును.

**2.ఆచ్ఛికపదంబులం దుత్తమంబులగు రు లు డు ల ముందఱి యేత్వంబునకు హ్రస్వంబు విభాష నగు. (ప్రకీ–2)**

**వ్యాఖ్య –** మూడక్షరములకు తక్కువకాని పదమునందలి తుది యక్షరమునకు ఉత్తమము అని పేరు. ఆచ్ఛిక పదములందు రు, లు, డు – అను నక్షరము లుత్తమములై యున్నపుడు, వానికి పూర్వమందున్న ఏత్వమునకు హ్రస్వము విభాషగా నగు నని సూత్రార్థము.

'నల్లేరు' అన్నది మూడక్షరముల తెలుగు పదము. రు మూడవ యక్షరమై యున్నది. కావున, ప్రస్తుత సూత్రమునుబట్టి, దానికి పూర్వమందున్న ఏవర్ణమునకు హ్రస్వము రాగా 'నల్లెరు' అని యగును. ఈవిధి వైభాషికము. కావున హ్రస్వము రాని పక్షమున 'నల్లేరు' అనియే యుండును.

'ఉత్తమంబులగు' అను విశేషణముచేత పేరు, కేలు, పేడు – మున్నగుచోటి ఏ వర్ణమునకు హ్రస్వము రాదు. విభాషయని యనుటచే సమానపదమునకే యీ సూత్రము వర్తించును; సమాసములకు వర్తింపదు. అందువలననే మిన్నేఱు, పెడగేలు, ముప్పేరు, ముయ్యేడు – మున్నగుచోట్ల హ్రస్వము గలుగదు.

**3.ఊయేలాదులం దొలియచ్చుమీఁది హల్లునకు ద్విర్వచనంబొండె నగు. (ప్రకీ–6)**

**వ్యాఖ్య –** ఊయేల మున్నగువానియొక్క తొలియచ్చు, మీది హల్లునకు ద్విత్వము వికల్పముగా నగునని సూత్రార్థము. ఊయేలాదులందు నామములతో పాటుగా క్రియలు కూడ చేర్పబడినవని గుర్తుంచుకొనుట యవసరము.

ఆయె – అన్నది 'అగు' అను ధాతువునకు 'ఎను' పరమైనపుడు యత్వము కలుగగా ఏర్పడిన రూపము. అగు+ఎను = ఆయెను. ప్రస్తుత సూత్రముచేత యకారము ద్విత్వము నొందగా దీర్ఘమునకు హ్రస్వము కలిగి అయ్యెను అని యగును. 'నోవు' అన్నది క్రియాధాతువుగను, నామముగను కూడ కలదు. రెండు చోట్లను గూడ 'నొవ్వు' అను రూపము కలుగవచ్చును.

'కోపు' అను మాటకు అందము, సంస్కారము, నాట్యమునందలి విధము, సమయము, మద్యము,

మిష మున్నగు నర్థములు పెక్కులు గలవు. వీనికి 'కొప్పు' అను రూపము ధనురగ్రము (వింటికొన) యను నర్థమున మాత్రమే కలుగును.

'తేప' యను పదమునకు 'తెప్ప' యను రూపము ప్లవము అను నర్థమున మాత్రమే కలుగును. దానికి 'పర్యాయము' అను నర్థము కూడ కలదు. అప్పుడీకార్యము జరుగదు.

'మోక' అన్నది అంకురము అన్న యర్థమునందు మాత్రమే 'మొక్క' యను రూపము నొందును.

ఎల్లిదము, ఒయ్య, ఒయ్యారము, జజ్జర, తినినయ, తియ్యము, తెమ్మ, తొయ్యలి, దివ్వియ, నువ్వు, నొవ్వి, పువ్వు, మొట్టిక, మొవ్వు, వియ్యము – అన్నవి తక్కిన వానికి రూపములు.

### 4. అకారంబు క్రింది ఱకారంబునకుం దుది నులుల క్రింది నలలకు లోపంబు బహుళంబుగ నగు. (ప్రకీ–7)

**వ్యాఖ్య** –ఱకారమునకు పూర్వమందున్న అకారమునకును, చివరనున్నను, లు – అను వర్ణములకు పూర్వమందున్న నకారలకారములకును లోపము బహుళముగా నగునని యర్థము.

అఱ్ఱు – అనుచోట చివరిది 'ఱు'. దానికి పూర్వమందు ఱకారము గలదు. దానికి లోపము రాగా 'అఱు' అని యగును. 'గొఱ్ఱియ' అనుచోట (ఱ్ + ఱి) ఱ్ఱి పదమధ్యమున గలదు. కావున పూర్వమందున్న ఱకారమునకు లోపము రాగా 'గొఱియ' అని యగును.

కన్ను – అనుచోట చివరిది 'ను'. దానికి పూర్వమందు నకారము కలదు (క + న్ + ను). ప్రస్తుత సూత్రము చేత నకారమునకు లోపము రాగా 'కను' అని యగును. 'నన్ను' అన్నది 'నను' అని యిట్లే యగును. 'పలు' శబ్దము తుదనున్నది 'లు'. దానికి పూర్వమందున్న లకారమునకు లోపము రాగా 'పలు' అని యగును. 'విల్లు' అన్నది 'విలు' అని యిట్లే యగును. ఈ నలు వర్ణములు వర్ణములు పదాంతములైనపుడే యీ కార్యము జరుగును.

బహుళమని యనుటచేత కన్ను మున్నగు రూపములును యథాతథముగా నుండవచ్చును. అవి వికల్పవిధిని నిరూపించును. 'అఱ్ఱు' మున్నగువానికి 'తి' వర్ణము పరమగునపుడు రేఫలోపము నిత్యము – అఱితి॥ విల్లు శబ్దమునకు బహువ్రీహిని తువర్ణము పరమగునపుడు లలోపమ నిత్యము – పూవిలుతుఁడు॥ రాబోవు సూత్రము చేత అచ్చు పరమగునపుడు ఈ లోపము కలుగదు – అఱ్ఱెత్తె.

ఈ ప్రయోగవైవిధ్యమును భావించియే వ్యాకర్త బహుళ పదమును సూత్రమునందు నిబద్ధము చేసెను.

### 5. అక్కటాదుల జడ్డకు లోపంబు విభాష నగు. (ప్రకీ–8)

**వ్యాఖ్య –** అక్కట మున్నగు శబ్దములయొక్క జడ్డకు (ద్విత్వమునకు) విభాషగా లోపమగునని సూత్రార్థము. అక్కటాదులయందు విశేష్యములు, విశేషణములు, సర్వనామములు, అవ్యయములు, క్రియాధాతువులు, క్రియలు గూడ చేరియున్నవన్న విషయమును గమనింపవలయును.

'అక్కట' అన్న శబ్దము యొక్క జడ్డకు లోపము రాగా 'అకట' అని యగును. అటిక, అటుక, అటె – మున్నగు విధముగా తక్కినవానికి రూపములుండును.

విభాష యని యనుటచేత దవ్వు, నవ్వు, నువ్వు, పువ్వు, ముక్కు, మమ్ము, మిమ్ము, తమ్ము – మున్నగు ఉదంతములకు అచ్చు పరమగునపుడు జడ్డకు లోపము కలుగదు. అమ్మ, అక్క మున్నగువానికిని పదాదిస్వరముతో, సంధి యగునెడల జడ్డకు లోపము కలుగదు.

**6.హా దు ల యు నీలుగు లోనగువాని తొలి హల్లునకు లోపంబు బహుళంబుగ నగు.(ప్రకీ–10)**

**వ్యాఖ్య –** హకారముతో ప్రారంభమగు మాటల యొక్కయు, నీలుగు మొదలగు మాటలయొక్కయు తొలి హల్లునకు బహుళముగా లోపమగునని సూత్రార్థము.

'హడపము' అను పదమున తొలిహల్లు లోపింపగా 'అడపము' అని యగును. అరిదళము, అలఁది – యన్నవి యిట్లు హకారలోపము కలిగిన రూపములు.

'నీలుగు' అను మాటయందు తొలిహల్లగు నవర్ణము లోపింపగా 'ఈలుగు' అని యగును. అట్లే 'నెగయు' అన్నది నలోపమునొంది 'ఎగయు' అని యగును. పొందు, పొనరు – అని వానికి పలోపము కలుగగా ఒందు, ఒనరు అను రూపము లేర్పడును.

పూను, పొదవు అను రెంటికి కూడ అప్పకవి తొలి హల్లు లోపించునని చెప్పియుండెను. సూరి అట్లు చెప్పుట అవిచార మూలకమని నిరసించుచున్నాడు. ఊను, ఒదవు అని రెండు ధాతువులున్నవి. వీనికి పూను, పొదవు అన్నవే మూలములని, రూపసామ్యమును చూచి భ్రాంతి చెందెననియు, తక్కిన యర్థాదులను గూర్చి విచారము (ఆలోచన) చేయలేదనియు, అందువలననే అట్లు చెప్పుట జరిగెననియు 'అవిచారమూలకము' అన్న దానికి తాత్పర్యము. పూను అని యనగా కడగు అని యర్థము. ఊను అని యనగా ఆను, నాటు, మోపు అని యర్థములు. కావున అర్థమునుబట్టి రెండింటికిని మిక్కిలి దూరము కలదు. పొదవు అని యనగా వ్యాపించు, ఆక్రమించు అని యర్థములు. ఒదవు అని యనగా లభించు, జనించు, ఉపయోగపడు అని యర్థములు. కావున ఒదవు పొదవులకును మిక్కిలి భేదము గలదు. ఈ భేదమును గుఱించి యోజింపకపోవుట చేత అప్పకవి యట్లు చెప్పెను. కాని యింతగా భేదమున్నది కావున పూను, పొదవులే తొలిహల్లులు లోపించుట చేత ఊను, ఒదవులు అయ్యెనని సూరి యంగీకరించుట లేదు. అవి భిన్న భిన్న ధాతువులు. వాని యర్థములు వేరు; వాని

ప్రయోగరీతులు వేరు.

**7.ఓయారాదులం దొలి దీర్ఘంబునకు హ్రస్వంబు విభాషనగు.(ప్రకీ-12)**

**వ్యాఖ్య –** ఓయారము మొదలయిన శబ్దముల తొలి యక్షరము యొక్క దీర్ఘమునకు హ్రస్వమగునని సూత్రార్థము.

'ఓయారము' అను పదమునందలి తొలి యక్షరమైన 'ఓ' హ్రస్వము నొందగా 'ఒయారము' అని యగును.

'కేళాకూళి' ప్రస్తుత సూత్రము చేత 'కెళాకూళి' యని యగును.

కొలె, గుడారము, గొరువంక, జొహారు, మఱు, ములుగు, మొఱకు, విడియము – అన్నవి

తక్కినవానికి రూపములు.

'నీలుగు' అన్నది ప్రస్తుత సూత్రము చేత 'నిలుగు' అని యగును. "హాదులయు...' అని మొదలైన సూత్రమును బట్టి తొలి హల్లు లోపింపగా 'ఈలుగు' అను రూపము కలుగును. ప్రస్తుతసూత్రముచేత తొలి దీర్ఘమునకు హ్రస్వము కలిగి 'ఇలుగు' అన్న రూపముకూడ కలుగును. 'బేహారము' అన్నది ప్రస్తుత సూత్రమును బట్టి 'బెహారము' అని యగును. పూర్వ సూత్రముచేత 'బేహరము' అన్న రూపము వచ్చినది. వ్యాకర్త 'దీర్ఘమధ్యంబు' అని కుండలీకరించి చెప్పుటచేత 'బేహారము' అను రూపము మాత్రమే ఓయారాదులలో చేరుననియు, బేహరము అన్నది యిందలిది కాదనియు గ్రహింప వలయును. కావున 'బేహరము' అను శబ్దముయొక్క తొలి దీర్ఘమునకు హ్రస్వము రాదు.

'వీటతాటము' అన్నది ప్రస్తుత సూత్రము చేత 'విటతాటము' అని యగును. ఆరాటాది గణములోని దగుటవలన 'వీటతటము' కూడ నైనది. ఆ 'వీటతటము' కూడ తొలి దీర్ఘము హ్రస్వమై 'విటతటము' అని యగును.

'పేఁడ' అను శబ్దముయొక్క తొలి దీర్ఘమునకు హ్రస్వము రాగా అరసున్న తొలి హ్రస్వముమీదిది కావలసివచ్చును. "అఁట యిఁక చుఁడు శబ్దంబులం దప్పు నుడి తొలి హ్రస్వంబుమీఁద ఖండబిందువును ద్రుతంబునకు లోపంబును లేవు" అన్న సూత్రమును బట్టి యిట్లుండుటకు వీలులేదు. కావున "హ్రస్వము మీఁది ఖండబిందువునకుఁ బూర్ణబిందువు వైకల్పికముగ నగు'' నన్న నియమమునుబట్టి పూర్ణానుస్వారము చేయగా 'పెండ' అని యగును.

**8.అడంగ్వాదుల దాకు ఐకారంబు విభాషనగు.(ప్రకీ-13)**

**వ్యాఖ్య –** అడఁగు మున్నగువాని డ వర్ణమునకు విభాషగా ణకార మగునని సూత్రార్థము.

'అడఁగు' అనుచోటి డ వర్ణమునకు ణత్వము కలుగగా 'అణఁగు' అని యగును. కణఁగు, చిల్లాణము, తణగము, మిణుఁగు, వణఁకు, మిణుఁగురు – అన్నవి తక్కిన వానికి రూపములు.

'నాఁడెము' అని యన్నప్పుడు డాకు ణకారము రాగా ముందున్న అరసున్న తొలగిపోయి 'నాణెము' అని యగును. సంస్కృత సమేతరములయిన తెలుఁగు శబ్దములయందుఁ "బరుష సరళంబులకు ముందే బిందువు కానంబడుచున్నది" అని యనుటచేత స్థిర వర్ణమయిన కారమునకు పూర్వమందున్న బిందువు తొలగిపోవలయును. 'పోఁడి' అన్నది యిట్లే 'పోణి' అని యగును.

విభాషయని యనుట చేత కృత్తులు మున్నగునవి పరములగునపుడు సైతం అడంగ్వాదుల డాకు ణత్వము కలుగవచ్చును. అణఁకువ, కణఁక, పోణిమి మున్నగునవి యుదాహరణములు.

**9.జూదాదుల దాకు జకారంబు విభాష నగు.(ప్రకీ–21)**

**వ్యాఖ్య –** జూదము మున్నగు శబ్దముల యొక్క దకారమునకు విభాషగా జకారమగునని సూత్రార్థము. 'జూదము' నందలి దస్థానమున జవర్ణము రాగా 'జూజము' అని యగును. అవుజు, జవాజి, జాజి, జాజు, విరవాజి – అన్నవి తక్కినవానికి రూపములు.

**10.నిందయం దామ్రేడితంబు నాద్యక్షరములకు హ్రస్వదీర్ఘంబులకు గిగీలగు.(ప్రకీ–22)**

**వ్యాఖ్య –** నిందార్థమునందు ఆమ్రేడితము యొక్క ఆద్యక్షరము హ్రస్వమైనచో 'గి' యనియు, దీర్ఘమైనచో 'గీ' యనియు ఆదేశమునొందునని సూత్రార్థము. 'కుంభకర్ణుఁడు కుంభకర్ణుఁడు' అనియుండగా రెండవసారి యుచ్చరింపబడినది యామ్రేడితము. దాని యాద్యక్షరమైన కుస్థానమున గివర్ణము రాగా 'గింభకర్ణుఁడు' అని యగును. 'రావణుఁడు రావణుఁడు' అని యున్నప్పుడు ఆమ్రేడితము యొక్క ఆద్యక్షరము దీర్ఘము కావున 'గీ' యన్న యాదేశము కలిగి 'గీవణుఁడు' అని యగును.

నిందయందని యనుటచే 'రాముఁడు రాముఁడు' మున్నగువిధముగా ప్రశంసాద్యర్థములందు ఈ కార్యము జరుగదు.

ఈ సూత్ర వ్యాఖ్యలు స్ఫూర్తిశ్రీ గారి వ్యాఖ్యనుండి గ్రహించబడినవి.

–0–

# అనుబంధం

## బాలవ్యాకరణ సూత్రాలు

### కారక పరిచ్ఛేదము:

1.ప్రాతిపదిక సంబోధనోక్తార్థంబులం బ్రథమయగు.

2. కర్మంబున ద్వితీయ యగు.

3. చేత వర్ణకంబు కర్తకగు.

4. చేత వర్ణకంబు హేతు కరణంబులకు గ్రహ్యాది యోగజంబగు పంచమికిని బహుళంబుగానగు.

5. కరణ సహార్థ తుల్యార్థ యోగంబులం దృతీయకుం దోడ వర్ణకంబగు.

6. వచ్యర్థాముఖ్య కర్మంబునకుఁ దోడ కువర్ణకంబులు ప్రాయికంబుగా నగు.

7. ఉపయోగంబునం దాఖ్యాంతకుం దోడ వర్ణకంబగు.

8. సంప్రదానంబునకుం జతుర్థియగు.

9. అపాయ భయ జుగుప్సా పరాజయ ప్రమాద గ్రహణ భవన త్రాణ విరామాంతర్ధి వారణంబు లెద్దాన నగు దానికి వలన వర్ణకంబగు.

10. ఉండిపదంబొకానొకచో వలన వర్ణకంబున కనుప్రయుక్తంబగు.

11. ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయా సప్తములు ప్రాయికంబుగ నగు.

12. కంటె వర్ణకం బన్యార్థాది యోగజంబగు పంచమికగు.

13. కంటె వర్ణకంబు నిర్ధారణ పంచమి కగు.

14. పట్టి వర్ణకంబు హేతువులగు గుణ క్రియల కగు.

15. శేషషష్ఠికి యొక్కయు నగు.

16. నిర్ధారణ షష్ఠికి లోపల వర్ణకంబగు.

17. అధికరణంబున సప్తమి యగు.

18. ఉకారంత జడంబునకు నవర్ణకంబగు.

19. విశేష్యంబునకుంబోలె విశేషణంబునకు లింగ విభక్తి వచనంబులగు.

20. స్త్రీసమంబులగు విశేషణంబులయు ముువర్ణకాంత విశేషణంబులయు బహువచనంబున కేకవచనంబు బహుళంబుగా నగు.

21. ఒకానొకచో నొక విభక్తికి మఱియొక విభక్తియు నగు.

22. జడంబు తృతీయా సప్తములకు ద్వితీయ బహుళంబుగా నగు.

23. ఉదంత జడంబు తృతీయకు నవర్ణకంబగు.

24. జడంబు ద్వితీయకుం బ్రథమ బహుళంబుగా నగు.

25. కాలాధ్వములకుం బ్రాయికంబుగాఁ బ్రథమ యగు.

26. సర్వనామ సంఖ్యాభిధాన తద్విశేష్యంబులయం దెయ్యది ముందు ప్రయోగింపంబడు దాని ద్వితీయాదులకుం బ్రథమ బహుళంబుగా నగు.

27. ఒకానొకచో విశేషణంబుల షష్ఠికిం బ్రథమ విభాషనగు.

28. భవత్యర్థ వ్యవహితంబులగు విశేషణంబులకుం బ్రథమయగు.

29. భవత్యర్థకంబు సన్నిహిత విశేషణంబునకును, దాని ముందు విశేషణంబుల కయి పదంబును బహుళంబుగా ననుప్రయుక్తంబగు.

30. అయి పదానుప్రయోగంబు లేనిచోఁ దుది విశేషణంబునకేని విశేషణంబు లన్నింటికేని మీఁది సముచ్చయార్థంబు విభాషం బ్రయోగింపం బడు.

31. ధాతుజ విశేషణ వ్యవధానంబున విశేషణంబు లన్నింటి కయి పదం బనుప్రయుక్తంబగు.

32. భావార్థకాది యోగంబునం గర్తకుం బ్రథమ యగు.

33. ప్రథమాంతంబులగు యుష్మ దస్మద్విశేషణంబుల కేకత్వంబున వునులును, బహుత్వంబున రుములు, నంతాగమంబులు ప్రాయికంబుగ నగు.

34. ఈ యాగమంబులు పరంబులగునపు డుత్వంబున కత్వంబగు.

35. అది శబ్దంబునకు వునులు పరంబులగునపుడును సంబోధనంబునందును దాన యను నాదేశంబగు.

36. అన్య యుష్మ దస్మత్కార్యంబులం దుత్తరోత్తరంబు బలీయంబు.

37. ఏక వాక్యంబునం దొకానొక్కండు తక్క సర్వ పదంబుల క్రమ నిరపేక్షంబుగం బ్రయోగింపం జను.

-0-

## సమాస పరిచ్ఛేదము:

1. సమర్థంబులగు పదంబు లేకపదంబగుట సమాసంబు.

2. సాంస్కృతి కాచ్ఛిక మిశ్రభేదంబుచే సమాసంబు త్రివిధంబు.

3. తత్పురుషాదులకు లక్షణంబు ప్రాయికంబుగ సంస్కృతోక్తంబ యగు.

4. ఆ, ఈ, ఏ యను సర్వనామంబులు త్రికంబు నాఁబడు.

5. కర్మధారయంబు త్రిక స్త్రీసమ ముగంత ధాతుజ విశేషణ పూర్వపదంబయి యుండు.

6. స్త్రీసమ ఘటితంబ యొకానొకండు బహువ్రీహి చూపట్టెడు.

7. ఆచ్ఛిక శబ్దంబుతోడ స్త్రీసమంబు ప్రాయికంబుగా ద్వంద్వంబగు.

8. సర్వ శబ్దంబులు సంబంధంబునందుం దచ్ఛబ్దంబుతోడ సమసించు.

9. ధాతుజ విశేషణంబులకు విభక్తి వివక్షించునపుడు తచ్ఛబ్దం బనుప్రయుక్తంబగు.

10. ఎల్లయెడల ధాతుజ విశేషణంబుల కట్టి యనుపదంబు విభాష ననుప్రయుక్తంబగు.

11. యుష్మదస్మ దాత్మార్థకంబుల కుత్తర పదంబు పరంబగునపుడు దుగాగమంబు విభాషనగు.

12. గుణవచనంబులగు నల్లాదులకుం గర్మధారయంబునందు నిగాగమంబు బహుళంబుగా నగు.

13. ద్విరుక్తంబగు హల్లు పరంబగునపు డాచ్ఛికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు.

14. త్రికంబుమీఁది యసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగా నగు.

15. కృత హ్రస్వంబగు త్రికంబు మీఁది చోటు శబ్దంబు నోత్వంబున కత్వ హ్రస్వంబులు విభాషనగు.

16. ఉత్తర పదంబగు చోటు శబ్దము టాక్షరమునకు లోపంబు విభాషనగు.

17. సమానాధికరణంబగు నుత్తరపదంబు పరంబగునప్పుడు మూఁడు శబ్దము డుజ్వర్ణంబునకు లోపంబును, మీఁది హల్లునకు ద్విత్వంబునగు.

18. ద్విగువున కేకవచనంబు ప్రాయికంబుగా నగు మిశ్రంబునకుఁ గాదు.

19. కొండొకచో సమాసంబులందు నామ్వాది కనుమ్వాదుల మువర్ణంబులు పవ్వ వర్ణంబులగు.

20. నిక్కలాదులు యథా ప్రయోగంబుగ గ్రాహ్యంబులు.

21. ఆకారంబున కామ్రేడితంబునకుం దదర్థకంబున కయి యాయి యను శబ్దంబులు

విభాషనగును.

22. బహువ్రీహిని సమాసాంత కార్యంబులుం గానంబడియెడి.

23. బహువ్రీహిని స్త్రీవాచ్యంబగుచో నుపమానంబుమీఁది మేనునకు బోఁడి యగు.

24. ద్వంద్వంబునందు ఋకారంబునకు రవర్ణంబు విభాషనగు.

25. సమాసవిభక్తికి లోపంబగు లట్టునకుఁ గాదు.

26. కర్మాదులకుఁ బ్రాధాన్య వివక్షయందు ధాతుజ విశేషణంబులు కర్తతోడంబోలె వాని తోడ సమసించు.

-0-

## తద్ధిత పరిచ్ఛేదము:

1. తన వర్ణకంబు త్వార్థంబునందగు.
2. ఇట విశేషం బుత్సర్గంబునకు విభాషను బాధకంబగు
3. చిన్నాదులకు ఱిక వర్ణకంబగు.
4. ఉత్వంబున కత్వంబు ఱికము పరంబగు నపుడగు.
5. పేర్వాదుల కిమి వర్ణకంబగు.
6. నవర్ణకంబు గుణవచనంబులగు నల్లాదులకగు.
7. ఇక వర్ణకం బగ్గలాదులకగు.
8. మగఁటిమ్యాదులు యథా ప్రయోగంబుగ గ్రాహ్యంబులు.
9. అరమరాదులకు స్వార్థంబునందిక వర్ణకంబగు.
10. ఉక వర్ణకంబు చిఱుతాదులకు స్వార్థంబునం దగు.
11. కాకత్తియ వర్ణకంబులు పుంస్త్వ స్త్రీత్వంబుల మతుబర్థంబునం దాటాదులకగు.
12. కాకత్తియల కకారంబునకు గకారంబు కొండొకచోఁ గానంబడియెడి.
13. కాకత్తియలు కొండొక వానికి స్వార్థంబునం జూపట్టెడు.
14. కావర్ణకంబు తిర్యక్కులకుం గానంబడియెడి.

15. అటమటాదులకు మతుబర్థంబునం దీవర్ణకంబు పుంస్త్వంబు నందగు.

16. ఈ ప్రత్యయంబు కొన్నింటికి స్వార్థంబునం దగు.

17. అరివర్ణకంబు మతుబర్థంబున జాలాదులకగు.

18. ఇ వర్ణకం బోయారాదులకు మతుబర్థంబునం దగు.

19. త వర్ణకంబు కులవాచకంబునకు స్త్రీ వాచ్యంబగు నపుడు మతుబర్థంబునందగు.

20. తవర్ణకంబు పరంబగుచో నొకానొకచో నెత్వంబు చూపట్టెడు.

21. యవతి విటీ రజస్వలలు గుబ్బెత మిండత ముట్టుతలు నాఁబడుదురు.

22. వగాదులకు బహువచనాంతంబులకు స్త్రీవాచ్యంబగునపుడు మత్వర్థంబునం దాఁడి వర్ణకంబగు.

23. వగాదులకు బహువచనాంతంబులకుఁ బుంస్త్వంబున మతుబర్థం బాకారంబగు.

24. ముక్కులోనగు వానికిం దదభావ ద్యోతకంబయి మతుబర్థంబునం దిఁడి వర్ణకంబగు.

25. మానార్థంబున కేకత్వంబునం దెఁడు వర్ణకంబగు.

26. ఎఁడు వర్ణకంబు పరంబగునపుడు లివర్ణంబు లోపించు.

27. దఘ్నార్థంబున బంటి కొలఁదు లగు.

28. అర్థవిశేషంబుల వర్ణకాంతరంబులును మాహత్ర్పయోగంబుల నెఱుంగునది.

-0-

<u>కృదంత పరిచ్ఛేదము</u>

1. కృత్తుల కర్థంబులు యథా వ్యవహారంబుగ గ్రాహ్యంబులు.

2. ఇటం గృత్కగతపవేములు పరంబగునపుడు క గ చ య వలకు లోపంబగు.

3. కవర్ణకం బలుగ్వాదుల కగు.

4. ఇమి వర్ణకంబు కలుగ్వాదుల కగు.

5. తజ్వర్ణకంబు చేయ్వాదు కగు.

6. కువ వర్ణకం బడంగ్వాదుల కగు.

7. టవర్ణకం బాడ్వాదుల కగు నగుచో నంత లోపంబగు.

8. టువర్ణకంబు పడ్వాదుల కగు నగుచో నవి యాద్యక్షర శేషంబులయి దీర్ఘంబు నొందు.

9. పవర్ణకంబు తిరియ్వాదుల కగు.

10. తవర్ణకం బావులించు లోనగు వాని కగు.

11. పువర్ణకంబు మాయ్వాదుల కగు.

12. ఇక వర్ణకం బంజ్వాదుల కగు.

13. అప్పాదులకు నజి యగు.

14. బడి యేల్వాదుల కగు.

15. గడ చేర్వాదుల కగు.

16. ఇకి కోర్వాదుల కగు.

17. వు వర్ణకంబు మన్వాదుల కగు.

18. అవర్ణకంబు గీఱ్వాదుల కగు.

19. అక వర్ణకంబు మాఱ్వాదుల కగు.

20. డువర్ణకం బాఱ్వాదుల కగు నగుపుడు పకారంబు చయల కగు.

21. ఉవర్ణకం బడుక్వాదుల కగు.

22. వి ప్రభృతు లిట్లెఱుంగునది.

–0–

## ప్రకీర్ణక పరిచ్ఛేదము:

1. పదాద్యంబులు ఋ ౠ వర్ణంబులు రల తుల్యంబులు

2. అచ్ఛిక పదంబులం దుత్తుమంబులగు రులుడుల ముందఱి యేత్వంబునకు హ్రస్వంబు విభాషనగు.

3. ఊయేల పయ్యెద తాయెతులం ద్రిక్క నామంబులందు యాకుం దాలవ్య వక్ర యోగంబు లేదు.

4. ఊయేల యూయాలల చాఁపుల నొండింటికిం గుఱుచయొండె నగు.

5. పయ్యెద పయ్యద.

6. ఊయేలాదులందొలి యచ్చు మీఁది హల్లునకు ద్విర్వచనం బొండె నగు.

7. అకారంబు క్రింది అకారంబునకుం దుది ను లు ల క్రింది నలలకు లోపంబు బహుళంబుగ నగు.

8. అక్కటాదుల జడ్డకు లోపంబు విభాషనగు.

9. జడ్డక్కరంబుతోఁ బదాది స్వరంబు గూడుచో జడ్డకు లోపంబు లేదు.

10. హాదులయు, నీలుగు లోనగు వాని తొలి హల్లునకు లోపంబు బహుళంబుగ నగు.

11. ఆరాటాదులం బ్రథమేతర దీర్ఘంబునకు హ్రస్వంబు విభాషనగు.

12. ఓయారాదులం దొలి దీర్ఘంబునకు హ్రస్వంబు విభాషనగు.

13. అడంగ్వాదుల డాకు ణకారంబు విభాషనగు.

14. దక్కులోనగువాని దాకు డకారంబు విభాషనగు.

15. ఏతాదులకు మువర్ణకంబు పరంబగునపుడు దీర్ఘంబు విభాషనగు.

16. పదాంతంబులయి యసంయుక్తంబులయిన నులురుల యుత్తంబునకు లోపంబు బహుళంబుగనగు.

17. ఆచ్ఛికంబులం బదమధ్యంబుల నలదరల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు.

18. లాఁతి యచ్చునకు సహితమొకానొకచో నుడినడుమ లోపంబు గానంబడియెడి.

19. అబ్బురాదులం దుత్వంబునకు లోపంబు విభాషనగు.

20. చుక్కరక రువర్ణంబునకు ముందఱి దువర్ణకంబు నుత్వంబునకు లోపంబు విభాషనగు, నగుచోఁ దత్పూర్వంబు గురువుగాదు.

21. జాదాదుల దాకు జకారంబు విభాషనగు.

22. నిందయం దామ్రేడితంబు నాద్యక్షరములకు హ్రస్వ దీర్ఘంబులకు గిగీలగు.

23. పాదంబునం బ్రథమ ద్వితీయాక్షరములు వళి ప్రాసంబులు నాబఁడు.

24. య వ ల లు లఘ్వలఘువులు మైత్రింబొరయు రేఫంబులు పొరయవు.

25. రేఫంబులు లఘ్వలఘువులుం దక్కుంగల విశేషంబులు నార్య వ్యవహారంబులఁ దెలియుట శ్రేయంబు.

–0–

# మాదిరి ప్రశ్నపత్రం

సమయం: 3 గం?లు                                                                మార్కులు: 70

అ) ఈ క్రిందివానిలో రెండింటికి సమాధానాలు వ్రాయండి. $2 \times 10 = 20$

1) సమాసాన్ని నిర్వచించి, బాలవ్యాకర్త పేర్కొన్న సమాస నిర్మాణాన్ని గురించి వివరించండి?

2) చిన్నయసూరి పేర్కొన్న తత్సమ క్రియా సాధనను తెలియజేయండి?

3) కృదంతం అంటే ఏమిటో తెలిపి , చిన్నయసూరి కృ దంత పరిచ్ఛేదంలో పేర్కొన్న కృత్తులను గురించి వ్రాయండి?

4) బాల వ్యాకరణం లో కారక విధానం గురించి వివరించండి .

ఆ) ఈ క్రిందివానిలో నాలుగు సూత్రాలను వ్యాఖ్యానించండి. 4 x 5 = 20

%1) కర్మంబున ద్వితీయ యగు.

2) ఒకానొకచో నొక విభక్తికి మఱియొక విభక్తియు నగు.

3) సాంస్కృతి కాచ్ఛిక మిశ్ర భేదంబుచే సమాసంబు త్రివిధంబు.

4) మగఉటిమ్యాదులు యథాప్రయోగంబుగ గ్రాహ్యంబులు.

5) లిడ్లాట్టుల వకారంబునకు లోపంబు విభాషనగు.

6) క వ్యతిరేక క్త్వార్థంబునం దగు.

7) వడి ప్రభృతు లిట్లెఱుంగునది.

8) ఓయారాదులం దొలి దీర్ఘంబునకు హ్రస్వంబు విభాషనగు.

3) కృదంతం అంటే ఏమిటో తెలిపి, చిన్నయసూరి కృదంతపరిచ్ఛేదంలో పేర్కొన్న కృత్తులను గురించి వ్రాయండి?

4) బాలవ్యాకరణంలో కారక విధానం గురించి వివరించండి.

ఇ) ఈ క్రింది వానిలో రెండింటికి సందర్భసహిత వ్యాఖ్యలను వ్రాయండి. 2 X 5 = 10

1) "తుల్యార్థ యోగంబున షష్ఠియు నగు"

2) "వక్ష్యమాణంబు యద్విత్వంబు"

3) "కాప్రత్యయాంతంబునకు మగాది గణనంబునం జేసి దుజ్జగు"

4) "ఆర్ ఏ ఓ – ఈ మూడును గుణంబులు నాఉబడు"

ఈ) ఈ క్రింది వానిలో నాల్గింటికి రూపనిష్పత్తులను పేర్కొనండి. $4 \times 2\ 1/2 = 10$

1) ముక్కంటి

2) తొత్తఱికము

3) వండితి

4) జయించెను

5) కినుక

6) అమ్మకము

8)అయ్యెను

7) ఏతాము

ఎ) ఈ క్రింది పారిభాషిక పదాలలో నాల్గింటిని వివరించండి. $4 \times 2\ 1/2 = 10$

1) తృవర్ణకార్థం

2) నామము

3) భావార్థకం

4) ముత్తు

5) శబ్దపల్లవము

7) చేదర్థము

6) సంప్రదానము

8) అధికరణము